
మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

'మావోయిస్టు రహిత భారత్' కోసం బిజెపి సైనిక విన్యాసం
చైనా నేతృత్వంలో మధ్యవర్తిత్వ సంస్థ
నైజీరియాలో వరదలు 111 మందికిపైగా మృతి
ఇండోనేషియాలో కూలిన క్వారీ
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 181 | శనివారం | 31-05-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# బిజెపిలో బిఆర్ఎస్ విలీనం తథ్యం!

- బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలే నిదర్శనం
- బిజెపి నేతలు ముందుగా రాజాసింగ్ వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలి
- వాటాల కోసం కెసిఆర్ కుటుంబంలో కొట్లాట
- టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాపక్షం / హైదరాబాద్

బిజెపిలో బిఆర్ఎస్ విలీన యత్నాలపై ఎమ్మెల్సీ కవిత, బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలతో ఆ రెండు పార్టీల లోపాయికారీ ఒప్పందం బట్టబయలైందని కాంగ్రెస్ ఆరోపించింది. వారి వ్యాఖ్యలపై రెండు పార్టీల నాయకులు సమాధానం చెప్పాలని నిలదీసింది. ఇక బిఆర్ఎస్ మునిగిపోయే నావే అని పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ జోస్యం చెప్పగా, బిజెపిలో బిఆర్ఎస్ విలీనమా? విక్రయమా? అని ఆ పార్టీ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. బిఆర్ఎస్ మునిగిపోయిన నావ అని, నావలో ఉన్న వస్తువుల( డబ్బుల) కోసం కెసిఆర్ కుటుంబంలో కొట్లాట జరుగుతున్నదని, వాటాల కోసం పంచాయితీ మొదలైందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ,బిజెపి ఎమ్మెల్యే రాజా సింగ్ వ్యాఖ్యలతో ముడుపులు , బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం గుట్టు వీడిందన్నారు. కవిత, రాజా సింగ్ ప్రకటనలను పరిశీలిస్తే బిజెపిలో బిఆర్ఎస్ విలీనం తథ్యమన్నారు. రాష్ట్రంలో 8 సీట్లు ఉన్న బిజెపితో కలిస్తే బిఆర్ఎస్ కూడా 8 స్థానాలకు పరిమితమవుతుందన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా తరువాయి 2లో



కాళేశ్వరం విషయంలో నోటీసులు రాగానే కెసిఆర్, ఈటల రాజేందర్‌ల మధ్య పాత బంధం మళ్ళీ చిగురించింది. శామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో హరీష్‌రావుతో బిజెపి ఎంపి ఈటల రాజేందర్ సమావేశం అయ్యారు. ఇద్దరు కలిసి కెసిఆర్‌తో ఫోన్‌లో సంభాషించారు.
– మహేశ్‌కుమార్‌గౌడ్

## లోపాయికారీ ఒప్పందాన్ని మీడియా ముఖంగా వెల్లడించాలి

ఎంపి చామల



బిజెపి, బిఆర్ఎస్ పార్టీల లోపాయికారి ఒప్పందాలపై రెండు పార్టీల నేతలు రకరకాలుగా మాట్లాడుతున్నారని, అసలు బిజెపిలో బిఆర్ఎస్ విలీనమా? లేక విక్రయమా అనేది రెండు పార్టీల నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించాలని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లు బిఆర్ఎస్ నేతలు ఎలా దోచుకున్నారనే అంశంపై బిఆర్ఎస్ ఎంఎల్‌సి తరువాయి 2లో

## కాషాయపార్టీలో కలవడాన్ని అస్సలు ఒప్పుకోను

బిజెపిలో బిఆర్ఎస్ కలపడమంటే.. లిక్కర్ కేసులో నేరాన్ని అంగీకరించినట్లే : ఎమ్మెల్సీ కవిత



ప్రజాపక్షం / మంచిర్యాల ప్రతినిధి

బిజెపిలో బిఆర్ఎస్ విలీనం చేయడాన్ని తాను అస్సలు ఒప్పుకోనని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బిజెపిలో బిఆర్ఎస్ కలపడమంటే.. లిక్కర్ కేసులో నేరాన్ని అంగీకరించినట్లే అని వ్యాఖ్యానించారు. బిజెపితో పొత్తు పెట్టుకున్న పార్టీలు బాగుపడలేదని అన్నారు. మంచిర్యాలలో కవిత శుక్రవారం మీడియా ప్రతినిధులతో 'చిట్‌చాట్' చేశారు. ఎన్నో ఆవేదనలు భరించలేక, పార్టీని కాపాడుకోవాలనే కెసిఆర్‌కు లెటర్ రాశానని తెలిపారు. దానిని ఎవరు లీక్ చేశారో తేల్చాలని డిమాండ్ చేశారు. 'నాకు ప్రత్యేక జెండా.. ఎజెండా లేదు. పార్టీని కాపాడుకోవడమే నా ఏకైక ఎజెండా. కెసిఆర్‌ను కలిసే అవకాశం వచ్చినా కలవలేకపోయాను. పెద్దాయనను ఎవరేమన్నా ఊరుకోను' అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కెసిఆర్‌కు నోటీస్ ఇస్తే ఎందుకు బిఆర్ఎస్ ముఖ్య నేతలు ఎందుకు స్పందించలేదని కవిత ప్రశ్నించారు. లేఖలో ప్రస్తావించిన అంశాలు ప్రజలు అనుకునేవే అని స్పష్టం చేశారు. పార్టీ నుంచి తనను బహిష్కరిస్తారని అనుకోవడం లేదని ఆమె పేర్కొన్నారు. అంతకు ముందు మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా శ్రీరాంపూర్ చేరుకున్న కవిత తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి శ్రీరాంపూర్ ఏరియాలోని బిఆర్ఎస్ యూత్ నేత తరువాయి 2లో

## తప్పు చేసినవారు తప్పించుకోలేరు



ఒక్కొక్కటిగా బయటపడుతున్న కెసిఆర్ తప్పులు
కాళేశ్వరం కమిషన్ తుదినివేదిక అందగానే మంత్రివర్గంలో చర్చిస్తాం
ప్రాజెక్టుల అంశంలో ప్రధాన ముద్దాయి ఎల్ అండ్ టి సంస్థే
మీడియా 'ఇష్టాగోష్టి'లో మంత్రి పొంగులేటి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

శిశుపాలుని తరహాలో కెసిఆర్ తప్పులు ఒక్కొక్కటిగా తప్పుల జాబితాలో 99 వరకు చేరుకుంటున్నాయని,తప్పు చేసిన వారు తప్పించుకునే పరిస్థితే లేదని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచర పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 'కాళేశ్వరం కమిషన్ తుది నివేదిక' అందగానే మంత్రివర్గంలో చర్చించి, బాధ్యులపైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాళేశ్వరం అంశంలో ఎల్‌అండ్‌టి సంస్థ ప్రధాన ముద్దాయి అని అన్నారు. బడాబాబుల చేతిలో కబ్జా అయిన అసైన్డ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, ఆ భూముల్లో ఒక వేళ నిరుపేదలు ఉంటే వారికి పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ గృహాలను నిర్మిస్తామని వెల్లడించారు. బిఆర్ఎస్‌లో ఎంఎల్‌సి కవిత వ్యవహారం టి కప్పులు తుఫాను లాంటిదని ఆయన తరువాయి 2లో



## మిస్ వరల్డ్ ఫైనల్స్ నేడే

మూడంచెల భద్రత-పాస్ ఉన్నవారికే అనుమతి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ హైటెక్స్ వేదికగా శనివారం జరగనున్న 72వ మిస్ వరల్డ్ గ్రాండ్ ఫైనల్‌కు సర్వంసిద్ధమైంది. ఈ పోటీలకు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. భద్రత చర్యలను పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈవెంట్ పాస్‌లు ఉన్నవారిని మాత్రమే హైటెక్స్‌లోకి అనుమతిస్తామని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి పేర్కొన్నారు. పోలీసులకు సైతం ప్రత్యేక పాస్‌లు తరువాయి 2లో



## ఒకే షిఫ్ట్‌లో... 'నీట్ పీజీ-2025'

సుప్రీంకోర్టు కీలక ఆదేశం

**న్యూఢిల్లీ :** జూన్ 15న జరుగనున్న నేషనల్ ఎలిజిబిలిటీకమ్ఎంట్రన్స్ టెస్ట్‌పోస్ట్‌గ్రాడ్యుయేట్ (నీట్ పీజీ)2025ను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించాలని శుక్రవారం సుప్రీంకోర్టు ఒక కీలక ఉత్తర్వులను జారీచేసింది.రెండు షిఫ్ట్‌లలో నిర్వహించడం 'ఏకపక్షాన్ని సృష్టించడమే' అని వ్యాఖ్యానించింది. ధర్మాసనానికి నేతృత్వం వహించిన జస్టిస్ విక్రమ్ నాథ్ నీట్ పీజీ 2025 ఎగ్జామ్‌ను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.పూర్తి పారదర్శకత పాటించేలా సురక్షిత కేంద్రాలను తరువాయి 2లో

## 'కాళేశ్వరం' కమిషన్ నోటీసులపై ఎలా వ్యవహరిద్దాం



బిఆర్ఎస్ చీఫ్ కెసిఆర్‌తో మాజీమంత్రి హరీశ్‌రావు భేటీ
గులాబీ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలపై చర్చ

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావుతో మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో మరోసారి శనివారం సమావేశమయ్యారు.'కాళేశ్వరం' కమిషన్ ముందు విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో కెసిఆర్‌తో హరీశ్ రావు సమావేశమైనట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విచారణ సమయంలో వ్యవహరించాల్సిన తీరును, తదితర అంశాలపై వారు చర్చించినట్టు తెలుస్తోంది. విచారణ కమిషన్ ముందు కెసిఆర్ హాజరవుతారా? లేదా? ఒక సమగ్రమైన వివరాలతో కూడిన సమాధాన లేఖను కమిషన్‌కు అందజేస్తారా? అనే అనుమానాలు తరువాయి 2లో

## చీఫ్ ఇంజినీర్ ఇంట్లో రూ.2కోట్ల నోట్ల కట్టలు స్వాధీనం

ఒడిషా విజిలెన్స్‌కు చిక్కిన అవినీతి తిమింగలం..



**భువనేశ్వర్ :** ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఓ భారీ అవినీతి తిమింగలం విజిలెన్స్‌కు చిక్కింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న బైకుంఠ నాథ్ సారంగి నివాసాల్లో భారీ మొత్తంలో నోట్ల కట్టలు బయటపడ్డాయి. వాటిని చూసి అధికారులు షాక్ గురయ్యారు. సారంగి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు సోదాలు చేపట్టారు. ఒడిశాలోని అంగుల్, భువనేశ్వర్, పూరిలోని పిపిలి సహా మొత్తం ఏడు ప్రాంతాల్లోని సారంగి నివాసాలు, కుటుంబ సభ్యులు, సన్నిహితుల తరువాయి 2లో

## రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నల్లగొండ మార్గదర్శకమవ్వాలి

అధికారులు నిర్లిప్తతను వీడి ప్రజాసంక్షేమానికి కట్టుబడి పనిచేయాలి
ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఉద్యోగులు ముందుకు సాగాలి
ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఉద్యోగులు ముందుకు సాగాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అమలులో ఉద్యోగులదే కీలక పాత్ర అని చెప్పారు. శుక్రవారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ధాన్య సేకరణ, వ్యవసాయం, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి పథకాలపై ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించిన సమీక్ష సమావేశాన్ని రాష్ట్ర పౌర సరఫరాల, నీటి పారుదల శాఖ మమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరువాయి 12లో

## సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల అమలులో అధికారులు పారదర్శకత పాటించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో తరువాయి 2లో

## నందమూరి బాలకృష్ణకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు



విజయ్ దేవరకొండకు కాంతారావు పురస్కారం

పదేళ్లకుగాను గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డులను ప్రకటించిన ప్రభుత్వం
ఒక్కో ఏడాదికి మూడు సినిమాల చొప్పున అవార్డుల కోసం ఎంపిక చేసినట్లు జ్యూరీ చైర్మన్ మురళీమోహన్ వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

పదేళ్ల (2014–2023)కాలానికిగాను గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. ఆరుగురు సినీ ఉద్దండుల పేర్లతో ఏర్పాటు చేసిన అవార్డులను కూడా గద్దర్ అవార్డుల జ్యూరీ కమిటీ శుక్రవారం ప్రకటించింది. ఎన్‌టిఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డును నందమూరి బాలకృష్ణకు ప్రకటించగా.. పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డును ప్రముఖ దర్శకుడు మణిరత్నం, బిఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డును దర్శకుడు సుకుమార్, నాగిరెడ్డి చక్రపాణి ఫిల్మ్ అవార్డును అట్లూరి పూర్ణచంద్రరావు, కాంతారావు ఫిల్మ్ అవార్డును విజయ్ దేవరకొండ, రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డును ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ కు జ్యూరీ చైర్మన్ మురళీమోహన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం సినిమాలకు అవార్డులు అందించలేదని మురళీమోహన్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉత్తమ సినిమాలకు అవార్డులు ఇవ్వాలని నిర్ణయించి, గద్దర్ పేరుతో అవార్డులు ఏర్పాటు చేయడం సంతోషకరమని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మురళీమోహన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీకి చైర్మన్ గా 2014 నుంచి 2023 వరకు ఏడాదికి ఒక ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేశామని జ్యూరీ సభ్యులు తెలిపారు. ఇందులో ప్రముఖ నిర్మాత దిల్ రాజు కూడా ఉన్నారు. 2024 ఏడాదికి సంబంధించిన తరువాయి 12లో




## మూడు రోజులు భారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. బాలాసోర్‌కు 180 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైందన్నారు. పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్‌లో మధ్య తీరం దాటనున్నదన్నారు. ఈ వాయుగుండం తుపానుగా మారే అవకాశం కూడా ఉందన్నారు. రానున్న రెండు రోజులు ఆదిలాబాద్, కొమరంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, తరువాయి 2లో

## నీకింత... నాకింత అసలు 'స్టంట్' రేటెంత?



- ఆసుపత్రుల్లో స్టంట్ల మాయాజాలం
- కరువైన వైద్యాధికారుల పర్యవేక్షణ
- వైద్యం మాటున హద్దులు దాటిన దోపిడీ

ప్రజాపక్షం/ఖమ్మం

మారిన కాలమాన పరిస్థితులు , ఆహారపు అలవాట్ల నేపథ్యంలో పెరిగిన వ్యాధులకు అనుగుణంగా వైద్య చికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయి. కానీ వైద్యం పొందాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి. ఆసుపత్రుల నిర్వాహకుల నోటికి దండం పెట్టి బిల్లులు చెల్లించాల్సిందే. గుండెజబ్బుల బారినపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మూసుకుపోయిన గుండె రక్త నాళాలను తెరిచేందుకు స్టంట్ వేస్తుంటారు. ఆరోగ్య శ్రీ పథకంలో వేస్తున్న స్టంట్లకు, విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న స్టంట్లకు జీవిత కాలం విషయంలో పెద్ద తేడా లేకపోయినా విదేశీ పేరుతో అధిక మొత్తం గుంజేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇక అసలు ఈ స్టంట్ల రేటెంత అన్నది ఒక మాయాజాలం. ఒక ఆసుపత్రిలో రూ. 70వేలు తీసుకుంటే అదే స్టంట్‌కు మరో ఆసుపత్రిలో రూ. 1,80,000 తీసుకుంటున్నారు. స్టంట్‌లో తేడా లేకపోయినా కొనుగోలులో ఎందుకు తేడా వచ్చిందంటే సమాధానం ఉండడం లేదు. ఛాతీ నొప్పితో ఆసుపత్రికి వస్తే ప్రథమ చికిత్స అందించి వెంటనే రూ. 17వేలు విలువ చేసే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. రక్త నాళాల్లో బ్లాక్ ఏర్పడిందని వెంటనే స్టంట్ వేయాలని లేకపోతే ప్రాణం పోతుందని పక్కన ఉన్న బంధువులను ఒక రకంగా భయపెట్టి హడావుడి సృష్టిస్తారు. ఒకవేళ వారు చెప్పిన మొత్తం చెల్లించకపోతే ప్రాణం దక్కదేమోనని అడిగినంత సమర్పించుకోవడం జరుగుతుంది.

**మా కెంత మీ కెంత :** పొరపాటున ఏ రోగి అయినా ఆర్ఎంపి సాయంతో వచ్చాడంటే డబుల్ బాదుడే. ఖమ్మం వైరా తరువాయి 12లో


## నిబంధనల మేరకే ఇళ్ల నిర్మాణం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నియామకపత్రాలు అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హుస్నాబాద్

తెలంగాణలో అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అందులో ప్రభుత్వ నిబంధనల మేరకే లబ్దిదారులు తమ ఇళ్లు నిర్మించు కోవాలని తెలంగాణ బి సి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభకర్‌గౌడు అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండల మరియు పట్టణ లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఏంపిక పత్రాల పంపిని కార్యక్రమానికి జ్లిలా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరిమాఅగర్‌వాల్,జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి తో కలిసి హాజరై పత్రాలను పంపిని చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ మాడల్ ఇళ్లును ప్రారంబించి లబ్దిదాలకు చూపించారు. మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణానికి తొలి విడత 144 ఇళ్లను మంజూరి చేశామని మరోమారు మంజూరి చేస్తామని అన్నారు. ఇందులో వంద శాతం పేదలను మాత్రమే ఏంపిక చేశామని అన్నారు. లబ్దిదారులు తోందరగా ఇళ్లు కట్టుకుని ప్రవేశాలు చేసుకోవాలని కొరారు. గత ప్రభుత్వం 10 ఏళ్ల వరకు పేదలకు ఇళు ఇవ్వ లేవని కాంగ్రెస్ పాలనలో ఏడాదికి నియోజకవర్గానికి 1420 ఇళ్లు మంజూరి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## నైజీరియాలో వరదలు
# 111 మందికి పైగా మృతి



**అబూజా:** నైజీరియాలో వరదలకు కనీసం 111 మంది మృతి చెందారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. నిగర్ రాష్ట్రంలోని వాణిజ్య పట్టణమైన మొక్వాను వరద నీరు ముంచెత్తడంతో, చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. ఎంత మంది మృతి చెంది ఉంటారనేది ఇప్పుడే చెప్పలేమని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారి హుస్సేనీ ఇషా తెలిపారు. మిన్నాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ 88 మృత దేహాలను వెలికితీసినట్టు చెప్పారు. మృతుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# చైనా నేతృత్వంలో మధ్యవర్తిత్వ సంస్థ

## ప్రపంచ దేశాల మద్దతు



**హాంకాంగ్:** ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని తొలగించడంతోపాటు, ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి చైనా నేతృత్వంలో ఏర్పాటైన అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సంస్థ (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మీడియేషన్/ ఐఓఎం) ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దీనికి ప్రపంచ దేశాల లభిస్తున్నది. శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశానికి పాకిస్తాన్ నుంచి ఇండోనేషియా వరకు... బెలారస్ నుంచి క్యూబా వరకు... 50కిపైగా దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో పాల్గొన్న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మాట్లాడుతూ ప్రపంచ శాంతికి కృషి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరస్పర అవగాహన, చర్చలు, సంఘీభావం, ఏకాభిప్రాయం వంటి మార్గాల విభేదాలను పరిష్కరించుకోవచ్చన్నది అనాదిగా చైనా అభిప్రాయమని అన్నారు. ఎవరు గెలిచారు.. ఎవరు ఓడారు అనే ప్రశ్నకు ఆస్కారం లేకుండా, విశ్వశాంతికి, దేశాల మధ్య సయోధ్యకు ఐఓఎం కృషి చేస్తుందని అన్నారు. కాగా, వివిధ దేశాలతో కూడిన తొలి అధికారిక మధ్యవర్తిత్వ సంస్థకు చైనా శ్రీకారం చుట్టింది. దేశాల మధ్య నెలకొన్న సమస్యలను, వివాదాలను పరిష్కరించడానికి ఈ సంస్థ హాంకాంగ్ కేంద్రంగా పని చేస్తుంది. ఈ ఏడాది చివరి నాటికి అధికారికంగా ఇది కార్యకలాపాలను మొదలుపెట్టే అవకాశాలు ఉన్నాయి. ప్రపంచ దేశాల జోక్యంతో వివాదాలు సులభంగా పరిష్కారమవుతాయని చైనా భావిస్తున్నది. శుక్రవారం నాటి సమావేశానికి ఐక్యరాజ్య సమితి, ఇతర ప్రధాన అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. దేశాల మధ్య, దేశాలు మరియు విదేశీ వ్యక్తులు మధ్య, అంతర్జాతీయ వాణిజ్య సంస్థల మధ్య తలెత్తే వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడానికి సంస్థ ఏర్పాటైంది. పరస్పరం అర్థం చేసుకోవడం, చర్చించుకోవడం, సమ్మతి తెలపడం ద్వారా సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యాన్ని ఈ సంస్థ ముందుకు తీసుకువెళుతుంది. ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య సయోధ్య కోసం ఏర్పడిన తొలి సంస్థగా ఐఓఎం గుర్తింపు పొందుతుంది. హాంకాంగ్‌లో కామన్ లాతోపాటు చైనా న్యాయ వ్యవస్థల సమ్మేళనంతో ఉన్న న్యాయ వ్యవస్థను ఉపయోగించి, అంతర్జాతీయ న్యాయ సేవలకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా ఎంచుకున్నారు.

**సభ్యత్వం పొందని భారత్**

అనేక దేశాల మద్దతు లభిస్తున్నప్పటికీ, ఐఓఎంలో భారత్ సభ్యత్వం తీసుకోలేదు. గ్లోబల్ సౌత్ దేశాల్లో ప్రభావాన్ని పెంచుకోవడానికి, అంతర్జాతీయ న్యాయ వ్యవస్థలో తన పాత్రను విస్తరించడానికి చైనా చేస్తున్న ప్రయత్నాలకు ఉదాహరణగా ఈ సంస్థను విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్థ ద్వారా చైనా, అంతర్జాతీయ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అందించడానికి, మరియు హాంకాంగ్‌ను అంతర్జాతీయ న్యాయ సేవల కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోంది. కానీ, భారత్ ఈ సంస్థకు దూరంగా ఉంది. భవిష్యత్తులోనైనా చేరుతుందా? అనేది అనుమానమే.

# ఇండోనేషియాలో కూలిన క్వారీ

## కనీసం 10 మంది మృతి



**బండుంగ్:** ఇండోనేషియాలో శుక్రవారం క్వారీ కూలిన ఘటనలో కనీసం 10 మంది మృతి చెందగా, ఆరుగురి జాడ తెలియడం లేదు. ప్రమాదం జరిగినప్పుడు క్వారీలో ఎంత మంది ఉన్నారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే, కనీసం పాతిక మంది పని చేస్తుండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతుండగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. సిరెబాన్ జిల్లాలో జరిగిన క్వారీ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం జరుగుతున్నదని స్థానిక పోలీస్ చీఫ్ సుమర్ని తెలిపారు.

క్వారీ యజమాని, అక్కడ పని చేస్తున్న కార్మికులను ప్రశ్నిస్తున్నట్టు ఆమె చెప్పారు. క్వారీలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని ఆమె అన్నారు. ప్రస్తుతం తమ వద్ద ఎక్కువ సమాచారం లేదని, విచారణ అనంతరమే వివరాలు తెలుస్తాయని సుమర్ని పేర్కొన్నారు.

# భారత్ తీరు గర్హనీయం

## సింధు నదీ జలాల అంశంపై పాక్ ప్రధాని షాబాజ్



**దుషాన్బే (తజికిస్తాన్):** సింధు నదీ జలాల ఒప్పందాన్ని భారత్ ఏకపక్షంగా నిలిపివేసిందని పాకిస్తాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ విమర్శించారు. నీటి యుద్ధానికి కాలుదువ్వుతున్న భారత్ తీరు గర్హనీయమని వ్యాఖ్యానించారు. మంచు తుపాన్లపై ఐక్యరాజ్య సమితి, యునెస్కో, ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పాల్గొన్న షాబాజ్ మాట్లాడుతూ ఈ అంశాన్ని లేవనెత్తారు. నదీ జలాల అంశాన్ని భారత్ రాజకీయం చేస్తున్నదని ఆరోపించారు. వేలాది మంది ప్రజల సంక్షేమం, భవిష్యత్తుతో ముడిపడిన సింధు నదీ జలాల ఒప్పందం రద్దును అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. 'భారత్ పరుధులు దాటితే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. మంచు తుపానుల కారణంగా పాకిస్తాన్ ఎదుర్కొంటున్న సమ స్యలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణపైన కూడా మాట్లాడారు. ఈ సదస్సులో 80 దేశాలు, 70 అంతర్జాతీయ సంస్థల నుంచి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌జిబిటిక్యు హక్కుల ఉద్యమకర్త జిమ్మీ విడుదల



**హాంకాంగ్:** సుమారు నాలుగు సంవత్సరాలుగా జైల్లో ఉన్న హాంకాంగ్ ప్రముఖ ప్రజాస్వామ్య ఉద్యమకర్త, స్వలింగ సంపర్కుల (ఎల్‌జిబిటిక్యు) హక్కుల కోసం పోరాడుతున్న సామాజిక కార్యకర్త జిమ్మా షామ్ శుక్రవారం విడుదలయ్యారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై అతని సహా మొత్తం 47 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ముగ్గురు నిర్దోషులుగా విడుదల కాగా, జిమ్మీ, మరో 43 మందికి కోర్టు జైలు శిక్ష విధించింది.

## స్పెల్లింగ్ బీ విజేతగా భారత సంతతి బాలుడు- ఫైజాన్



**న్యూయార్క్:** భారత సంతతికి చెందిన ఫైజాన్ జాకీ అమెరికాలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన 'నేషనల్ స్పెల్లిం గ్ బీ' పోటీలో విజేతగా నిలిచాడు. 13 ఏళ్ల ఫైజాన్ గత ఏడాది ఇదే పోటీల్లో రన్నరప్‌గా నిలిచాడు. ఈసారి టైటిల్ అందుకొని సత్తా చాటాడు. 21వ రౌండ్‌లో నిర్వాహకులు అడిగిన ఫ్రెంచ్ పదం 'ఎక్లే సీస్‌మా'కు సరైన స్పెల్లింగ్ చెప్పి, పోటీని పూర్తి చేశాడు. కా లిఫోర్నియాకు చెందిన మరో భారత సంతతి బాలుడు సర్వజ్ఞ కదమ్‌తో తుది వరకూ పోటీపడి, చివరికి టైటిల్ సాధించిన ఫైజాన్‌కు ఈ విజయంతో 50000 డాలర్ల నగదు బహుమతి లభిస్తుంది. దానితోపాటు ఒక ట్రోఫీ, మరియన్ వెబ్‌స్టర్ నుంచి 2500 డాలర్ల ప్రత్యేక బహుమతి కూడా అందుతుంది. ఫైజాన్ తాత, నాయనమ్మ హైదరాబాద్ వాసులు కావడం విశేషం.

## తప్పించుకోలేరు
(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. జర్నలిస్టులతో హైదరాబాద్, సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాళేశ్వరం విషయంలో బిఆర్‌ఎస్ నాయకులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికపోయారని, వాటి నుంచి తప్పించుకునేందుకు అబద్దాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ఒక ఎనిమిదవ వింత అని చెప్పుకునే కెసిఆర్, కాళేశ్వరం ప్రాజెక్టును ఎలా పునర్‌నిర్మించాలో సమగ్రంగా ఒక నివేదికను సిద్ధం చేయవచ్చు కదా అని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్, బిజెపి మధ్య సంబంధం ఉన్నదని కవిత వ్యాఖ్యల ద్వారానే స్పష్టమైంది కదా? అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కెసిఆర్ వద్ద దెయ్యాలు ఉన్నాయని చెబుతున్న కవిత, ఆ దెయ్యాలు ఎవరో చెబితే వినాలని తాము ఎదురుచూస్తున్నామన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ మధ్య ఉన్న బంధాన్ని బిజెపి ఎంఎల్‌ఎ కూడా అంగీకరించారన్నారు. ఈడి అధికారులు తన ఇంటికి ఎప్పుడూ రాలేదని, వారు తన కుమార్తె ఇంటికి వచ్చారని వివరించారు. కెటిఆర్‌కు ఈడి అంటే ఉత్సాహమెక్కువ అని, అందుకే ఈడి గురించి మాట్లాడుతున్నారని,ఈడి దాడుల విషయాన్ని కెటిఆర్ స్వయంగా ఢిల్లీలోని ఈడితో వివరాలను తెలుసుకోవచ్చు కదా?, బిజెపి, బిఆర్‌ఎస్ స్నేహితులే కదా? అని పొంగులేటి ఎద్దేవా చేశారు. ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసే చనువు సిఎం రేవంత్ రెడ్డికి ఉన్నదని, అన్ని రాష్ట్రాల పిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ కు చెందిన ముఖ్యంత్రులు రాహుల్‌గాంధీతో మాట్లాడే చనువు ఉంటుందని స్పష్టం చేశారు.

దగ్గరపడిన భూ బకాసూరుల ముహూర్తం

ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి, తప్పుడు పత్రాలను సృష్టించి, సాదాబైనామా కింద ఆ భూములను క్రమబద్ధీకరించాలని కొందరు దరఖాస్తులను పెట్టుకున్నారని, వారి నుంచి ఆభూములను స్వాధీనం చేసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. ఆగస్టు 15లోపు అసైన్డ్ భూముల భూ బకాసూరుల ముహూర్తం దగ్గరపడుతుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో లేని భూములకు, కొందరు పట్టాలు తీసుకున్నారని, అలాంటివి రద్దు చేస్తామని స్పష్టం చేశారు. నెలకొండపల్లిలో గ్రనైట్స్‌కు సంబంధించిన ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకుని, వేర్వురు పత్రాలను సృష్టించి తక్కువ భూమి పేరుతో సాదాబైనామాలను సృష్టించి, క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారని, ఇలాంటివి అనేక దరఖాస్తులు ఉన్నాయని మంత్రి వివరించారు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తామని(ఇది వరకు నిర్వహించిన మండలాల్లో) తెలిపారు.

**2.10 లక్షల ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక**

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటి వరకు 2.10 లక్షల మంది లబ్ధిదారులు ఎంపికయ్యారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జూన్ 10వ తేదీలోగా మిగతా లబ్ధిదారుల జాబితా సిద్ధమవుతు ందన్నారు. ప్రయోగాత్మక ప్రాజెక్టులో 42వేల ఇళ్లు మంజూరు చేయగా, ఇందులో 24 వేలకు పనులు ప్రారంభమయ్యాయని, సుమారు వంద ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. లబ్ధిదారుల జాబితాకు సంబంధించి ప్రతిపక్ష ఎంఎల్‌ఎలకు 40 శాతం పేర్లు ఇవ్వమని సూచించామని, కానీ కెటిఆర్ తన నియోజకవర్గానికి చెందిన ఇందిరమ్మ జాబితాను ఇవ్వలేదని, అధికారులతోనే ఎంపిక చేసుకోవాలని సూచించినట్టు జిల్లా కలెక్టర్ తనతో చెప్పారని మంత్రి పొంగులేటి వివరించారు. ఐటిడిఎ పరిధిలో చెంచులకు 9,200 ఇండ్లను మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి సిమెంట్, స్టీల్ విషయంలో ధరలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తామని, గత ఏడాదిలో ఉన్న తక్కువ ధరకే వాటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. దీనికి సంబంధించి త్వరలోనే ధరల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

**హైదరాబాద్‌లో 10 మురికివాడల్లో ఇందిరమ్మ ఇండ్లు**

హైదరాబాద్‌లోని పది మురికివాడల్లో 'జి ప్లస్ 4 అంతస్తుల'ల వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని నిర్ణయించినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. హైదరాబాద్‌కు దూర ప్రాంతాల్లో ఇండ్లను నిర్మించడం ద్వారా జీవనోపాధి లేకపోవడంతో లబ్ధిదారులు వాటిని వినియోగించుకోవడం లేదని, అందుకే నగరం నడిబొడ్డున ఉన్న మురికివాడల్లోనే వారికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని వివరించారు. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్,నల్లగొండ జిల్లాల్లోనూ హైదరాబాద్ తరహాలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని మంత్రి వెల్లడించారు.

## ఒకే షిఫ్ట్‌లో...'నీట్ పీజీ 2025'
(మొదటి పేజీ తరువాయి)

గుర్తించి ఒకే షిఫ్ట్‌లో పరీక్ష జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏ రెండు క్వొశ్చన్ పేపర్లు కూడా నిర్దిష్ట స్థాయిలో 'క్లిష్టతను' లేదా 'సౌలభ్యాన్ని' కలిగి ఉన్నాయని ఎప్పుడూ చెప్పలేం' అని న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్‌కుమార్, ఎన్‌వి. అంజారియాల ప్రాతినిథ్యంతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. అసాధారణమైన సందర్భాలలో సాధారణీకరణను ఏడాది తర్వాత ఒక సాధారణ పద్ధతిలో వర్తింపజేయవచ్చని ధర్మాసనం తెలియజేసింది. నీట్ పీజీ2025 పరీక్షను రెండు షిఫ్ట్‌లలో నిర్వహిస్తామంటూ జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ ఉత్తర్వులను జారీ చేసింది. నీట్ పీజీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 2,42,678 మంది అభ్యర్థులకు పరీక్షలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు కానీ ఒక నగరంలోనే నిర్వహించడం లేదు కదా అని అత్యున్నత న్యాయస్థానం చెప్పింది. 'దేశం మొత్తంలో సాంకేతికపరిజ్ఞానం పురోగతిని దృష్టిలో ఉంచుకుని ఒకే షిఫ్ట్‌లో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణకు తగినన్ని కేంద్రాలను కనుగొనలేదని మేం భావించడం లేదు' అని ధర్మాసనం పేర్కొంది.'రెండు షిఫ్ట్‌లలో పరీక్షలు నిర్వహించడం ఏకపక్షాన్ని సృష్టిస్తుంది కాబట్టి పరీక్ష రాసే అభ్యర్థులు అందరినీ అదే స్థాయిలో ఉంచదు' అని ధర్మాసనం గుర్తించింది. ఈ పరీక్ష జూన్ 15న షెడ్యూల్డ్ చేయబడిందని, పరీక్షానిర్వహణ విభాగం ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహవించడం కోసం మరిన్ని కేంద్రాలను గుర్తించడానికి ఇప్పటికీ ఇంకా రెండు వారాల సమయం మిగిలి ఉన్నదని ధర్మాసనం తెలియజేసింది. మరొక ప్రతివాది తరపున హాజరైన న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ బహుళ షిఫ్ట్‌ల పరీక్ష కోసం వారు 445 కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ఒకవేళ ఒక షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించాల్సి వస్తే వారు అదనంగా 900 కేంద్రాలను గుర్తించాల్సి ఉంటుందని ధర్మాసనానికి విన్నవించారు.

## మిస్ వరల్డ్ ఫైనల్స్ నేడే
(మొదటి పేజీ తరువాయి)

రూపొందించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా 108 మంది వివిధ దేశాల పోటీదారులు అందం, ఉద్దేశం, ఐక్యతను జరుపుకునే ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీపడతారు. సుమారు 20 రోజుల పాటు జరిగిన వివిధ కార్యక్రమాల్లో వీరంతా పాల్గొని తమ ప్రతిభను చాటటంతో పాటు, తెలంగాణలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించారు. తెలంగాణ జరూర్ ఆనా నినాదాన్ని ప్రపంచ వ్యాప్తం చేశారు. మిస్ వరల్డ్ 2016 స్టెఫానీ డెల్ వాలె, భారతీయ ప్రెజెంటర్ సచిన్ కుంభర్ హోస్ట్‌లుగా వ్యవహరిస్తారు. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ ఖట్టర్ ఫైనల్స్‌లో స్టేజ్ పైన లైవ్ ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ప్రముఖ మానవతావాది, నటుడు సోనూసూద్‌కు మిస్ వరల్డ్ హ్యూమానిటేరియన్ అవార్డు ప్రధానం చేయనున్నారు. ఆయన ఫైనల్స్‌కు న్యాయ నిర్ణేతగా కూడా వ్యవహరిస్తారు. ఇతర జ్యూరీలుగా సుధారెడ్డి, డాక్టర్ కారినా టర్రెల్ (మిస్ ఇంగ్లాండ్ 2014), మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ ఉన్నారు. మిస్ వరల్డ్ 2017, బాలీవుడ్ నటి మనుషి చిల్లర్ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా కనిపించనున్నారు. ఈ గ్రాండ్ ఫినాలే కార్యక్రమం భారతదేశంలో సోనీలైవ్‌లో లైవ్‌స్ట్రీమ్ అవుతుంది, కొన్ని దేశాలలో జాతీయ టెలివిజన్‌లో ప్రసారం అవుతుంది, ప్రపంచవ్యాప్తంగా www.watchmissworld.com ద్వారా హై డెఫినిషన్‌లో అందుబాటులో ఉంటుంది.

## అస్సలు ఒప్పుకోను
(మొదటి పేజీ తరువాయి)

కందుల ప్రశాంత్‌ను ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రశాంత్‌పై కాంగ్రెస్ ఒత్తిడితోనే కేసు నమోదైందని పేర్కొన్నారు. మంచిర్యాల గౌతమినగర్‌లో ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు మునీర్ కుటుంబాన్ని పరామర్శించిన ఆమె తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి చొప్పించడంలో మునీర్ పాత్ర అపారమైందని, దేశ, రాష్ట్ర సమస్యలపై చక్కటి విశ్లేషణతో ప్రజలకు మార్గదర్శకంగా నిలిచారని, మునీర్ లాంటి పాత్రికేయులు పెరగాలని, జర్నలిస్టులు ప్రజల బాధలు అర్థం చేసుకుని మునీర్ మార్గాన్ని అనుసరించాలని అన్నారు.

## విలీనం తథ్యం!
(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్‌కు కవిత రాసిన లెటర్ లీక్ వెనక ఆమె ప్రమేయం లేదా కెసిఆర్ కుటుంబ సభ్యుల ప్రమేయం ఉండి ఉండవచ్చన్నారు. బిజెపి నేతలు ముందుగా ఆ పార్టీ ఎంఎల్‌ఎ రాజాసింగ్ వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని, రాజాసింగ్ వ్యాఖ్యలకు సమాధానం చెప్పే దమ్ము బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. బిజెపి, బిఆర్‌ఎస్ మైత్రి గురించి కవిత చెప్పకనే చెబుతున్నారన్నారు. కెసిఆర్, కిషన్ రెడ్డి కలయిక వల్లే బండి సంజయ్‌ని బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించారని బిజెపి ఎంఎల్‌ఎ పరోక్షంగా చెబుతున్నారన్నారు. రాజాసింగ్ లేవనెత్తిన అంశాలకు జవాబు చెప్పకుండా రాహుల్‌గాంధీపై విమర్శలు చేయడం బిజెపి నేతల చేతగానితనమన్నారు. కాళేశ్వరం విషయంలో నోటీసులు రాగానే కెసిఆర్, ఈటల రాజేందర్‌ల మధ్య పాత బంధం మళ్ళీ చిగురించ్చిందని, శామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో హరీష్‌రావుతో బిజెపి ఎంపి ఈటల రాజేందర్ సమావేశం అయ్యారని, హరీష్‌రావుతో కలిసి ఈటల రాజేందర్ కెసిఆర్‌తో ఫోన్‌లో సంభాషించారన్నారు. పాక్ పై యుద్ధం తీరు తెన్నుల గురించి తెలియాల్సిన ఆవశ్యకత ఉందని, బిజెపి నాయకులు, మోదీ సరైన రీతిలో యుద్ధం చేయలేక ట్రంప్ ప్రలోభానికి గురై వెనకడుగు వేశారన్నారు. రాహుల్ గాంధీపై అవకాలు చెవాకులు పేలుతున్న బిజెపి నేతలు తస్మాత్ జాగ్రత్త అన్నారు. సైనికులకు బాసటగా రాహుల్ గాంధీ నిలిస్తే విమర్శలు చేయడం బిజెపి నేతల దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. పాక్ పై యుద్ధంలో సాధించింది ఏమిటి? కోల్పోయింది ఏమిటి? అని దేశ ప్రజలు అడుగుతున్నారన్నారు. అపర కాళీమాతగా ఇందిరా గాంధీని మాజీ ప్రధాని వాజ్‌పాయ్ కొనియాడిన విషయం కిషన్‌రెడ్డికి తెలియకకపోవడం విడ్డూరమన్నారు. ఇందిరా గాంధీ హయంలో వందల సర్జికల్ స్ట్రైక్స్ జరిగాయని, సైనిక రహస్యాలను రాజకీయ స్వార్థం కోసం బిజెపి వాడుకుని లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. కుల సర్వే బిసిలకు వెన్నుదన్నుగా నిలుస్తామని స్పష్టంగా చెప్పామన్నారు.

**జైహింద్ యాత్రలో సిఎం రేవంత్ ప్రశ్నలకు బిజెపి సమాధానం చెప్పాలి : కెకె**

జైహింద్ యాత్ర సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేసిన ప్రశ్నలకు బిజెపి సమాధానం చెప్పాలని, రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు డిమాండ్ చేశారు. జైహింద్ యాత్రలో సిఎం రేవంత్‌రెడ్డి భావోద్వేగంతో దేశం గర్వించే విధంగా మాట్లాడారన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. భారత్, పాక్ మధ్య ఆరు తీవ్రమైన యుద్ధాలు జరిగాయని, పెహల్గామ్ ఘటన తరువాత భారతదేశం ఏదో చేస్తున్నట్లు సృష్టించారు కానీ ఏమి జరగలేదన్నారు. కవిత మాట్లాడిన మాటలను, ఆమెను కాంగ్రెస్ సిరియస్‌గా తీసుకోలేదని, ప్రజాపాలనలో ప్రజలతో పాలన జరుగుతుందని, లీడర్‌లతో ఏమి సంబంధమని, కవితతో కాంగ్రెస్‌కు పెద్దగా కలిసివస్తుందని తాను అనుకోవడంలేదన్నారు. తెలంగాణ ఇవ్వనందుకు తాను పార్టీ మారాల్సి వచ్చిందని, ప్రస్తుతం తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, కాంగ్రెస్‌లోనే మరణిస్తానన్నారు.

## పాటించాలి (మొదటి పేజీ తరువాయి)

అనేక మంది అర్హులైన పేదలకు ఇండ్లు మంజూరు చేయలేదనే ఆరోపణలు వస్తున్నాయని దీనిపై అధికారులు దృష్టి సారించి అర్హులకు దక్కేలా చూడాలన్నారు. శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ సాగు, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, ధాన్యం సేకరణ తదితర అంశాలపై నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం సేకరణలో ముందున్నామని ప్రభుత్వం చెబుతున్నా కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు సకాలంలో చెల్లించడం లేదని దేవరకొండ ప్రాంతానికి చెందిన రైతులు తన దృష్టికి తీసుకవచ్చినట్లు చెప్పారు. వెంటనే రైతు అమ్మిన ధాన్యానికి డబ్బులు చెల్లించాలని కోరారు. మిల్లర్ల దోపిడిని అధికంగానే ఉందని దేవరకొండ ఆర్‌డిఓ దృష్టికి తాను తీసుకవెళ్లినట్లు చెప్పారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఇలాంటి తప్పిదాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పథకాల అమలులో చొరవచూపి రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారికి పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతుందని నకిలీ విత్తనాల బెడద తీవ్రంగా ఉందని దీంతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వీటిని అరికట్టేందుకు పకడ్బందిగా ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాల సమీక్ష సమావేశాలకు ఎమ్మెల్సీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలా జరగకుండా చూస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నచ్చచెప్పారు.

## స్వాధీనం.. (మొదటి పేజీ తరువాయి)

ఇళ్లలో అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో నోట్ల కట్టలు బయటపడ్డాయి. దాదాపు రూ.2.1 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తాన్ని పది మంది అధికారులు లెక్కపెట్టారు. విజిలెన్స్ అధికారులు తన ఫ్లాట్ వద్దకు రాగానే సారంగి ఇంట్లోని నోట్ల కట్టలను కిటికీలోంచి బయటపడేసేందుకు ప్రయత్నించాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అంగుల్‌లోని అతని నివాసంలో జరిపిన సోదాల్లో రూ.1.1 కోట్లు, భువనేశ్వర్ ఫ్లాట్‌లో మరో రూ.కోటి దొరికాయి. నగదుతోపాటు పలు పత్రాలు, బంగారు ఆభరణాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఎనిమిది మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారులు, 12 మంది ఇన్స్ పెక్టర్లు, ఆరుగురు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లు సహా 26 మంది పోలీసు అధికారుల బృందంతో పాటు ఇతర సహాయక సిబ్బంది సోదాల్లో పాల్గొన్నారు.

## ముఖంగా వెల్లడించాలి (మొదటి పేజీ తరువాయి)

కవిత విచారణ కోరాలన్నారు. ఇందు కోసం ఎంపిగా తాను కూడా కవితతో కలిసి వస్తానని, బిఆర్‌ఎస్ నేతల దోపిడీపై సిబిఐ విచారణ కోరుదామని, అప్పుడు కవితపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని ఆయన అన్నారు. బిఆర్‌ఎస్ దోచుకున్న సొమ్ములో వాటా కోసమే పంచాయతీ జరుగుతున్నదా అనే విషయాన్ని కవిత చెప్పాలన్నారు. బిజెపి నేతలకు ప్యాకేజీలు ఇస్తే ఎవరితోపైనా స్నేహం చేస్తారని బిజెపి సీనియర్ ఎంఎల్‌ఎ రాజాసింగ్ అన్నారని, బిజెపి నుంచి 8 ఎంపిలను గెలిపించిన ప్రజలపై ప్రధాని మోదీకి ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు. ప్రపంచ దేశాలకు ఆపరేషన్ సింధూర్ గురించి వివరించేందుకు ఇక్కడి బిజెపి ఎంపిలు పనికి రారని మోదీ అనుకున్నారా చెప్పాలని ఆయన ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డి విమానం కొంటున్నారని అసత్య ప్రచారం చేస్తున్న బిఆర్‌ఎస్ నేతలు బిఆర్‌ఎస్ ఎలక్టోరల్ బాండ్స్ నిధుల నుంచి ఒక విమానం ప్రభుత్వానికి కానిస్తే తీసుకుంటామని ఆయన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

## ఎలా వ్యవహరిద్దాం (మొదటి పేజీ తరువాయి)

కూడా వ్యక్తం అవుతున్నాయి. కాళేశ్వరం కమిషన్ ఇప్పటి వరకు చేపట్టిన విచారణ తీరు, విచారణకు హాజరైన వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, తదితర అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలిసింది. కాళేశ్వరంపై ఎన్‌డిఎస్‌ఎ నివేదికను ఎల్ అండ్‌టి నిర్మాణ సంస్థ కూడా తప్పుపట్టిన అంశాలు, ఇందుకు ప్రాస్తవించాల్సిన న్యాయపరమైన అంశాలు, మంత్రివర్గం, సిఎంగా వ్యవహరించిన పాత్రను ఇలా అనేక అంశాలపై వారి మధ్య చర్చ జరిగినట్టు పలువురు పేర్కొంటున్నారు. అలాగే బిఆర్‌ఎస్‌లో జరుగుతున్న తాజా పరిణామాలు కూడా చర్చకు వచ్చినట్టు సమాచారం. అయితే జూన్ 5న కెసిఆర్, ఆతర్వాత హరీశ్‌రావు విచారణకు హాజరుకావాల్సి ఉన్న ది. విచారణలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును, కాళేశ్వరం నిర్మాణ పనుల సందర్భంగా పలు సంస్థల ప్రశంసలు, నిర్మాణ సమయంలో పాలకులుగా తమ పాత్రను ప్రధానంగా ప్రస్తావించే అవకాశాలు ఉంటాయని బిఆర్‌ఎస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## భారీ వర్షాలు (మొదటి పేజీ తరువాయి)

కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపారు. 30 నుంచి 40 కిలో మీట్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. దీంతో పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. జూన్ 2వ తేదీన రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగ ర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## జిపిఓల పరీక్ష ఫలితాలు విడుదల హర్షణీయం

రెవెన్యూ అధికారులు, ఉద్యోగ సంఘాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిపిఓల నియామకానికి సంబంధించిన ప్రక్రియ వేగవంతంగా సాగుతుందని, అందులో భాగంగా ఇటీవల నిర్వహించిన జిపిఓల నియామక పరీక్ష ఫలితాలు విడుదల చేయడం పట్ల రెవెన్యూ అధికారులు, ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహసీల్దారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, జిపిఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు గరికె ఉపేందర్ రావు, లక్ష్మి నరసింహా శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ తహసీల్దార్ల సంఘం సెక్రటరీ జనరల్ పూల్సింగ్ చౌహాన్, తెలంగాణ తహసీల్దార్ల సంఘం, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మహిళా విభాగాల రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.రాధ, సుజాత చౌహాన్, జిపిఓ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రజాకార్, పుష్ప-2 సినిమాలకు
# అవార్డులను తిరస్కరించాలి

రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను కించపరిచే సినిమాలకు అవార్డులా..?

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** రజాకార్ సినిమాకు, పుష్ప2 సినిమాలో స్మగ్లర్ పాత్ర పోషించిన అల్లు అర్జున్‌కు ఇచ్చిన గద్దర్ అవార్డులను తిరస్కరించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం ముగింపు సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను అవమానపరుస్తూ తీసిన రజాకార్ సినిమాకు ఉత్తమ చారిత్రక వారసత్వ సినిమా అవార్డు ఇవ్వడం సిగ్గుచేటైన చర్య అన్నారు. నాడు సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిందని, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, జమీందారులకు, జాగిర్దార్లకు వ్యతిరేకంగా భూమి పంచాలని, వెట్టిచాకిరి నుండి విముక్తి కావాలని నినాదంతో, బాంచన్ కాల్మొక్త అనే బానిస బతుకులు పోవాలని సాగిన పోరాటాన్ని హిందువులకు, ముస్లింలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా వక్రీకరిస్తూ తీసిన రజాకార్ సినిమాకి ఉత్తమ చారిత్రక వారసత్వ సినిమా అవార్డు రావడం సిగ్గుచేటు అని అన్నారు. ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి, 10 లక్షల ఎకరాల భూములను పంచిపెట్టిన చరిత్ర ఎర్రజెండా పార్టీకి దక్కిందన్నారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ పటేల్ సైన్యాలతో గ్రామాలపై పడి ప్రజలపై దాడిచేసి చంపించారని, నేడు అదే తీరుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ తీసిన సినిమాలకు ఉత్తమ సినిమా అవార్డులు ఇవ్వడం అమరవీరులను అవమానపరచడమే అన్నారు. అలాగే సమాజంలో విష సంస్కృతిని పెంచిపోషించే విధంగా ఎర్రచందనం స్మగ్లర్ పాత్రలో నటించిన అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడి అవార్డు ఇవ్వడం సరికాదని, ఇలాంటి పాత్రలకు గద్దర్ పేరుతో అవార్డు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యురాలు మండ సదాలక్ష్మి, ఎన్.అశోక్ స్టాలిన్, డాక్టర్ మార్క శంకర్ నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కార్యవర్గ సభ్యులు మంచాల రమాదేవి, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బాషహోయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, నకీర్త ఓదెలు, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, వేల్పుల సారంగపాణి, రాజ్‌కుమార్, కామెర వెంకటరమణ, యేషబోయిన శ్రీనివాస్, దుప్పటి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ఆర్‌టిసి సిబ్బంది

రూ.19 లక్షల విలువైన వస్తువులు ప్రయాణికులకు అందజేత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విధి నిర్వహణలో టిజిఎస్ ఆర్‌టిసి సిబ్బంది తమ నిజాయితీని నిరూపించుకున్నారు. బస్సుల్లో పోగొట్టుకున్న రూ.19 లక్షల విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌లను ప్రయాణికులకు అందజేసి, మానవత్వాన్ని చాటుకున్నారు. ఈనెల 25న సూర్యాపేట హైదరాబాద్ మార్గంలో వెళ్తోన్న బస్సులో ఒక ప్రయాణికురాలు తన బ్యాగ్‌ను మరిచిపోయారు. బస్సు సూర్యాపేట బస్ స్టేషన్‌కు చేరుకోగానే ఆ బ్యాగ్‌ను కండక్టర్ కె.అంజయ్య, డ్రైవర్ యాకుబ్ పాషా గుర్తించారు. మానవత్వం చాటుకున్న సూర్యాపేట, మియాపూర్2 డిపోలకు చెందిన సిబ్బంది కె.అంజయ్య, డ్రైవర్లు యాకుబ్ పాషా, ముబీన్, రమేష్‌ను టిజిఎస్ ఆర్‌టిసి ఎం.డి. సజ్జనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వెంకన్న, సిటిఎం (కమర్షియల్) శ్రీధర్, సిపిఎం ఉషాదేవి పాల్గొన్నారు.

## అడవులను కాపాడిన ఆదివాసీలను..
# ఇప్పటికీ కబ్జాదారులుగానే చూస్తున్నారు!

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అడవులను కాపాడిన ఆదివాసీలను ఇప్పటికీ కబ్జాదారులుగానే చూస్తున్నారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. నూతన అటవీ చట్టాలు తెచ్చి సరైన నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ తాజ్ డెక్కన్‌లో శుక్రవారం పిఎం. జన్మన్, ధర్తి ఆబ జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ అనే కేంద్ర పథకాలపై సౌత్ ఈస్ట్ జోన్‌కు చెందిన రాష్ట్రాల సమావేశం జరిగింది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాల గిరిజన సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆదివాసీ, గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో ఎదురవుతున్న సవాళ్లు, పరిష్కారమార్గాలు, శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ట్రైబల్ స్కూల్ సహా మిగతా విద్యా సంస్థలకు రూ.248 కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క కోరారు. ఆదివాసీలకు అడవే అమ్మలాంటిదని, అడవి లేకుంటే ఆదివాసీలు ఉండలేరన్నారు. గిరిజనులు అడవిలోనే నివసిస్తారు కాబట్టి వారి అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలను అడ్డుకోకుండా అటవీ శాఖ చట్టాలను సంస్కరించాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లో నీటి పారుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరా సోలార్ గిరి వికాసం పథకానికి కేంద్రం సహాయం అందించాలని కోరారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఇప్పటికీ మౌలిక వసతులు లేకపోవడం మనుషుల వైఫల్యమేనని, ప్రభుత్వాలది కాదన్నారు. బిర్సా ముండా, కొమురం భీమ్‌లను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌టి, ఎస్‌డిఎఫ్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పాటు రాష్ట్ర గిరిజనులకు ప్రత్యేకంగా 22వేల పైచిలుకు పక్కా గృహాలను కట్టిస్తుందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకం పేరిట పోడు భూముల పట్టాలు పొందిన గిరిజన రైతుల భూములను సేద్యం చేసుకునేందుకు వీలుగా సౌర విద్యుత్తు, పంపుసెట్లను అందించడం ద్వారా నీటి పారుదల వసతులను కల్పించామని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ పిఎం. జన్మన్, ధర్తి ఆబ జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఆ దిశలో పయనిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న ప్రతి పథకం ఫలితాలు అడవుల్లో జీవిస్తున్న ప్రతి గిరిజనుడికి అందుతుందన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మనీష్ ఠాకూర్ రాష్ట్రాలలో పథకాల అమలు తీరును సమీక్షించారు. పథకాలను ఇంకా సమర్థవంతంగా ఎలా అమలు చేయాలనే అంశాలపై పలు సూచనలు చేశారు. తెలంగాణలో అమలు జరుగుతున్న పథకాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎ. శరత్ సమన్వయం చేయగా, ట్రైఫెడ్ ఎండి. హృదేశ్ కుమార్, ఛత్తీస్‌గఢ్ గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి సోన్‌మోని బోరా, ఒడిషా గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు పోమతుడు, తెలంగాణ ఐటిడిఎల ప్రాజెక్టు ఆఫీసర్లు, తెలంగాణ 17 శాఖల ఉన్నతాధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు వి. సర్వేశ్వర్ రెడ్డి, ఛీఫ్ ఇంజనీర్ శంకర్, జిసిసి జిఎం. వి.సీతారామ్, టిసిఆర్ టిఐ డైరెక్టర్ డాక్టర్ వి.సముజ్వల తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం జాతీయ
# కనీస వేతనాన్ని వెంటనే నిర్ణయించాలి

ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ కనీస వేతనాన్ని నిర్ణయించాలని, జాతీయ కనీస వేతన బోర్డులో అన్ని యూనియన్‌లకు ప్రాతినిధ్యం కల్పించాలని ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యూసుఫ్ డిమాండ్ చేశారు. రాజస్థాన్ జైపూర్‌లో జరుగుతున్న ఎఐటియుసి జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో శుక్రవారం యూసుఫ్ ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాల బోర్డు వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించటం జరిగిందని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించి జి.ఓలను విడుదల చేయాలని కోరారు. తెలంగాణలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎఐటియుసి యూనియన్‌లు ఉన్నాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ సంఘాలు బలంగా ఉన్నాయని, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఫెడరేషన్ ఏర్పాటుకు కేంద్ర ఎఐటియుసి ప్రయత్నించాలని కోరారు. ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా, యాజమాన్యాలకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తునప్పటికీ, కేంద్రం తెచ్చిందన్నారు. అందులో ఉన్న కార్మిక వ్యతిరేక, యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్న అంశాలను కార్మికులకు పూర్తి అవగాహనా కల్పించాలని కోరారు. ఔటసోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల రెగ్యులరైజ్ కోసం పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో ఎఐటియుసిని బలోపేతం చేస్తామన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు పి.ప్రేమపావని, ఎస్.విలాస్, నరాటి ప్రసాద్, సింగు నర్సింహారావు, ప్రవీణ్ కుమార్, వై.ఓమయ్య, ఎన్.కరుణ కుమారి, టి.సమ్మయ్య, కె.ఏసురత్నం, కె.రాజ్ కుమార్, కె.సారయ్య, హసీనా బేగం, సీతామహాలక్ష్మి, బి. జి.క్లైమెంట్లు పాల్గొన్నారు.



## జర్నలిస్టులు నైతికప్రమాణాలు పాటించాలి

పాత్రికేయులు కనీసధర్మం పాటించడంలేదని విమర్శలు పెరిగాయి

మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించకపోతే ప్రజల్లో గౌరవం తగ్గుతుందని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం, మన్ననూరు గ్రామంలోని అటవీశాఖ వనమాలిక ఆవరణలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గత రెండురోజులుగా పాత్రికేయులకు వివిధ అంశాలపై అవగాహన శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నైతిక నియమాలు – మీడియా చట్టాలు' అనే అంశంపై మాట్లాడుతూ మీడియా అకాడమీ నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు పాత్రికేయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఈ శిక్షణలో పాత్రికేయులు దాదాపుగా నూటికి 90శాతం మంది ఉన్నత విద్యాభ్యాసం చేసినవారు ఉండటం సంతోషకరమన్నారు. త్వరలోనే పాత్రికేయులకు హైదరాబాద్ పట్టణంలో మీడియా అకాడమీ ద్వారా కంప్యూటర్ శిక్షణ వారం రోజులపాటు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, కంప్యూటర్‌పై అవగాహనలేని వారందరు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం 1952లో మీడియాచట్టం వచ్చిందని, వర్కింగ్ జర్నలిస్టుల హక్కులకోసం ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1995లో తీసుకొచ్చిందని, ఐదురకాల వేతనచట్టాలు వచ్చినా అమలు విషయంలో జాప్యాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించడంలేదని విమర్శలు ఈమధ్య బాగా పెరిగాయని, అందుకు కారణం మనమేనని అన్నారు. నైతిక విలువలు కాపాడుకోవడంతోపాటు పారదర్శకతతో కూడిన వార్తలను ప్రచురించినప్పుడు ప్రజల్లో మనపై గౌరవం పెరుగుతుందన్నారు. ప్రతిరిపోర్టర్ వార్తల విశ్వసనీయతపై దృష్టి కేంద్రీకరించాలని, కనీస ధర్మం తప్పక పాటించినప్పుడే మరింత గౌరవం పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఎడిటర్ ఉడుముల సుధాకర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు తోట భావనారాయణ, జిల్లా పాత్రికేయులు సుమారు 80మంది పాల్గొన్నారు.

## లొంగిపోయిన 17 మంది మావోయిస్టులు

ప్రభుత్వం తరపున పునరావాసం

ఎస్‌పి రోహిత్ రాజ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మావోయిస్టు పార్టీకి చెందిన 17 దళసభ్యులు ఎస్‌పి రోహిత్‌రాజ్ ఎదుట లొంగిపోయారు. ఈమేరకు వారిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈమేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ మావోయిస్టు పార్టీకి చెందిన ఆరుగురు మహిళా సభ్యులతో పాటు మొత్తం 17 మంది లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో ఎసిఎంలు ఇద్దరు, దళ సభ్యులు నలుగురు, మిలీషియా సభ్యులు 11మంది ఉన్నట్లు ఎస్‌పి చెప్పారు. వీరితో కలిపి ఇప్పటి వరకు ఈ ఏడాది 282 మంది వివిధ హోదాల్లో గల మావోయిస్టు దళసభ్యులు లొంగిపోయినట్లు చెప్పారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని చెప్పారు. మావోయిస్టు పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలిసి ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాలని చెప్పారు. లొంగిపోయిన వారు వారివారి ప్రాంతాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సాయుధ దళాలు తెలంగాణ ప్రాంతంలో సంచరించినట్లయితే పోలీసులు తీసుకునే నిర్ణయాల నుండి ఏఒక్కరు కూడా తప్పించుకోలేరని, ఇందురు కర్రె గుట్టల ఘటనలే ఉదాహరణ అన్నారు. కాలంచెల్లిన సిద్ధాంతాలను విడిచిపెట్టి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు. లొంగిపోయిన వారు కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవనాన్ని గడిపేందుకు పునరావాస సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ జి.నరేందర్, భద్రాచలం ఎఎస్‌పి విక్రాంత్‌కుమార్ సింగ్, 141 బెటాలియన్ అడిషనల్ కమాండర్ ప్రీతా, 81 బెటాలియన్ అడిషనల్ కమాండర్ రవివర్మ, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, చర్ల సిఐ రాజువర్మ, ఆర్ఐ ఆపరేషన్స్ రవి తదితరులు పాల్గొన్నారు.




## తెల్ల ఏనుగు లాంటి 'హైడల్ ప్రాజెక్ట్' మరో తుగ్లక్ చర్య : హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హిమాచల్‌ప్రదేశ్‌లో రూ.6,200కోట్లతో తెల్ల ఏనుగు లాంటి హైడల్ ప్రాజెక్టు నిర్మాణానికి టిజి జెన్‌కోను రంగంలోనికి దింపడం రాష్ట్ర ప్రభుత్వ మరో తుగ్లక్ చర్య తప్ప మరోటి కాదని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. మోసర్‌బేర్ వంటి ప్రతిష్టాత్మక కంపెనీ పారిపోయినప్పటికీ, ఎన్‌టిపిసి లాంటి కేంద్ర ప్రభుత్వరంగ కంపెనీ మూడేళ్ల తర్వాత సాధ్యం కాదని వదిలేసిన 510 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించేందుకు టిజి జెన్‌కో ఒప్పందం ఎందుకు చేసుకున్నదో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాల కాలంలో ఒక్కరు కూడా నిర్మించేందుకు ముందుకు రాని ప్రాజెక్ట్‌ను రాష్ట్రప్రభుత్వం ఎందుకు చేపడుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపిఆర్ లేకుండానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హిమాచల్ ప్రభుత్వంతో ఎంఒయు చేసుకుని, అప్ ఫ్రంట్ ప్రీమియం కింద రూ.26కోట్లను చెల్లించి, మరో రూ.26కోట్లను చెల్లించేందుకు సిద్ధపడడాన్ని పరిశీలిస్తే, రాష్ట్ర ప్రభుత్వం దివాళ తీసిందని సిఎం రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలు ప్రజల చెవుల్లో పూలు పెట్టడానికే అని తేలిపోయిందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని తమ వద్ద నిర్దిష్టమైన సమాచారం ఉన్నదని, త్వరలోనే ఈ అవినీతి బండారాన్ని పూర్తి ఆధారాలతో బయటపెడతామని తెలిపారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో వివాహిత మృతి


ప్రతిభ ఆస్పత్రి ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన

భారీగా మోహరించిన పోలీసులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** వైద్యుల నిర్లక్ష్యంతో వివాహిత మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. వెన్నునొప్పితో 35 సంవత్సరాల రాధికను మూడు రోజుల క్రితం ఆస్పత్రికి తీసుకురాగా గురువారం రాత్రి ఆమెకు సర్జరీ చేసిన వైద్యులు ఆరోగ్యంగా ఉందని వెల్లడించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందడంతో బంధువులు ఆందోళనకు దిగారు. గుండెపోటుతో రాధిక మృతి చెందిందని వైద్యులు తెలుపడంతో మృతురాలి బంధువులు మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ఎదుట బైఠాయించి వైద్యులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లాలోని వేల్పూర్ మండలం, పడిగెల్ గ్రామానికి చెందిన రాధికకు భర్త, ఐదేళ్ల పాప ఉన్నట్లు తెలిసింది. మృతురాలి బంధువుల ఆందోళనతో భారీగా పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. నగర సిఐ శ్రీనివాసరాజ్ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మొహరించారు. రాధిక మృతికి కారణమైన వైద్యులను అరెస్ట్ చేసేవరకు వదిలేది లేదని మృతురాలి బంధువులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులలో ఇంత జరుగుతున్నా జిల్లా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు పెద్దగా పట్టించుకోవడంలేదని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు.

# తహసీల్దార్ కార్యాలయం ఎదుటే తప్పుడు దందా!



**ప్రజాపక్షం/చెన్నూరు :** చెన్నూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుటే అధికార పార్టీకి చెందిన నేత సీతారాం తోటలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అక్రమ వెంచర్ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. పదేళ్ల క్రితం కేవలం మూడున్నర ఎకరాలకు అనుమతి పొంది, ఏకంగా 16 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో ఈ వెంచర్‌ను నిర్వహిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల సహకారంతోనే ఈ భారీ కుంభకోణం సాగుతోందని వారు అంటున్నారు. కాంగ్రెస్ నేత కుటుంబ సభ్యుల పేరున పట్టణ శివారులోని సర్వే నెంబర్లు 775/2, 775/3అ1, 775/3అ2, 775/3అ3లలో ఉన్న అసైన్డ్ భూమితో పాటు సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని తెలుస్తోంది. సర్వే నెంబర్లు 775, 775/1లలోని 3.16 ఎకరాలకు ప్రభుత్వ అనుమతి పొంది, ఏకంగా 215 ప్లాట్లు ఏర్పాటు చేసి అమాయక ప్రజలకు విక్రయించారని సమాచారం. కేవలం మూడున్నర ఎకరాల అనుమతి

**మూడున్నర ఎకరాల అనుమతితో రెండు వందల ప్లాట్ల వెంచర్**

పత్రాలను వినియోగించి మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల సహకారంతో దొడ్డిదారిన 215 ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిర్వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్లాట్ల అమ్మకాలు పూర్తయినప్పటికీ, అధికార పార్టీ నేత కుటుంబ సభ్యుల పేరున ఉన్న అసైన్డ్ భూములు నేటికీ వారి పేరు మీదే ఉండటం గమనార్హం. వీరు పదేళ్ల నుండి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతూ, బ్యాంకు రుణాలు సైతం తీసుకుంటూ అమాయక ప్రజలను మోసం చేసి కోట్లకు పడగలెత్తారని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూముల్లో ఏర్పాటు చేసిన ఈ వెంచర్‌లో ఇళ్ల అనుమతులు పొందడానికి ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు బడాబాబులు ఇళ్ల అనుమతులు ఇప్పిస్తామని మభ్యపెడుతూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల చర్యలను అడ్డుకునేవారెవరో?**

అసైన్డ్ భూముల్లో అక్రమ వెంచర్ నిర్వహించి అమాయక ప్రజలను మోసం చేసిన అధికార పార్టీ నేతపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకుండా స్థానిక ఎంఎల్‌ఎ రక్షణ కల్పిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన అక్రమ వెంచర్ వ్యవహారంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తడంతో, వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అధికారులు ఆదేశించి నెల రోజులు గడుస్తున్నప్పటికీ, స్థానిక రెవెన్యూ అధికారులు వెంచర్ నిర్వహణపై విచారణ చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వెంచర్ నిర్వాహకుడు అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడం, స్థానిక ఎంఎల్‌ఎ ఉండటంతో అధికారులు చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు భావిస్తున్నారు. బహిరంగ సభల్లో ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించబోమని చెబుతున్న నేతలు, తెరచాటున సొంత పార్టీ నేతలను కాపాడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సీతారాం తోటలో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్‌పై విచారణ జరిపి, అధికార పార్టీ నేత కుటుంబ సభ్యుల పేరున ఉన్న పట్టాలు రద్దు చేసి, వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
మెట్రో జోన్, మింట్ కాంపౌండ్ :: హైదరాబాద్ - 63

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ఎక్స్‌టెన్షన్-1 టెండర్ Spec No. eMZ-03/25-26
ఎక్స్‌టెన్షన్-1 టెండర్ నోటీస్ నెం. 07/25-26 (పత్రికా ప్రకటన)

జనరల్ కేటగిరీ కింద ఒరిజినల్ పనుల T&D మెరుగుదల కొరకు హైదరాబాద్ సౌత్ సర్కిల్ చార్మినార్ డివిజన్‌లోని మీరాలం సబ్ డివిజన్ యొక్క మీరాలం సెక్షన్‌లోని 33/11KV ఫలక్‌నుమా SS నుండి వెలువడే ఓవర్‌లోడ్ 11KV ఫలక్‌నుమా UG కేబుల్ ఫీడర్ యొక్క విభజన కోసం ఇ-టెండర్ పొడిగింపు కోసం అర్హత కలిగిన ఏజెన్సీల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. దీనికి సంబంధించిన ఏదైనా ఇతర సమాచారాన్ని www.tender.telangana.gov.in మరియు www.tgsouthernpower.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- చీఫ్ ఇంజనీర్, ఆపరేషన్, మెట్రో జోన్, హైదరాబాద్.

DIPR R.O. No. : 2820-PP/CL/ADVT/1/2025-26, Date: 30-05-2025

ప్రజాపక్షం
శనివారం, మే 31

## ఓట్లకోసం 'సిందూర్' దుర్వినియోగం

'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో దేశ యావత్ రాజకీయ వ్యవస్థ దేశ సమైక్యత, రక్షణకోసం కంకణబద్ధులై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అండగా నిలబడగా, ఈ అవకాశాన్ని ఆయన తమ పార్టీ ఎన్నికల రాజకీయాలకోసం వినియోగించుకోవటం తన సంకుచిత మనస్తత్వాన్ని వ్యక్తీకరిస్తున్నది. మే 10న 'కాల్పుల విరమణ' ప్రకటించిన రోజునుంచే ప్రధాని మోదీ మిలటరీ సాహసోపేత విన్యాసాన్ని తన విజయంగా ప్రచారం చేసుకుంటున్నా ప్రతిపక్షాలు హద్దుమీరి ఎదురుదాడి చేయలేదు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టుపార్టీ తదితరులు 'ఆపరేషన్ సిందూర్' సాఫల్యం, సీమాంతర టెర్రరిజం, పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని కోరినా మోదీ పెడచెవిన పెట్టారు. అయినా విదేశాలకు పార్లమెంటరీ బృందాల్లో ప్రతిపక్ష పార్టీలు పాల్గొన్నాయి. అయితే దేశ ఐక్యతను చాటేందుకు ఈ యుద్ధ ఉద్రిక్తతలో విమర్శలు చేయకుండా సంయమనం పాటించాలన్న లక్ష్మణరేఖ ప్రతిపక్షాలకేనా? ప్రభుత్వ పక్షానికి లేదా? 'ఆపరేషన్ సిందూర్ ముగియలేదు – విరామం మాత్రమే – ప్రతి టెర్రరిస్టు దాడికీ సమాధానం చెబుతాం' అంటూ, మరో వైపున, గత యుద్ధాల్లో భారత్‌కు లభించిన ఆధిక్యతను ఉపయోగించుకోకుండా నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు సంధులు చేసుకున్నాయని కాంగ్రెస్‌పై ప్రధాని ప్రభృత అగ్రనేతలు విషం గక్కుతున్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌పై తప్ప మరో అంశంపై చర్చలేదు, పిఓకె భారత్‌లో కలిసేరోజు ఎంతోదూరం లేదంటూ హైపర్ జాతీయోన్మాదానికి నీరుపోస్తున్నారు. ప్రధాని గుజరాత్‌తో మొదలు పెట్టి బిహార్, పశ్చిమ బెంగాల్‌లో బహిరంగసభలు, రోడ్ షోలలో పాల్గొంటూ అటు పాకిస్థాన్‌పైన, ఇటు ప్రతిపక్షాలపైన విరుచుకుపడుతున్నారు. వీటి వెనుకనున్న రాజకీయ స్వప్రయోజనాన్ని ఏ పార్టీ ప్రశ్నించలేదు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తొలిసారి స్పందించారు. గురువారం అలీపూర్‌దౌర్‌లో బహిరంగసభలో మోదీ ఎదుటనే, బెంగాల్ బిజెపి అధ్యక్షుడు సుకాంత మజుందార్ ప్రసంగిస్తూ, టిఎంసి ప్రభుత్వాన్ని బంగాళాఖాతం జలాల్లో కలపటానికి ఆపరేషన్ సిందూర్‌వలె 'ఆపరేషన్ బెంగాల్' నిర్వహిస్తామని ప్రకటించారు. రెండు గంటల్లోనే స్పందించిన మమతా బెనర్జీ, 2026 ప్రారంభంలో జరిగే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి చౌకబారు రాజకీయ లబ్ధికోసం ప్రధాని ఆపరేషన్ సిందూర్ వాడుకుంటున్నారని ప్రతి విమర్శ చేశారు. ''ఈ రోజు మోదీజీ చెప్పింది మాకు దిగ్భ్రాంతి కలిగించటమేగాక విచారిస్తున్నాం. అన్ని రాజకీయ పార్టీలూ విదేశీ పర్యటనలతో దేశ ఐక్యతను చాటి చెబుతుండగా, నరేంద్రమోదీ, ఆయన మంత్రి ఆపరేషన్ బెంగాల్ గూర్చి మాట్లాడటం సరైనదా? వారికి నా సవాలు. రేపే ఎన్నికలకు మేము సిద్ధంగా ఉన్నాం. మా సవాలును బిజెపి స్వీకరిస్తుందా?'' అని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయ లబ్ధికోసం మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ మొదలు చోటా నాయకులవరకు ఉపయోగించుకుంటున్నందున, బహుశా ఇతర ప్రతిపక్షాలనుండీ వారు ఎదురుదాడిని ఆహ్వానిస్తున్నట్లుంది.

మమతా బెనర్జీ ప్రధానమంత్రికి కొన్ని ఇబ్బందికరమైన ప్రశ్నలు వేసి సమాధానం డిమాండ్ చేశారుః ఏప్రిల్ 22న పహల్గాంలో హత్యాకాండకు పాల్పడిన టెర్రరిస్టులను ఇంతవరకు ఎందుకు పట్టుకోలేకపోయారు? ట్రంప్ వాణిజ్య హెచ్చరికతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ సాధించినట్లు స్వయంగా ఆయన, ఆయన ప్రభుత్వం పదేపదే చెబుతూ ఉంటే ప్రధానమంత్రి సమాధానం చెప్పకుండా ఎందుకు మౌనంగా ఉన్నారు? మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ప్రధానమంత్రికి ఏమి చెప్పారు? ట్రంప్ బెదిరింపును తెలియజేశారా? యుఎస్ వాణిజ్యశాఖ ఈ విషయాన్ని కోర్టుకు చెప్పింది. ప్రధానమంత్రి మౌనం వహిస్తూ ఇతరులచే ఎందుకు మాట్లాడిస్తున్నారు?

ప్రధాని మోదీ ఏప్రిల్ 24న – పహల్గాం ఘటన తర్వాత రెండ్రోజులకే అఖిలపక్ష సమావేశానికి హాజరుకాకుండా మధుబని (బిహార్)లో బహిరంగసభలో పాల్గొన్నారు. 2025 చివర్లో బిహార్ ఎన్నికలు మోదీకి కీలకం. బిహార్‌ను సొంతం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. 2026 ప్రారంభంలో బెంగాల్, కేరళ, అసోం, తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు. బిహార్‌లో ఇప్పటికే మూడుసార్లు పర్యటించారు మోదీ. వాగ్దానాలు కురిపిస్తున్నారు. ఇటీవల బిహార్, గుజరాత్‌ల్లో ఆయన రోడ్ షోలు ఆయన ఉద్దేశాన్ని వెల్లడించాయి. ఇది రోడ్ షోలకు సందర్భమా? ఇండియా కూటమి పార్టీలు ఇప్పటినుంచే రాజకీయ వ్యూహాలు రూపొందించుకోవటం అవసరం.

# 'మావోయిస్టు రహిత భారత్' కోసం
# బిజెపి సైనిక విన్యాసం



దీపాంకర్ భట్టాచార్య
జాతీయ ప్రధానకార్యదర్శి
సిపిఐ(ఎంఎల్) లిబరేషన్

మే 21న నారాయణపూర్ ఊచకోతలో సిపిఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును చట్టవిరుద్ధంగా హత్య చేసిన తర్వాత, మోడీ ప్రభుత్వం విజయ ఉత్సాహంలో ఉన్నట్లు కనిపిస్తోంది. హోంమంత్రి అమిత్ షా దీనిని 'నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒక మైలురాయి' అని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దీనిని 'అద్భుతమైన విజయం'గా ప్రకటించగా, బిజెపి కర్ణాటక యూనిట్ అమిత్ షా కాలీఫ్లవర్ పట్టుకుని ఉన్నట్లు చూపించే చిత్రాన్ని ఉపయోగించింది.

1989లో భాగల్పూర్‌లో ముస్లింల మారణహోమాన్ని ఈ ప్రతీకవాదం గుర్తుచేసింది, అక్కడ ఒక గ్రామంలో వందమందికి పైగా ముస్లిం బాధితులను సమాధి చేసిన నేలపై కాలీఫ్లవర్లు పెంచినట్లు హంతకులు పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం తన అతిపెద్ద మావోయిస్టు వ్యతిరేక సైనిక విజయాన్ని ప్రకటించుకున్న తరుణంలో, భారతదేశంలో అత్యంత దారుణమైన ముస్లిం వ్యతిరేక మారణ హోమాల్లో ఒకదాన్ని బిజెపి గుర్తుంచుకుని మరీ ఈ ఘోర కార్యానికి పూనుకుంది.



నారాయణపూర్ మారణహోమంలో మావోయిస్టుల మరణాలను సిపిఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ తరపున విడుదల చేసిన పత్రికా ప్రకటన ధృవీకరిస్తోంది. దీని ప్రకారం ఈ మారణహోమంలో 28 మంది కార్యకర్తలు మరణించారు, వీరిలో అనేక మంది మహిళలు, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు. బసవరాజుకు 60 మందికి పైగా యోధులతో కూడిన తక్షణ భద్రతా వ్యవస్థ ఉందని, కానీ జనవరి నుండి వేగవంతమైన కదలికల కోసం ఆ సంఖ్యను తగ్గించారని ఆ ప్రకటన పేర్కొంది. రక్షణ వలయంలోని కొందరు లొంగిపోవడం, ద్రోహులుగా మారడంతో రాజ్యం తమ మిలిటరీ ఆపరేషన్‌ను విజయవంతంగా ప్లాన్ చేసి అమలు చేయడానికి వీలు కలిగింది. మారణ హోమం జరిగిన సమయంలో, బసవరాజుకు 34 మంది యోధులు కాపలాగా ఉన్నారు, వారిలో ఏడుగురు భద్రతా దళాల వలయాన్ని ఛేదించి విజయవంతంగా తప్పించుకోగలిగారు.

బసవరాజు తల్లి, నాగేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు, ఇతర నాయకులు, వారి బంధువుల మృతదేహాలను వారి అంత్యక్రియల కోసం ఇంటికి తీసుకురావడానికి వారి కస్టడీని కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు అనుకూలమైన ఉత్తర్వు ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పోస్ట్‌మార్టం తర్వాత మృతదేహాలను అప్పగిస్తామని కోర్టుకు హామీ ఇచ్చింది. కానీ కుటుంబ సభ్యులు మృతదేహాల కోసం వేచి ఉండగా, రాష్ట్రం వాటిని 'క్లెయిమ్ చేయని మృతదేహాలు' అంటూ దహనం చేసింది.

కొన్ని రోజుల క్రితం, హక్కుల కార్యకర్త సోని సోరి కర్రెగుట్ట కొండలలో చంపబడిన వారి సభ్యుల మృతదేహాలను తీసుకురావడానికి బీజాపూర్ ఆసుపత్రికి కొన్ని ఆదివాసీ కుటుంబాలతో పాటు వెళ్ళిన అనుభవాన్ని వివరించారు. కుళ్ళిపోయిన మృతదేహాలపై వేలాది పురుగులు పాకుతూ ఉండడంతో వాటిని గుర్తించలేకపోయారు. బస్తర్‌లోని మావోయిస్టులను, ఆదివాసీల ప్రాణాలు తీసిన తర్వాత కూడా రాజ్య హింస కొనసాగుతోంది.

భారతదేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చడానికి మోడీ ప్రభుత్వం 2026 మార్చి 31 వరకు గడువు విధించింది. భద్రతా దళాలకు లైసెన్స్‌లు, చంపడానికి ప్రోత్సాహకాలు ఇవ్వబడుతున్నాయి, ప్రతి హత్యకు హామీగా భారీ బహుమతులు లభిస్తాయి. ప్రభుత్వంతో కలిసి పనిచేసే మావోయిస్టులకు లొంగిపోయే విధానం ఉంది, కానీ ఈ విధానం వారిని 'జన జీవనం స్రవంతి' అని పిలవబడే పాత స్థితిలో పునరావాసం కల్పించడానికి ఉద్దేశించబడలేదు, వారిని కిరాయి సైనికులుగా మార్చడం, వారి మాజీ సహచరులకు, తరచుగా అదే సమాజం, ప్రాంతం, కుటుంబాలకు చెందిన తోటి ఆదివాసీలకు వ్యతిరేకంగా బలవంతంగా వారిని పోటీ పెట్టడం మాత్రమే.

సిఆర్‌పిఎఫ్ దాని ఎలైట్ కోబ్రా కమాండోలు, ఛత్తీస్‌గఢ్ పోలీసుల వంటి వివిధ సాయుధ దళాల నుండి 60,000 కంటే ఎక్కువ మంది భద్రతా సిబ్బందితోనే కాకుండా లొంగిపోయిన మావోయిస్టులు, బస్తర్ ఫైటర్లు, స్పెషల్ టాస్క్ ఫోర్స్‌తో కూడిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డులతో విశాల సైనిక శిబిరాలు. భారతదేశంలో అత్యంత సాంద్రత కలిగిన సైనికీకరణ ప్రాంతాలలో బస్తర్ ఒకటిగా మారి పోయింది, ఇక్కడ ప్రజలు వైమానిక బాంబు దాడులకు ఇజ్రాయెల్ డ్రోన్‌ల వాడకానికి బలవుతున్నారు.

300కి పైగా భద్రతా శిబిరాలు ఈ ప్రాంతాన్ని సైనిక కంటోన్మెంట్‌గా మార్చాయి, ఇక్కడ ప్రతి ఎనిమిది మంది పౌరులకు ఒక భద్రతా సిబ్బంది ఉన్నారు. బస్తర్‌లోని ఆదివాసీలకు, జీవితంలోని ప్రతి అంశాన్ని భద్రతా దళాలు కప్పివేసి నిర్వహిస్తాయి. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌లో వాగ్దానం చేసిన స్వయం ప్రతిపత్తి, అటవీ హక్కుల చట్టం లేదా షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీ విస్తరణ చట్టం కింద అందించబడిన హక్కులన్నీ పోలీసు రాజ్యం, సైనికీకరించిన పరిపాలన వింత వాతావరణంలో కనుమరుగయ్యాయి. బస్తర్ సైనికీకరణకు యుపిఎ కాలం నాటి ఆపరేషన్ గ్రీన్‌హంట్, సల్వా జుడుం వంటి మావోయిస్టు వ్యతిరేక ప్రచారాల నుండి సుదీర్ఘ చరిత్ర ఉంది, వీటిని 2011లో రాజ్యాంగ విరుద్ధమని అభివర్ణించి సుప్రీంకోర్టు రద్దు చేయాలని ఆదేశించింది. కానీ మోడీ శకం తీవ్ర హింసతో కొత్త దాడితో ప్రారంభమైంది. నేడు సైనికీకరణ అనేది భారీ కార్పొరేట్ దోపిడీని సులభతరం చేయడానికి ఒక 'శాశ్వత పరిష్కారం'.

మావోయిజంపై యుద్ధం ముసుగులో, సైనికీకరణ – కార్పొరేట్ దోపిడీల సంబంధానికి వ్యతిరేకంగా బస్తర్‌లో జరుగుతున్న ప్రతి ఆదివాసీ నిరసనను మోడీ ప్రభుత్వం మరుగుపరచడానికి ప్రయత్నిస్తోందని మనం గమనించాలి. గాంధేయవాది హిమాన్షు కుమార్‌ను ఛత్తీస్‌గఢ్ నుండి బహిష్కరించారు, రచయిత్రి కార్యకర్త బేలా భాటియాను వేధిస్తున్నారు, అణచివేస్తున్నారు. బస్తర్ లో దీర్ఘకాల ప్రజాదరణ పొందిన ప్రజా గొంతుక మాజీ సిపిఐ ఎమ్మెల్యే మనీష్ కుంజమ్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మూలవాసి బచావో మంచ్ అని పిలువబడే స్థానిక ప్రజల సైనికీకరణ వ్యతిరేక వేదికను నిషేధించారు. విచక్షణారహితంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజా భద్రతా చట్టం చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం వంటి క్రూరమైన చట్టాల కింద ప్రజలను మూకుమ్మడిగా అరెస్టు చేస్తున్నారు. ఒక భావజాలాన్ని సమర్థించడం నేరం కాదనీ, ప్రతి ఎన్‌కౌంటర్‌పై తప్పనిసరి దర్యాప్తు కోసం మార్గదర్శకాలు ఉన్నాయని సుప్రీంకోర్టు పదే పదే చెప్పింది. నేడు సైద్ధాంతిక వేట, ఎన్‌కౌంటర్ హత్యలు, తటస్థీకరణగా ఎక్కువగా వర్ణించబడుతున్నాయి, ఇవి రాజ్యం నిరంకుశ పాలసీకి మూల స్తంభాలుగా మారాయి.

ఆపరేషన్ కగార్ పరిణామాలు బస్తర్ లేదా మావోయిస్టులకు మాత్రమే పరిమితం కావు.

అవి న్యాయంకోసం జరిగే ప్రతి ఉద్యమానికి, ఫాసిస్ట్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగే అన్ని అసమ్మతులకూ శరాఘాతంగా మారుతాయి.

త్వరలోనే, బస్తర్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ అరాచక మోడల్ కొత్త లక్ష్యం చేసుకున్న సమూహాలకు వ్యతిరేకంగా ఎక్కడైనా అమలవుతుంది. బిజెపి కర్ణాటక దుష్ట చిత్రాలలో అమిత్ షా చేతుల్లో ఉన్న కాలీఫ్లవర్ అందరికీ ఒక హెచ్చరికగా పనిచేయాలి. మావోయిస్టులు ఏకపక్ష కాల్పుల విరమణ ప్రకటించిన సమయంలో, శాంతి సంభాషణల ద్వారా రాజకీయ పరిష్కారంకోసం విస్తృత సమావేశం జరగాలి.

భారత గణతంత్ర రాజ్యపు రాజ్యాంగ పునాది మనుగడ సాగించడానికి నారాయణపూర్ హత్యాకాండ, ఆపరేషన్ కగార్ కింద జరిగిన ఇటీవలి మారణహోమాలపై న్యాయ పర్యవేక్షణలో దర్యాప్తు జరిగి తీరాలి. మావోయిస్టులు ప్రస్తుత పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవాలి. ఈ ఎదురుదెబ్బ తర్వాత తిరిగి సంఘటితం కావడానికి ప్రయత్నించాల్సివుంది.

బస్తర్ తదితర ప్రాంతాల సాధారణ ప్రజానీకం గౌరవ ప్రదమైన న్యాయానికి అర్హులు. ఈ అమానుష సైనికదాడికి బలైన అమాయక జన బాహుళ్యానికి న్యాయం జరిగేలా చూడడం ప్రజాస్వామ్యవాదులందరి బాధ్యత.

# అందరి ఆకలి తీర్చే మార్గాలు లేవా?

ఆకలి అనే మూడు అక్షరాల పదం ఎన్నో గుండెలపై బండవేసి, ఎన్నో కడుపులను మాడ్చేస్తుంది. నాగరికత ఎంత పరుగులు పెట్టినా, టెక్నాలజీ ఆకాశహర్మ్యాలను సృష్టిస్తున్నా, ఆకలితో అలమటించేవారి సంఖ్య మాత్రం నానాటికీ పెరిగిపోతోంది. ఇది మనల్ని కంటికి రెప్పలా వెంటాడే చేదు నిజం. ఆకలి అనేది కేవలం కడుపులో మండే మంట కాదు; అది మనిషి శారీరక, మానసిక, సామాజిక జీవనాన్ని తలకిందులు చేసే భయంకరమైన అగ్నిజ్వాల. మన సామాజిక ప్రగతికి అద్దం పట్టే ఓ చీకటి చిత్రం ఇది.

**ప్రపంచ ఆకలి: కన్నీటి కట్టలు తెంచుతున్న దృశ్యాలు**

మన భూమి ఆకలిని తీర్చడానికి పుష్కలంగా పండిస్తోంది. ఆహారం ఉన్నా సరే, అది అందరికీ అందడం లేదు. ఎందుకు? అని ప్రశ్నించుకుంటే, యుద్ధాల కరాళ నృత్యం, వాతావరణ విపత్తుల దండు, ఆర్థిక మాంద్యాల పడగ నీడ, ఇంకా లోతుగా వేళ్లూనుకున్న అసమానతలు – ఇవన్నీ ఆకలి అనే రాక్షసుడికి ఆజ్యం పోస్తున్నాయి. ఆకలి సమస్య ఎంత తీవ్రంగా ఉందో గణాంకాలు కళ్ళముందు స్పష్టం చేస్తున్నాయి. 2024 గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ఫుడ్ క్రైసిస్ చెప్పిన లెక్కలు గుండెలను బరువెక్కిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 78.3 కోట్ల మందికి పైగా ఆకలి అనే మంటతో నిత్యం పోరాడుతున్నారు. 2023లో సంక్షోభ ప్రాంతాల్లో 28.2కోట్ల మందికి పైగా తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొన్నారు. ఇది కేవలం సంఖ్య కాదు, ప్రతి సంఖ్య వెనుక ఒక జీవితం, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు ఉంది. ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ (FAO) అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 42% మంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. అంటే, సగం మందికి పైగా ప్రజలు కనీసం పోషక విలువలున్న ఆహారం కూడా తినలేకపోతున్నారు. ఇది నిజంగా మానవాళి సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం.



**భారతావనిలో ఆకలి – కనబడుతున్న వాస్తవం:**

మన భారతదేశం అపారమైన వ్యవసాయ సంపద ఉన్న దేశం. అయినా కూడా, ఆకలి, పోషకాహార లోపం అనేవి ఇక్కడ తీరని గాయాలు. గ్లోబల్ హంగర్ ఇండెక్స్, నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 5 గణాంకాలు మన కళ్ళ ముందు నిజాన్ని నిలుపుతున్నాయి. మన దేశంలో సుమారు 16% మంది పోషకాహార లోపంతో అలమటిస్తున్నారు. ఐదేళ్లలోపు పిల్లలలో 35.5% మంది వయస్సుకి తగ్గ ఎత్తు లేరు, 19.3% మంది ఎత్తుకి తగ్గ బరువు లేరు. ఏకంగా 32.1% మంది పిల్లలు తక్కువ బరువుతోనే ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ఉత్పత్తిదారులలో ఒకటిగా ఉన్న మన దేశంలో ఈ పరిస్థితి మనల్ని తీవ్రంగా కలవరపెడుతుంది. మహిళల విషయానికొస్తే, ప్రపంచవ్యాప్తంగా కోటిమందికి పైగా మహిళలు, కౌమార బాలికలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ సంఖ్యలో మనదేశం నుండి గణనీయమైన వాటా ఉంది. తల్లి కడుపు నిండకపోతే, పుట్టబోయే బిడ్డకు ఆరోగ్యం ఎలా? ఈ పోషకాహార లోప చక్రం తరతరాలుగా కొనసాగుతోంది. ఐదేళ్ల లోపు పిల్లలలో సంభవించే మరణాలలో దాదాపు 45% పోషకాహార లోపం వల్లనే సంభవిస్తున్నాయని అంచనా. ఇది ఒక అదృశ్య విషాదం, ప్రతిరోజూ మన కళ్ళ ముందే జరుగుతున్న ఘోరం.

**ఆకలికి మూలాలు – కారణాల అన్వేషణ:**

ఆకలి సమస్యకు మూలాలు బహుముఖంగా ఉన్నాయి. వాతావరణ మార్పులు అస్తవ్యస్తమైన వర్షపాతం, కరువులు, వరదలు, వడగాల్పులు వంటి రూపాల్లో ఆహార ఉత్పత్తిని నిరంతరం బెదిరిస్తూనే ఉన్నాయి. అతివృష్టి, అనావృష్టి ఈ రెండింటి కారణంగా రైతుల పంటలు పాడైపోతున్నాయి. అప్పుడు వారు తినడానికి తిండి లేక, అప్పుల పాలై ఆకలితో అల్లాడుతారు. దీనికి తోడు, ఆర్థిక అసమానతలు, ద్రవ్యోల్బణం వలన అందరికీ అందుబాటులో ఆహారం ఉండడం లేదు.

**ఆకలి లేని సమాజం – దిశానిర్దేశం:**

కడుపునిండా తినే హక్కు ప్రతి మనిషికి ఉంది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన, ఆహార హక్కును ప్రాథమిక మానవ హక్కుగా గుర్తిస్తుంది. ఒక విత్తనం నాటితే అది పెద్ద చెట్టై పండ్లు ఇచ్చినట్లుగా, మనం ఇప్పుడు వేసే చిన్న చిన్న అడుగులు, దీర్ఘకాలంలో పెద్ద మార్పును తీసుకువస్తాయి. కేవలం కడుపు నింపడం కాదు, ఆ కడుపుని నింపే వ్యవస్థలకు ప్రాణం పోయాల్సిన సమయమిది. వ్యవస్థాగత మార్పులు ఆకలి సమస్యలను తట్టుకుని, మళ్ళీ నిలబడే శక్తిని, బలాన్ని కలిగించే వ్యవస్థలను తయారు చేయాలి. స్థితిస్థాపక ఆహార సరఫరా గొలుసులను నిర్మించడం, స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వ్యవస్థాగత అసమానతలను పరిష్కరించడం ఇవన్నీ ఇందులో భాగం. వాతావరణ మార్పుల సుడిగుండంలో చిక్కుకుపోయి, ప్రతిరోజూ బతుకు కోసం పోరాడుతున్న చిన్న రైతులకు, ముఖ్యంగా మహిళలకు అండగా నిలబడాలి. స్థానిక ఆహార వ్యవస్థలకు వారే వెన్నెముక. వారికి వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పద్ధతులు, అప్పులు, సాంకేతికత, మార్కెట్ అనుసంధానం మరింత సురక్షితమైన, సమానమైన ఆహార పంపిణీకి బాటలు వేస్తుంది. మహిళా రైతులకు వనరులకు సమాన ప్రాప్యత ఉన్నప్పుడు, వ్యవసాయ ఉత్పత్తి 30% వరకు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రభుత్వ పథకాలు, సమర్థవంతమైన అమలు కీలక పాత్ర పోషిస్తాయి. మన భారతదేశం ఈ సమస్యకు స్పందించే తీరులో స్వల్పకాలిక ఉపశమనం, దీర్ఘకాలిక వ్యవస్థాగత మార్పు రెండూ ఉండాలి. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్, మధ్యాహ్న భోజన పథకం, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ వంటి పథకాలు కొంతవరకు ఫలితాలనిచ్చినా, వాటి అమలులో లోపాలు, లీకేజీలు, ఇంకా అందరికీ అందకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. పోషకాహార సున్నితమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, ఆహార వైవిధ్యాన్ని పెంచడం తక్షణ అవసరం. మారుమూల, గిరిజన ప్రాంతాలలో ఇనుము, ప్రోటీన్, సూక్ష్మ పోషకాలు అధికంగా ఉండే ఆహారా లు లభించేలా చూసుకోవడం చాలా కీలకం. కేవలం ప్రభుత్వ విధానాలు మాత్రమే కాకుండా, ప్రైవేట్ రంగం కూడా ఆహార నష్టాన్ని, వ్యర్థాలను తగ్గించడంలో, స్థానిక రైతులకు మద్దతు ఇవ్వడంలో, పౌష్టికాహారాన్ని అందించే ఉత్పత్తులలో పెట్టుబడి పెట్టడంలో భాగస్వామ్యం వహించాలి. కరువును తట్టుకునే, తక్కువ నీటితో పండే పంటల విత్తనాలను రైతులకు అందివ్వాలి. తక్కువ నీటిని వాడే డ్రిప్ ఇరిగేషన్ వంటి నూతన వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టాలి. పంటలు నష్టపోయినా వారికి కొంత డబ్బు వచ్చేలా ఇప్పటి కంటే ఇంకా ఎక్కువ భీమా పథకాలు ఏర్పాటు చేయాలి. పండిన పంటను సరైన ధరకి అమ్ముకోవడానికి మార్కెట్లకు అనుసంధానం కల్పించాలి.

**ఆకలి లేని రేపటి కోసం – మన కర్తవ్య దీక్ష:**

పేదరికం ఆకలికి దారితీసి, అది తిరిగి పేదరికాన్ని పెంచే ఈ ఆకలి చక్రాన్ని బద్దలు కొట్టాలి. ఆకలిని కేవలం ఆహార సమస్యగా కాకుండా, సామాజిక, ఆర్థిక, పర్యావరణ న్యాయ సమస్యగా గుర్తించాల్సిన సమయం ఇది. మనం ప్రజలలో, ముఖ్యంగా అట్టడుగు వర్గాల వారిలో పెట్టుబడి పెట్టాలి, ఇంకా ఉత్పాదకమైనవి మాత్రమే కాకుండా, అందరినీ కలుపుకుపోయే, సమానమైన, స్థిరమైన ఆహార వ్యవస్థలను నిర్మించాలి.ఆకలి లేని రేపటి కోసం, ఏ బిడ్డ కూడా ఆకలితో నిద్రపోకుండా, ఏ తల్లి బలహీనతతో బిడ్డను కనకుండా, ఏ రైతు ఒంటరిగా పోరాడకుండా చూసేందుకు మనం కట్టుబడి ఉందాం. మన చుట్టూ ఉన్న ఆకలి కేకలను విందాం, మనవంతు సాయం చేద్దాం. రేపటితరం ఆకలిలేని సమాజంలో జీవించేలా మనవంతు కృషి చేద్దాం!



జనక మోహన రావు దుంగ
8247045230

# ఆహారధాన్యాల్లో జన్యు మార్పిడి విలయంవైపు ప్రయాణం



కమల హాసన్ తుమ్మ
జీవశాస్త్ర నిపుణుడు
9505618252

ప్రతిష్టాత్మకమైన శాస్త్రీయ పురోగతులు మానవ జీవితాన్ని సులభతరం చేస్తున్నాయనడం లో సందేహం లేదు. అయితే కొన్ని పరిణామాలు దీర్ఘకాలిక పర్యవసానాలను లెక్కచేయకుండా ఆచరిం చబడ్డప్పుడు, అవి మానవాళికి సమస్యలుగా మారతాయి. ఇటువంటి సంభావ్య ప్రమాదాలలో ఒకటి జన్యు మార్పిడి (Genetically Modified GM) ఆహార ధాన్యాల వినియోగం. ఈ అంశంపై దేశవ్యాప్తంగా మెలకువ పెరుగుతున్న వేళ, సంపూర్ణ అవగాహనతో కూడిన చర్చ జరగాల్సిన అవసరం వుంది. జీవవైవిధ్యాన్ని కాపాడుకునే కర్తవ్యం ఉన్న మన దేశానికి ఇది అత్యవసరమైన పరిణామం.

**జన్యు మార్పిడి:**

జన్యు మార్పిడి అనేది జీవుల డిఎన్ఎలో కృత్రిమం గా మార్పులు చేసి, వాటి లక్షణాలను మార్చే ప్రక్రియ. ఈ విధానాన్ని ఉపయోగించి కొన్ని ధాన్యాలలో పురుగుల నిరోధకత, ఎక్కువ దిగుబడి, వాతావరణ అనుకూలత వంటి లక్షణాలను కలిపేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ఉదాహరణకు Bt పత్తి, GM సోయాబీన్, Bt మక్క వంటి పంటలు ఇప్పటికే కొన్ని దేశాల్లో సాగు అవుతున్నాయి. అయితే మనం ప్రశ్నించాల్సింది – ఈ ప్రయోగాలు మన ఆరోగ్యానికి, భూమి పోషణకు, జీవవైవిధ్యానికి హానికరమా లేదా?





**ఆరోగ్యంపై ప్రభావాలు**

జన్యు మార్పిడైన ఆహారాలు మానవ శరీరంపై ఏ విధమైన ప్రభావం చూపుతాయో దశాబ్దాలుగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని అధ్యయనాలు చెప్పినట్లు, జన్యుమార్పిడి ఆహారాలు దీర్ఘకాలికంగా తీసుకుంటే అలెర్జీలు, జీవకణాలలో మార్పులు, హార్మోన్ అసమతుల్యతలు ఏర్పడే ప్రమాదం ఉంది. కొన్ని ప్రయోగాల్లో జన్యుమార్పి డి మక్క తిన్న జంతువులకు జనన సంబంధిత సమస్యలు, అ వయవాల పనితీరులో మార్పులు కనిపించాయి. మానవులపై దీర్ఘకాలిక ప్రభావాలపై స్పష్టమైన అధ్య యనాలు లేనప్పటికీ, ప్రభావం ఉంటుంది అనేది నిజం. కాబట్టి మానవ ఆరోగ్యం పై విస్తృత పరిశోధనల తర్వాత మాత్రమే ఈ తరహా ఆహారాలను అనుమతించాలి.

**పర్యావరణంపై ముప్పు**

జన్యుమార్పిడి పంటలు జీవవైవిధ్యానికి తీవ్రమైన ముప్పు. ఉదాహరణకు: Bt పంటల వల్ల ఆవాస జీవులు(nontarget species)ప్రమాదంలో పడతాయి. ఇది పరస్పర నిష్పత్తుల్ని దెబ్బతీయగలదు. ఒకే విధమైన జన్యు లక్షణాలు కలిగిన విత్తనాలను విస్తృతంగా సాగు చేయడం వల్ల సహజ విత్తన రకాలు మాయమయ్యే ప్రమాదం ఉంది. జన్యు మార్పిడి పంటలు సహజమైన క్రిమిసంహార కాల కు ప్రోత్సాహం ఇవ్వడం వల్ల సూపర్ పురుగులు అభివృద్ధి చెందే ప్రమాదం ఉంది. ఇవి సాధారణ పురుగుమందులకు చెరగని జీవులుగా మారుతాయి. ఈ విధంగా, పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, భవిష్యత్ తరాలకు మిగిలే భూమి సారవంతత కూడా ప్రమాదంలో పడుతుంది.

**రైతులపై ప్రభావం**

భారతీయ వ్యవసాయ వ్యవస్థ చిన్న, మధ్య రైతుల పై ఆధారపడినది. జన్యు మార్పిడైన విత్తనాలు ఎక్కువ ఖర్చుతో కూడినవే కాకుండా, చాలావరకు బహుళజాతి సంస్థల ఆధీనంలో ఉంటాయి. ఇవి తమ విత్తనాలను పునరుత్పత్తి చేసుకోలేని విధంగా రూపొందిస్తాయి. రైతులు ప్రతి పంట కాలంలో కొత్తగా విత్తనం కొనాల్సిందే. పేటెంట్ హక్కులు రైతుల స్వాతంత్ర్యాన్ని హరిస్తున్నాయి. వారు స్వతంత్రంగా విత్తనాన్ని భద్రపరచుకునే స్వేచ్ఛ కోల్పోతున్నారు. కొన్ని జన్యు మార్పిడి విత్తనాలు విఫలమైన సందర్భాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. Bt పత్తి పంట ఫెయిల్యూర్లు, రైతుల ఆత్మహత్యలు ఈ తరహాలోనే చోటు చేసుకున్న ఉదాహరణలు. ఇది కేవలం వాణిజ్యపరమైన ప్రయోజనాల కోసమే జరిగే ప్రక్రియల పట్ల నిరోధం అవసరమన్న భావన ప్రజల్లో బలపడుతోంది.

**న్యాయపరంగా**

భారతదేశంలో జన్యు మార్పిడి ఆహారాల వ్యాప్తిని నియంత్రించడానికి జిఇఎసి అనే సంస్థ బాధ్యత వహిస్తోంది. అయితే ఈ కమిటీ తీర్పులపై మిశ్రమ స్పందన ఉంది. ప్రస్తుతం మనదేశంలో Bt పత్తి మాత్రమే చట్టబద్ధంగా అనుమతించబడి ఉంది. కానీ ఆన్‌లైన్ మార్కెట్ల ద్వారా ఇతర జన్యు మార్పిడి విత్తనాలు అక్రమంగా విక్రయమవుతున్నట్లు కేసు లు నమోదు అవుతున్నాయి. అలాగే, జన్యు మార్పిడి మక్క లేదా జన్యు మార్పిడి మస్టర్డ్ వంటి పంటలకు అనుమతి ఇవ్వాలన్న చర్చలు కూడా జరుగుతున్నాయి.ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని రూపొందించకపోవడం, ప్రజలలో అసంతృప్తిని కలిగిస్తోంది.

**ప్రజా చైతన్యం మరియు ఉద్యమాలు**

దేశవ్యాప్తంగా ప్రజా సంఘాలు, రైతు సంఘాలు, శాస్త్రవేత్తలు, ఆరోగ్య కార్యకర్తలు – జన్యు మార్పిడి ఆహారాల వ్యాప్తికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. సేవ్ ది సీడ్ స్వదేశీ విత్తనాల పరిరక్షణ జీవవైవిధ్య పరిరక్షణ వంటి ఉద్యమాలు ప్రజల మద్దతు కూడగట్టుకుంటున్నాయి. అంతర్జాతీయంగా కూడా కొన్ని దేశాలు (ఉదా: ఫ్రాన్స్, జర్మనీ, రష్యా) జన్యు మార్పిడి ఆహారాలపై నిషేధం విధించాయి. మన దేశం కూడా ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరం వుంది.

**పరిష్కార మార్గాలు**

సహజ మరియు దేశీయ విత్తన రకాలను ప్రోత్సహించి, వాటిపై పరిశోధనకు ప్రభుత్వం పెద్దపీట వేయాలి.జీవ వ్యవసాయం, ఆర్గానిక్ పద్ధతులను ప్రోత్సహించాలి. ప్యాకేజింగ్‌పై జన్యు మార్పిడి/స హజ విత్తన వివరాలు స్పష్టంగా ఉండాలి. జిఇఎసి వంటి సంస్థలను పారదర్శకంగా, ప్రజా భద్రత కోణంలో పనిచేసేలా పునఃనిర్మించాలి. రైతుల స్వావలంబనకు పథకాలు రచించాలి. విత్తన స్వాతంత్ర్యం కోసం రైతులకు మద్దతు కల్పించాలి. ఆహారం అనేది కేవలం శరీర పోషణ కోసమే కాదు – అది సంస్కృతి, జీవన శైలికి ప్రతీక. మన ఆహార వ్యవస్థలో మార్పులు తెచ్చే ముందు, వాటి ప్రభావాలను శాస్త్రీయంగా, సమాజపరంగా, ఆర్థికపరంగా విస్తృతంగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్ తరాల జీవన భద్రత కోసం, ఆహార ధాన్యాల్లో జన్యు మార్పిడికి నో చెప్పే సమయం ఇది. వృద్ధి వైపు కాదు, విలయం వైపు దారితీసే మార్గాలకు నో చెప్పడమే నిజమైన శాస్త్రీయ ఆలోచన.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు
ఐదుగురు మృతి, 25 మందికిపైగా కార్మికులకు గాయాలు



**చండీగఢ్ :** పంజాబ్‌లోని ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు జరిగింది. ఈ పేలుడులో ఐదుగురు మృతి చెందగా, 25 మందికిపైగా కార్మికులు గాయపడ్డారు. ఈ ఘటన శ్రీ ముక్తసర్ సాహిబ్ జిల్లాలోని లంబి నియోజక వర్గం పరిధిలోని సింఘే వాలాఫరీద్‌కోట్ కోట్లిలో జరిగింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం, ఈ పేలుడు జరిగిన చోట రెండు క్రాకర్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఒక యూనిట్‌లో క్రాకర్లు తయారు చేసి, మరో యూనిట్‌లో క్రాకర్లు ప్యాక్ చేస్తారు. అయితే క్రాకర్లు తయారు చేసే చోట ఈ పేలుడు జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మకులు మృతి చెందారు. కొంత మంది కార్మకులు శిథిలాల కింద చిక్కుకున్నారు. అనంతరం కొందరిని సివిల్ ఆసుపత్రికి, మరికొందరిని ఎయిమ్స్‌కి తరలించారు. ఎస్ఎస్‌పి అఖిల్ చౌదరి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. '

# భయం పాములాంటిది!
పడగెత్తితే గుహనుంచి లాగి తొక్కేస్తాం

పహల్గామ్ దాడి సూత్రదారులు నక్కి ఉన్న ప్రదేశాలను భారత సాయుధ బలగాలు కూల్చివేశాయ్ : ప్రధాని మోదీ



**కరకట్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భయాన్ని పాముతో పోల్చారు. అది మళ్ళీ తన పడగను ఎత్తితే, గుహ నుండి బయటకు లాగి తొక్కేసినట్లు పాకిస్థాన్‌లో కూర్చుని జమ్ముకశ్మీర్ పహల్గామ్‌లో దాడి సూత్రధారులు నక్కి ఉన్న ప్రదేశాలను భారత సాయుధ దళాలు ధ్వంసం చేశాయని పేర్కొన్నారు. శుక్రవారం ప్రధాని మోదీ బీహార్‌లోని కరకట్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్' భారత అమ్ములపొదిలో ఒక బానం మాత్రమేనన్నారు. ఉగ్రవాదంపై పోరాటం ముగియలేదని, దానిని ఆపేంత వరకూ కొనసాగుతూనే ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. గత నెలలో మధుబని జిల్లాలో తాను ర్యాలీని చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ 'పహల్గామ్‌లో జరిగిన దారుణమైన దాడి తర్వాత ఒక రోజు నేను బీహార్‌కు వచ్చాను, అక్కడ మన సోదరీమణులు చాలా మంది తమ భర్తలను కోల్పోయారు. నేరస్థులకు వారు కలలో కూడా ఊహించని శిక్ష లభిస్తుందని నేను వాగ్దానం చేశాను. ఈ రోజు, నేను హామీని నెరవేర్చిన తర్వాత బీహార్‌కు తిరిగి వచ్చాను' అని అన్నారు. 'భారతదేశపు కుమార్తెలు ధరించే సిందూరం (సింధూరం) శక్తిని పాకిస్థాన్‌తో పాటు యావత్ ప్రపంచం చూసింది. పాక్‌సైన్యం రక్షణలో ఉగ్రవాదులు సురక్షితంగా ఉండేవారు. కానీ మేము వారిని మోకాళ్లపై నిలబెట్టాము. పాకిస్థాన్ వైమానిక స్థావరాలను, వారి సైనిక స్థావరాలను కూడా నాశనం చేసాము. ఇది కొత్త భారతదేశం (నయా భారత్), దాని శక్తి అందరూ చూడవచ్చు' అని ప్రధాన మంత్రి అన్నారు. ఆపరేషన్ సిందూర్ మన అమ్ముపొదిలో ఒక బాణం మాత్రమే అని శత్రువు గ్రహించాలన్నారు. ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదని, ఆగలేదు అని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం మళ్ళీ పడగెత్తాలని ప్రయత్నిస్తే, దానిని దాని మూలాల నుండి బయటకు లాగి తొక్కివేస్తామన్నారు. అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ పరిపాలన ఒత్తిడితో ప్రభుత్వం 'కాల్పు విరమణ'కు అంగీకరించిందని కొన్ని ప్రతిపక్ష పార్టీల విమర్శల నేపథ్యంలో ప్రధాన మంత్రి ఈ ప్రకటన చేయడం గమనార్హం. మోదీ తన ప్రసంగంలో జమ్ము కశ్మీర్‌లో దేశం కోసం పోరాడుతూ మరణించిన సరన్ జిల్లాకు చెందిన బిఎస్ఎఫ్ సబ్‌ఇన్స్‌పెక్టర్ మహ్మద్ ఇంతియాజ్ గురించి కూడా ప్రస్తావించారు. అతని త్యాగాన్ని 1857 తిరుగుబాటు వీరులలో ఒకరిగా పరిగణించబడే బీహార్‌లోని జగదీష్‌పూర్ రాజు వీర్ కున్వర్ సింగ్ పరాక్రమంతో పోల్చారు. సరిహద్దు భద్రతా దళాన్ని ప్రశంసిస్తూ మాతృతభూమికి సేవ చేయడం బిఎస్ఎఫ్ జవాన్లకు అత్యున్నతమైనదని వ్యాఖ్యానించారు. దేశానికి శతృవులుగా వ్యవహరించే వారు ఎక్కడ ఉన్నా వారిపై తమ పోరాటం అని చెప్పారు. ప్రజలు వీధుల్లోకి రావడానికి భయపడే సందర్భాలు ఉన్నాయని, ఎందుకంటే వారు ఎప్పుడు, ఎక్కడ నక్సలైట్ల దాడులను ఎదుర్కొంటారో వారికి తెలియదన్నారు. నక్సలైట్ల ప్రభావిత గ్రామాలకు ఆసుపత్రులుగానీ, మొబైల్ టవర్లుగానీ లేవన్నారు. ఒకప్పుడు నక్సల్స్ పాఠశాలలకు నిప్పు పెట్టేవారు, రోడ్డు నిర్మాణంలో పాల్గొన్న వారిని హత్య చేసేవారు, వారికి బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంపై నమ్మకం లేదని మోదీ పేర్కొన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్‌డిఎ ప్రభుత్వం కఠినంగా శిక్షించడం ప్రారంభించిందని మోడీ పేర్కొన్నారు. నక్సలైట్ల హింస ప్రభావిత జిల్లాల సంఖ్య 125 నుండి కేవలం 18కి తగ్గిందని ఆయన అన్నారు. కాగా, బీహార్ అభివృద్ధి కోసం తన ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి కూడా మోడీ మాట్లాడారు, అక్కడ కొత్త విమానాశ్రయాలు వస్తున్నాయని, ఉన్నవి కూడా కొత్త రూపం దాల్చుతున్నాయన్నారు. రాష్ట్రంలో బిజెపి ప్రధాన ప్రత్యర్థి అయిన ఆర్‌జెడిని పరోక్షంగా ప్రస్తావిస్తూ, 'పెద్ద ఎత్తున వలసలకు కారణమైన పాలన కలిగిన వారు ఇప్పుడు అధికారాన్ని చేజిక్కించుకోవడానికి సామాజిక న్యాయం చేస్తున్నట్లు నటిస్తున్నారు' అని ప్రధాని అన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం మోదీ కరకట్‌లో రూ.48,520 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.

**పహల్గామ్ బాధితుడిని పరామర్శించిన మోదీ**

ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో మరణించిన 26 మందిలో ఒకరైన శుభం ద్వివేది కుటుంబాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పరామర్శించారు. చాకేరి విమానా శ్రయంలో దుఃఖిస్తున్న కుటుంబాన్ని ప్రధాని కలిశారు. ఇది చాలా భావోద్వేగ సమావేశం అని శుభం బంధువు సౌరభ్ ద్వివేది అన్నారు. 'ప్రధాని మోదీని కలిసినప్పుడు కుటుంబ సభ్యులందరూ ఏడవడం ప్రారంభించారు' అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ప్రధా న మంత్రి కూడా భావోద్వేగానికి గురయ్యారు. శుభం కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారని సౌరభ్ వెల్లడించారు.

## సుప్రీంకోర్టులో కొత్త జడ్జిలు ప్రమాణం
భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్‌చే ముగ్గురి ప్రమాణం



**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సహా 34మంది జడ్జిల సంఖ్యతో తాజాగా అత్యున్నత న్యాయస్థానం పూర్తిస్థాయి పనిసామర్థ్యాన్ని భర్తీ చేసుకుంది.శుక్రవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ జస్టిస్ ఎన్‌వి.అంజారియా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్, జస్టిస్ ఎఎస్. చందుర్కర్‌లను సుప్రీంకోర్టు న్యాయ మూర్తులుగా పదవీ స్వీకారం చేయించారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో సిజెఐ ఈ ముగ్గురు జడ్జిలతో ప్రమాణం చేయించారు. దీంతో సుప్రీంకోర్టులో సిజెఐ సహా 34మంది జడ్జిలతో ఉండాల్సిన పూర్తి సంఖ్య భర్తీ జరిగింది. కర్నాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ అంజారియా, గువహతి హైకోర్టు చీఫ్ జస్టిస్ విజయ్ బిష్ణోయ్, బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ చందుర్కర్ లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సోమవారం సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన విషయం తెలిసిందే. న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ వారి నియామకాల విషయాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా, జస్టిస్ అభయ్ ఎస్. ఓకా, హృషజకేష్ రాయ్‌లు పదవీవిరమణ చేయడంతో ఇప్పటి వరకూ ఖాళీగా ఉన్న మూడు స్థానాలలో కొత్తగా ముగ్గురి జడ్జిల నియామకం జరగడంతో వారు శుక్రవారం ప్రమాణం చేశారు. జస్టిస్ అంజారియ కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2024, ఫిబ్రవరి 25న ప్రమాణం చేశారు. ఇంతకుముందు ఆయన 2011, నవంబర్‌లో గుజరాత్ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులయ్యారు. ఆ తర్వాత 2013 సెప్టెంబరు 6న పర్మినెంట్ జడ్జిగా స్థిరపడ్డారు. 1965, మార్చి 23న అహ్మదాబాద్‌లో అజారియా జన్మించారు. 1989లో అహ్మదాబాద్‌లోని యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా నుంచి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఆగష్టు 1988నుంచి అజారియా గుజరాత్ హైకోర్ట్ నుంచి లా ప్రాక్టీస్ ప్రారంభించారు. ఆ సమయంలో ఆయన రాజ్యాంగసంబంధిత అంశాలు, అన్ని కేటగిరీలకు చెందిన సివిల్ కేసులు, న్యాయ సేవ విషయాలకు సంబంధించిన కేసులను వాదించారు. జస్టిస్ బిష్ణోయ్‌గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2024, ఫిబ్రవరి 5న ప్రమాణం చేశారు. ఆయన రాజస్థాన్ హైకోర్టు అడిషనల్ జడ్జిగా 2013, జనవరి 8న నియమితులయ్యారు. 2015, జనవరి 7న హైకోర్టు శాశ్వత జడ్జి అయ్యారు. 1964లో జోధ్‌పూర్‌లో మార్చి 26న బిష్ణోయ్ జన్మించారు. 1980 జులై 8న న్యాయవాదిగా ఎన్‌రోల్ చేసుకున్నారు. రాజస్థాన్ హైకోర్టులో, జోధ్‌పూర్‌లోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)లో ప్రాక్టీస్ చేశారు.1965 ఏప్రిల్ 7న జన్మించిన జన్మించిన జస్టిస్ చందుర్కర్ న్యాయశాస్త్రంలో పట్టా పొందిన తర్వాత 1988 జులై 21న బార్‌లో నమోదు అయ్యారు. జస్టిస్ చందుర్కర్ 1992లో నాగ్‌పూర్‌కు షిఫ్ట్ అయ్యి వివిధ కోర్టులలో ప్రాక్టీస్ చేశారు. ఆయన 2013, జూన్ 21న బాంబే హైకోర్టు అడిషనల్ జడ్జిగా పదోన్నతి పొందారు.

## ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఏమైనా చేస్తాం
ప్రమాదకరమై ఆట ముగిసిందని పాక్ అర్థం చేసుకోవాలి
రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ ఆడుతున్న ఉగ్రవాదం అనే 'ప్రమాదకరమై ఆట' ఇక ముగిసిందని ఆ దేశం స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ దెబ్బతో పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చిందని, భారతదేశాన్ని దాడులు చేయకుండా ఆపమని ప్రపంచాన్ని వేడుకుందని పేర్కొన్నారు. గోవాలోని విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌లో, నావికాదళ సభ్యులతో భేటీ అయిన రాజ్‌నాథ్ సింగ్, పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారత్ ఏమాత్రం వెనుకాడదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ కనీసం ఊహించలేని అన్ని పద్ధతులను ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ఉపయోగిస్తామని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదు, ఇది ఉగ్రవాదంపై భారత్ చేసిన ప్రత్యక్ష దాడి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ ఆలోచించగల ప్రతి పద్ధతిని వాడతాం., అంతేకాకుండా పాకిస్థాన్ కనీసం ఆలోచించలేని పద్ధతులను కూడా ఉపయోగించడానికి వెనుకాడమన్నారు. పాక్ తన భూభాగంలో ఉన్న ఉగ్రవాద నర్సరీలను నిర్మూలించాలని, ఇది పాకిస్థాన్‌కే ప్రయోజనకరమని రాజ్‌నాథ్ సింగ్ హితవు పలికారు. 'పాకిస్థాన్ నేల నుంచి బహిరంగంగా భారత వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయి. సరిహద్దు, సముద్ర మార్గాల ద్వారా ఉగ్రవాదులపై ఎలాంటి ఆపరేషన్ నిర్వహించడానికైనా భారత్ పూర్తిగా సిద్ధంగా ఉంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు అన్నీ తమ పౌరులను ఉగ్రవాదం నుంచి రక్షించుకునే హక్కును భారత్ గుర్తిస్తోందని, అందువల్లే నేడు ప్రపంచంలోని ఏ శక్తీ భారత్ ఈ పని చేయకుండా ఆపలేదన్నారు.

## పాక్‌లోని 118 పోస్టులు ధ్వంసం
బిఎస్ఎఫ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు



**పూంచ్ :** పాకిస్థాన్ దుశ్చర్యలను దీటుగా తిప్పికొట్టిన భారత సరిహద్దు భద్రతా దళాల (బిఎస్ఎఫ్)పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించారు. ఇటీవల చేపట్టిన సైనిక ఆపరేషన్ సమయంలో పాక్‌లోని 118 పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయని అన్నారు. వారి సమాచార, నిఘా నెట్‌వర్క్‌ను కూల్చివేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జమ్మూ కశ్మీర్‌లో పర్యటించిన ఆయన.. బిఎస్ఎఫ్ కొట్టిన దెబ్బకు శత్రుదేశం కోలుకునేందుకు ఏళ్లు పట్టే అవకాశం ఉందన్నారు. ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దులోని పౌరులపై దాడులు చేసింది. వీటిని మన బిఎస్ఎఫ్ దళాలు దీటుగా తిప్పికొట్టాయి. దాదాపు 118 పాక్ పోస్టులను ధ్వంసం చే శాయి. శత్రువుల నిఘా వ్యవస్థను ఒక్కొక్కటిగా కూల్చివేశాయి. వాటిని పునరుద్ధరించేందుకు శత్రువులకు దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుంది అని అమిత్ షా పేర్కొన్నారు. బిఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నుంచి తనకు అందించిన సమాచారం ప్రకారం.. పాక్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు భారీ దెబ్బ తగిలిందన్నారు. కొంతకాలం పూర్తి సమాచార ఆధారిత యుద్ధాన్ని చేసే పరిస్థితిలో వారు లేరన్నారు. ఈ సందర్భంగా బిఎస్ఎఫ్ సంసిద్ధతపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. భారత సరిహద్దులో ఎటువంటి దాడులు జరిగినా మొదట ఆ భారాన్ని మోసేది బిఎస్ఎఫ్ జవాన్లేనని అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా.. ఇటీవల పాకిస్థాన్ జరిపిన దాడుల సందర్భంగా నష్టపోయిన కుటుంబాలను అమిత్ షా పరామర్శించారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన పరిహార ప్యాకేజీని కేంద్రం త్వరలో ప్రకటిస్తుందన్నారు.

## తప్పు చేస్తేనే క్షమాపణలు చెబుతాను..
కన్నడ భాష వివాదంపై
కమల్ హాసన్




చెన్నై : తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. కన్నడ భాషపై చేసిన వ్యాఖ్యలకు గానూ ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలనే డిమాండ్లు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా వివాదంపై కమల్ హాసన్ స్పందించారు. ఈ విషయంలో క్షమాపణలు చెప్పేందుకు ఆయన నిరాకరించారు. తప్పు చేసి ఉంటేనే క్షమాపణలు చెప్తానని స్పష్టం చేశారు. 'నేను తప్పు చేస్తే క్షమాపణలు చెప్తాను. లేదంటే చెప్పను. ఇది నా శైలి. ఈ విషయంలో ప్రజలు జోక్యం చేసుకోవద్దు' అంటూ చెప్పుకొచ్చారు. భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశం అని తాను చట్టం, న్యాయాన్ని నమ్ముతానని వ్యాఖ్యానించారు. కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నైలో జరిగిన సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్ మాట్లాడుతూ.. 'కన్నడం.. తమిళం నుంచి పుట్టింది' అని కామెంట్ చేశారు. ఇదే కార్యక్రమానికి కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. ఆయన ఎదుటే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉయిరే, ఉరవే తమిళే (నా ప్రాణం, నా బంధుత్వం తమిళం) అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన కమల్ హాసన్ అనంతరం కన్నడ స్టార్ శివరాజ్ కుమార్‌ని ఉద్దేశించి మాట్లాడారు.

## ఆరేళ్ళలో 291 శాతం పెరిగిన దొంగనోట్లు
ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ :** గడిచిన 11 ఏళ్ళ మోదీ ప్రభుత్వ హాయంలో రూ.6.37 లక్షల కోట్ల విలువైన బ్యాంకు మోసాలు జరిగాయని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మండిపడ్డారు. నోట్ల రద్దు తరువాత బ్యాంకు మోసాలు 416 శాతం పెరిగాయని, రూ.500 దొంగనోట్లు గడిచిన ఆరేళ్ళలో 291 శాతం పెరిగాయని తెలిపారు. తన నరాలలో రక్తం కాదు సిందూరం పరిగెడుతుందన్న మోదీని ఉద్దేశించి ఖర్గే ఎద్దేవా చేస్తూ ' మోదీ జీ మీ నరాల్లో ఏమి పరిగెడుతుందో నాకు తెలియదు కానీ, మీ ప్రభుత్వం నరాల్లో మాత్రం మోసం,బూటకం ఉంది'' అని తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. కాగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో 2016 నవంబర్ 8న రాత్రి ఘనంగా నోట్ల రద్దును ప్రకటించి మోదీ ఆర్థిక వ్యవస్థకు దిగ్భ్రాంతి కలిగించారని, ఆ తరువాత ఎన్నడూ పూర్తిగా కోలుకోలేదని పోస్ట్ చేశారు. ఆ వెంటనే రూ.2000 నోట్లు ప్రవేశపెట్టి అంతే అకస్మాత్తుగా 2023 సెప్టెంబర్ 30న వెనక్కి తీసుకున్నారని, దీనిపై పెట్టిన ఖర్చు వృథా అయిందని విమర్శించారు. 2024–25లో రూ.500 నోట్లు 37 శాతం పెరిగాయని, నాడు దొంగ నోట్లు నిర్మూలిస్తామని చెప్పిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు.

## పలువురు జడ్జిలపై అభ్యంతరకరమైన వీడియో
పరువునష్టం కలిగించే వ్యాఖ్యలపై..'సుప్రీం' సుమోటో 'కంటెంప్ట్' చర్యలు
యూ ట్యూబ్ ఛానల్ ఎడిటర్-ఇన్-చీఫ్ వర్‌ప్రద్‌కు నోటీస్ జారీ



**న్యూఢిల్లీ :** తన యూ ట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన ఒక వీడియోలో కొంతమంది సుప్రీంకోర్టు జడ్జిలపై అవమానకరమైన, పరువునష్టం కలిగించే ధిక్కార వ్యాఖ్యలను చేసిన ఛండీగఢ్ కు చెందిన జర్నలిస్ట్, యూ ట్యూబర్ అజయ్‌శుక్లాపై శుక్రవారం సుప్రీంకోర్టు సుమోటో ధిక్కార చర్యలు ప్రారంభించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జి మాసిహ్, జస్టిస్ ఏఎస్.చందుర్కర్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆ అభ్యంతరకరమైన వీడియోను వెంటనే ఉపసంహరించుకోవాలని, దానిని లేదా అలాంటి కంటెంట్‌ను తిరిగి ప్రచురించకుండా యూ ట్యూబ్ ఛానల్‌ను నిరోధించాలని ఆదేశించింది.అంతేకాకుండా ఆ ఛానల్ ఎడిటర్‌ఇన్‌చీఫ్ వర్‌ప్రద్‌కు నోటీస్ కూడా జారీచేసింది. ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు 'చాలా తీవ్రమైనవి' అని అభివర్ణించారు. ఈ అంశాన్ని సుమోటో నేరంగా స్వీకరించినందుకు ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలియజేశారు.'అజయ్‌శుక్లాపై కోర్టు ధిక్కార కేసును నమోదు చేయాలని రిజిస్ట్రీని మేం ఆదేశిస్తున్నాం.యూట్యూబ్ ఛానల్ ప్రధాన ప్రతివాదిగాఉంటుంది.అటార్నీజనరల్ (ఆర్.వెంకటనరమణజ), సొలిసిటర్ జనరల్(తుషార్ మెహ్‌తా) కోర్టుకు సహకరించాలని కోరుతున్నాం' అని ధర్మాసనం ఒక మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. వీడియో ప్రచురణను వెంటనే నిలిపివేయాలని, దానిని వెంటనే వెనక్కి తీసుకోవాలని యూ ట్యూబ్ ఛానల్‌ను బెంచ్ నియంత్రించింది.

## నిలంబూర్ ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా స్వరాజ్

తిరువనంతపురం : కేరళలోని నిలంబూర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికకు ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా పార్టీ నేత ఎం స్వరాజ్‌ను సిపిఐ(ఎం) శుక్రవారం ప్రకటించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్ మధ్య గట్టి పోటీ ఏర్పడనుంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ ఉప ఎన్నికలు రెండు కూటములకు కీలకం కానున్నాయి. శుక్రవారం జరిగిన సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం సమావేశం అనంతరం మీడియా సమావేశంలో స్వరాజ్ అభ్యర్థిత్వాన్ని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం వి గోవిందన్‌ప్రకటించారు. 2016–2021 కాలంలో ఎర్నాకులం జిల్లాలోని త్రిపునితుర అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే స్వరాజ్, మలప్పురం జిల్లాలోని నిలంబూర్‌కు చెందినవారు. 2021 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన కె బాబు చేతిలో ఆయన ఓడిపోయారు. అయితే నిలంబూర్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ సీనియర్ నేత, కేరళ మాజీ మంత్రి ఆర్యదన్ మొహమ్మద్ కుమారుడు ఆర్యదన్ షౌకత్‌ను బరిలోకి దింపుతున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. నిలంబూర్‌లో ఉప ఎన్నిక జూన్ 19న జరగనుంది. పి.వి. అన్వర్ శాసనసభ్యుడిగా రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక జరగనుంది. ఆయన వామపక్ష మద్దతుతో రెండుసార్లు గెలిచారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో వివిధ అంశాలపై విభేదాల కారణంగా ఎల్‌డిఎఫ్‌తో సంబంధాలు తెంచుకున్న అన్వర్ తృణమూల్ కాంగ్రెస్‌లో చేరిన తర్వాత రాజీనామా చేశారు. కాగా, స్వరాజ్ అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తూ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి గోవిందన్ మాట్లాడుతూ నిలంబూర్ ఉప ఎన్నికలో ఎల్‌డిఎఫ్ గణనీయమైన పురోగతి సాధించనుందని అన్నారు. నిలంబూర్ ఉప ఎన్నిక అత్యంత తీవ్రమైన రాజకీయ పోటీలలో ఒకటి అవుతుందనే అవగాహనతోనే స్వరాజ్‌ను పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు ఆయన అన్నారు. స్వరాజ్ విలేకరులతో మాట్లాడుతూ వామపక్షాలు అనేక సందర్భాల్లో గెలిచిన నియోజకవర్గం నిలంబూర్ అని అన్నారు. పార్టీలకు అతీతంగా మాట్లాడేవారు కూడా కేరళను పరిపాలించడానికి వామపక్షాలే ఉత్తమమని నమ్ముతారని ఆయన అన్నారు. ఉప ఎన్నికల్లో వచ్చే ఓట్లు రాష్ట్రంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి ప్రజల ఆమోదాన్ని ప్రతిబింబిస్తాయని స్వరాజ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## అంకిత భండారి కేసులో ముగ్గురికి జీవితఖైదు



కోట్‌ద్వార్ : సుమారు మూడేళ్ల క్రితం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 19 ఏళ్ల రిసెప్షనిస్టు అంకిత భండా హత్య కేసులో ఉత్తరాఖండ్ స్థానిక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. రిసార్ట్ యజమాని పుల్‌కిత్ ఆర్య, అతనికి సహకరించిన ఇద్దరు ఉద్యోగులు సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలను దోషులుగా నిర్ధారించింది. వీరికి జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. ఉత్తరాఖండ్ పౌరీ జిల్లాలోని ఒక పేద కుటుంబానికి చెందిన అంకిత భండారి కొవిడ్ కారణంగా ఆర్థిక సమస్యలతో హోటల్ మేనేజిమెంట్ కోర్సును మధ్యలోనే నిలిపేసింది. ఆమె తండ్రి ఒక గార్డుగా పనిచేసేవాడు. ఈ క్రమంలో పుష్ప అనే స్నేహితురాలు ద్వారా రిషికేష్‌లోని వంతారా రిసార్ట్‌లో ఆమెకు రిసెప్షనిస్టుగా ఉద్యోగం వచ్చింది. 2022 సెప్టెంబర్ 18వ తేదీన ఆమె కనిపించకుండా పోవడం, నాలుగు రోజుల తర్వాత మృత దేహం ఒక కాలువలో దొరకడం సంచలమైంది. దీనిపై జనాగ్రహం వ్యక్తమైంది. పుల్‌కిత్ ఆర్క్ తండ్రి వినోద్ ఆర్య బిజెపి మాజీ నేత కావడంతో కేసు నుంచి అతన్ని తప్పించే ప్రయత్నం జరుగుతోందంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో వినోద్ ఆర్యను పార్టీ నుంచి బిజెపి తొలగించింది. కేసు విచారణను సిట్‌కు అప్పగించారు. ఈ క్రమంలో పుల్‌కిత్ ఆర్య, సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలను అరెస్టు చేశారు. విచారణలో రిసార్ట్‌కు వచ్చే అతిథులకు అదనపు సేవలు అందించాలని అంకితపై పుల్‌కిత్ ఒత్తిడి తెచ్చాడని, ఆమె అంగీకరించకపోవడంతో జరిగిన పెనుగులాటలో అతను, అతని సహోద్యోగులు కలిసి ఆమెను కాలువలోకి తోసేశారని తేలింది. వేధింపులు, హత్య, సాక్ష్యాలను ధ్వంసం చేయడం, ఇమ్మోరల్ ట్రాఫికింగ్ సహా పలు సెక్షన్ల కింద వీరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు 2023 జనవరి 30న తొలిసారి విచారణకు రాగా, మొత్తం 97 మందిలో 47 మంది సాక్ష్యులను సిట్ విచారించింది. 500 పేజుల ఛార్జిషీటును కోర్టుకు సమర్పించింది. ఎట్టకేలకు రెండేళ్ల విచారణ అనంతరం శుక్రవారం నాడు పుల్‌కిత్ ఆర్య, సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలను అదనపు సెషన్స్ జడ్జి రీనా నెగి దోషులుగా ప్రకటించారు. ఈ ముగ్గురికీ జీవిత ఖైదు విధించారు. ముగ్గురు దోషులకు అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి రీనా నేగి రూ. 50,000 జరిమానా విధించారని ప్రాసిక్యూషన్ న్యాయవాది అజయ్ పంత్ తెలిపారు. కాగా, నిందితులకు ఉరిశిక్ష విధించాలని అంకిత తల్లి సోని దేవి మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలంతా తమ కుటుంబానికి మద్దతుగా నిలవాలని కోరారు.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|
| 1 | TS24TA 2144 | EICHER PRO 3018 BS6 FBT | 2023 |
| 2 | TS24TA 2143 | EICHER PRO 3018 BS6 FBT | 2023 |
| 3 | TS27T 2279 | TATA LPT 1109 FBT | 2013 |
| 4 | TS24 7699 | SONALIKA DI 42 RX | 2017 |
| 5 | TS25T 1867 | AL U TRUCK 2518 FBT-T | 2018 |
| 6 | TS24T 7531 | APE XTRA LDX BS6 DIESEL | 2020 |
| 7 | TS24TA 2145 | EICHER PRO 3018 BS6 FBT | 2023 |
| 8 | TS03EB 6229 | BOLERO ZLX BS4 DIESEL 7 SEATER | 2015 |
| 9 | AP29TA 9447 | TATA LPT 3118 CUMMINS FBT | 2010 |

AUCTION DATE 31-05-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No :15-1-237, Shop No. 1, 2 & 3, 2nd Floor Warangal City Center, Beside Guarduan Hospital, Opp : L B College, Mulugu Road , Cell : 9866244432 , 9700100937

## అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** అర్హులైన పేదల అందరికీ ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం కోరారు. మండలంలోని రాఘవపురం గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ శాఖ మహాసభ కూరెళ్ళ మచ్చగిరి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకే మంజూరు చేయాలన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చెయ్యాల ని, చేయని యెడల భవిష్యత్తులో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.అ నంతరం సీపీఐ గ్రామశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సుదగాని పృథ్వీరాజ్, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ అంజద్‌లతో పాటు 10 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. రైతు సంఘం మండల నాయకులు బొక్క దయాకర్ రెడ్డి, ఎండి నయుం, కాటం శ్రీశైలం, మారుపాక మచ్చగిరి, ఎండి తాహెర్ పాషా, మచ్చ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు సిపిఐ మండల కార్యదర్శిగా చాపల శ్రీను

**ప్రజాపక్షం/మునుగోడు:** సిపిఐ మండల నూతన కార్యవర్గాన్ని సిపిఐ 15 మండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా మునుగోడు మండల కేంద్రానికి చెందిన చాపల శ్రీను ఆయనతోపాటు 13 మందితో కూడిన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మండల కార్యదర్శిగా ఎన్నికైన చాపల శ్రీను మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడ తానని పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. నా నియామకానికి సహకరించిన సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యవర్గానికి, మండల కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు.





## కార్యకర్తలకు అండగా ప్రభుత్వం

మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పార్టీ గెలుపుకోసం కష్టపడిన కార్యకర్తలందరికీ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలల్లో, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేక స్థానం కల్పిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖా మాత్యులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమఫలాలు,వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా ప్రధానకార్యదర్శిగా హుజూర్‌నగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ గెల్లి అర్చన భర్త గెల్లి రవిని నియమిస్తూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా లో కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను గురించి తెలియజేస్తూ, పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. గెల్లి రవి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను అప్పగించిన మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో బీఎల్ఆర్ బ్రదర్స్, ఎన్‌వీఆర్ యూత్ ఆధ్వర్యంలో గత నెల రోజుల నుంచి నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్స్, యూనిఫాం, అల్పాహారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్‌కు అలవాటు పడి శారీరక ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదన్నారు. ఇలాంటి సమ్మర్ క్యాంపులను ఉపయోగించుకోని శారీరక ఫిట్నెస్‌ను సాధించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌వీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, ఫౌండేషన్ ముఖ్యులు ఆడోతు అశోక్‌నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలు, మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్‌రెడ్డి, రుణాల్‌రెడ్డి, వెంకన్న, కొమ్ము శ్రీను, నాయకులు జానకిరాంరెడ్డి, నాగునాయక్, లక్ష్మణ్, శరత్, నాగరాజు, అశోక్, మనోహర్ పాల్గొన్నారు.

## త్వరితగతిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ

కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/వలిగొండ :** ధాన్యం కొనుగోలు మిగిలి ఉన్న కేంద్రాల్లో త్వరితగతిన కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శుక్రవారం వలిగొండ మండలంలోని గోకారం ఐకెపి కేంద్రం, సంగెం గ్రామాలలో ఐకెపి, పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి కొనుగోలు కేంద్రాలలో మిగిలి ఉన్న ధాన్యాన్ని వేగంగా పూర్తి చేయాలని కేంద్రం నిర్వాహకులకు ఆదేశించారు. కొనుగులో చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, రైతుల వివరాలు పెండింగ్ లేకుండా ట్యాబ్ ఎంట్రీలు చేసి రైతులకు ఖాతాలో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కొనుగోలు చేసిన 48 గంటలలోపే ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డిఎం సివిల్ సప్లై హరి కృష్ణ, ఇంచార్జ్ పౌర సరఫరాల అధికారి రోజా రాణి, సంబంధిత అధికారులు, కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

## నాణ్యత తగ్గించి వస్తువులను దొంగిలించి...

అధికారుల పర్యవేక్షణ లోపించిన : సిపిఐ

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ప్రసాదాల తయారీలో నాణ్యతను తగ్గించి మిగిలిన వస్తువులను దొంగిలించి వాటిని బ్లాక్ మార్కెట్లో సొమ్ము చేసుకునేందుకు అమ్మేస్తున్నట్లు అనుమానాలు బలపడుతున్నాయని సీపీఐ మండల కార్యదర్శి కలపల్లి మహేందర్, జిల్లా సమితి సభ్యులు శ్రీధర్ ఆరోపించారు. యాదగిరిగుట్ట పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో బుధవారం జరిగిన చింతపండు దొంగతనం దుర్మార్గమన్నారు. జీతాలు అందక దొంగతనం చేస్తారని సురక్ష సిబ్బంది చెప్పడం వాస్తవం కాదన్నారు. ఈ దొంగతనంలో ఆలయ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షణ లోపం స్పష్టమవుతోన్నారు. దొంగతనం కంటే ముందు కారు కొండపైకి ఎలా వచ్చింది ఎప్పుడు వచ్చింది విచారించకుండా పెట్రోల్ పెట్రోలింగ్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఎస్పీఎఫ్ సిబ్బంది అప్రమత్తమయ్యారన్నారు. రాత్రివేళ స్టాక్ గోదాముల వద్ద భద్రత ఎందుకు లేదన్నారు. దేవాదాయ కమిషనర్‌తో సమగ్ర విచారణ జరిపాలన్నారు. రాజులపై చట్టపరమైన తీసుకోకుంటే సిపిఐ ఆధ్వర్యంలో హెచ్చరించారు. సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు మాటూరి మల్లయ్య, అరె పుష్ప, మునుగుంట్ల నరసమ్మ పాల్గొన్నారు.



# బక్రీద్ పండుగకు పటిష్ఠ భద్రత

బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/యాదాద్రి :** జూన్ 7 పవిత్ర బక్రీద్ పండుగ ఉన్నందున ఈద్గాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టరు హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మినీ మీటింగ్ హాలులో బక్రీద్ పండుగ పురస్కరించుకొని శాంతి సంఘ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడింది. ముందుగా మత పెద్దలు చేసిన సూచనలు, సలహాలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. నమాజ్ వేళలో కరెంటు ఉండేలా చూడాలన్నారు. కరెంట్, మంచినీరు వంటి మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. మసీదుల వద్ద పటిష్టమైన పారిశద్య చర్యలు చేపట్టాలని, చెత్త బండ్లు అందుబాటులో ఉంచాలని, చెడు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటింటికి వేస్టేజ్ కవర్లు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంచినీరు సౌకర్యం కల్పించాలని, వీధి దీపాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ముఖ్యంగా ప్రార్థనా సమయాలలో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు. వార్డులలో మంచినీరు సమయానికి వచ్చేలా చూడాలన్నారు. మంచి నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పశువులను తరలించడానికి, వాటిని వధించడానికి ముందు తప్పనిసరిగా పశు వైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగ దృష్ట్యా వెటర్నరీ వైద్యులు అందుబాటులో ఉండాలని ఫిర్యాదులు వచ్చిన వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్యలు పరిష్కరించాలన్నారు. చెక్ పోస్టల వద్ద రెవెన్యూ పోలీస్ వెటర్నరీ అధికారులు నిరంతరం నిగా ఉండేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ఎలాంటి అవాంఛనీ య సంఘటన జరగకుండా, సోదర భావంతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగకు జరుపుకోవాలని తెలిపారు. డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ పవిత్ర బక్రీద్ పండుగ ఉన్నందున మసీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామని, బక్రీద్ పండుగ రోజులలో పూర్తి బందోబస్తు ఉంటుందని, ప్రతి రోజు పెట్రోలింగ్ నిర్వహిస్తామని, సెక్యూరిటీ ఏర్పాట్లు చేస్తామని అందరి సహకారంతో సామరస్య వాతావరణంలో బక్రీద్ పండగను నిర్వహించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఏసిపి లక్ష్మీ నారాయణ, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, డిపిఓ సునంద, జిల్లా పశు వైద్య శాఖ అధికారి యాదయ్య, మత పెద్దలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో ఆర్మడ్ రిజర్వు సిబ్బందికి ఏర్పాటు చేసిన దర్బార్ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి పాల్గొని మాట్లాడుతూ సాయుధ సిబ్బంది విధినిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు,సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, వినతులను అడిగి తెలుసుకునీ సమస్యలను వెంటనె పరిష్కరించే విధముగా కృషిచేస్తాను అని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ లో సాయుధ దళ పోలీస్ పాత్ర కీలకం అని, జిల్లా లో సాయుధ దళ పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు సంతృప్తికరంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మర్డ్ రిజర్వు డిఎస్‌పి శ్రీనివాసులు,ఏ ఓ శ్రీనివాసులు, ఆర్ ఐలు సంతోష్, సూరప్ప నాయుడు, శ్రీనివాస్, హరిబాబు, ఆర్‌ఎస్ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**మత ఘర్షణలు రెచ్చగొడితే కఠిన చర్యలు**

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను సోదర భావంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మత పెద్దలతో నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో జిల్లా ఎస్‌పిపాల్గొని మాట్లాడుతూ రాబోయే బక్రీద్ పండగ పర్వదినాన్ని శాంతియుత వాతావరణంలో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగ జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ శాంతి సంఘ సమావేశంలో నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సిఐ రాఘవరావు, ట్రాఫిక్ సిఐ మహాలక్ష్మయ్య ఎస్ఐ లు గోపాల్ రావు, శంకర్, జయకర్, వివిధ కులాల మత పెద్దలు హాఫీస్ ఖాన్, గోలి మధుసూదన్ రెడ్డి, హాశం, అహ్మద్ కలీం, బండారు ప్రసాద్, క్రిస్టోఫర్, శౌరయ్య, ఎలిజల నరసింహ, కౌన్సిలర్లు సమద్, బషీర్, అమీర్, అభిమన్యు శ్రీను, బాబా, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## తడిసి ముద్దైన నల్లగొండ

భారీ వర్షంతో ప్రజల ఇబ్బందులు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పగలంతా పెరిగిన ఉష్ణోగ్రత సాయంత్రం కల్లా వాతావరణంలో ఒకేసారి మార్పులతో అంతా చల్లబడింది.అంతలోనే భారీ వర్షం కురిసి నల్లగొండ తడిసి ముద్దయింది.పట్టణంలో కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పడం మూలాన గత నాలుగు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి జల్లుల వర్షం కురిసింది. అయితే శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పట్టణంలోని కూరగాయల మార్కెట్ లోకి వరద నీరు చేరడంతో కూరగాయలు, పండ్ల నీళ్లలో కొట్టుకుపోయాయి.దీనితో వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా పాతబస్తీ,ప్రకాశం బజార్,రామగిరి,గొల్లగూడ తదితర లోతట్టు ప్రాంతంలో వరద నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.








## యాదాద్రి జిల్లాలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** జిల్లాలో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆరో తేదీన జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేయనున్నట్లు సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు తెలిపారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని మూసీ ప్రక్షాళనకు నిధులు కేటాయించిన పనులు ప్రారంభించలేదన్నారు. భువనగిరి నుండి అడ్డగూడూరు వరకు సాగునీటి కోసం చేపట్టిన బునాది కాలువ పనులను వెంటనే పూర్తిచేసి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలన్నారు. గంధమల్ల ద్వారా సాగునీటి కోసం 1984లో ఓర్టూరు నుండి గంధమల్ల వరకు పాదయాత్ర చేపట్టామని ఆ పోరాట ఫలితమే ఇప్పుడు మోక్షం లభించిందని అన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానం లో మిగిలిన పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు.యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధి కోసం కమిటీని ఏర్పాటు చేసి పనులు పూర్తి చేయాలన్నారు. కొండ కింద ఉన్న ఘాటు రోడ్డుని తొలగించి వ్యాపారులు వ్యాపార నిర్వహించుకునేలా చూడాలన్నారు.జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కాలేజీ ఏర్పాటు ఏ ప్రాంతంలో జరుగుతుందో స్పష్టత ఇవ్వాలన్నారు. వెంచర్ల ఏర్పాటు కోసం సాగు భూములను ఇవ్వవద్దని, ఈ ప్రాంతంలో భూముల విలువలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## బైపాస్‌పై ఫ్లైఓవర్ నిర్మించాలని ధర్నా



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ కట్టకొమ్ముగూడెం గ్రామాల మధ్య బైపాస్ రోడ్డులో ఫ్లైఓవర్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కట్టకొమ్ముగూడెం, ఆర్లగూడెం, నర్సింహాపురం, ఉత్తమ్ పద్మవతి కాలనీలకు చెందిన ప్రజలు బైపాస్ రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం రోడ్డు ప్రమాదాలతో వందలాది మంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోదాడ పట్టణానికి నిత్యం వేలాది మంది విద్య, వైద్య, ఉపాధితో పాటు ఇతర పనుల కోసం ఆయా గ్రామాల నుండి వచ్చి వెళ్లడం జరుగుతుందన్నారు. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నుండి బయలుదేరిన వ్యక్తి ఈ రోడ్డు దాటి ఇంటికి వచ్చే వరకు ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోయిందని కంటతడి పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో బైపాస్‌పై ఫ్లై ఓవర్ నిర్మించాలని అనేక మార్లు ఆందోళన చేసిన ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. స్థానిక శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మవతి చొరవ చూపి బైపాస్ రోడ్డుపై ఫ్లైఓవర్ నిర్మించాలని కోరారు. బైపాస్‌పై ప్రజలు ఆందోళన చేయడంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. పట్టణ సిఐ శివశంకర్ అక్కడికి చేరుకొని ప్రజలతో మాట్లాడి ధర్నాను విరమింప చేశారు.

## సాగర్లో వికసించిన అరుదైన 'మే' పుష్పం

**ప్రజాపక్షం/నందికొండ:** మే నెలలో మాత్రమే వికసించే పుష్పం సాగర్‌లో కనువిందు చేస్తోంది. ఫుట్ బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ అని పిలువబడే ఈ పుష్పం చూడ్డానికి ఎర్రని బంతిలా, వింతగా ఉండి చూపరులను ఇట్టే ఆకట్టుకొనేలా ఉంటుంది. స్థానిక హిల్ కాలనీకి చెందిన కశుభ సదా శివ రామకృష్ణ, సుధారాణి దంపతులు రెండు సంవత్సరాల క్రితం తమ ఇంట్లో మే పుష్పం మొక్కను నాటగా అది ప్రతి సంవత్సరం మే రెండవ వారంలో వికసించేదని కానీ ఈ ఏడాది ఎండలు ముందుగానే ఎక్కువగా ఉండటంతో ఇది మే నాల్గవ వారంలో వికసించిదని వారు తెలిపారు . ఇవి మే నెలలో పూసి జూన్ వరకు ఉండి ఎండిపోతాయి. మే నెలలో నే పూస్తుంది కనుక దీనిని మే పుష్పం అంటారు. ఇది లిల్లీ జాతికి చెందిన దుంప రకం మొక్క.అరుదుగా పుష్పించే ఈ మొక్కను చుట్టుపక్కల వారు వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు.



## నక్సలైట్లను కాల్చివేతను ఆపివేయాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రవణ్ కుమార్



**ప్రజాపక్షం/నల్లగొండ (నకిరేకల్):** కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను కాల్చివేతను ఆపివేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. సిపిఐ నకిరేకల్ 7వ మండల మహాసభ విద్యాసాగర్ అధ్యక్షతన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగింది. ఈమహాస భకు శ్రవణ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడతూ నరేంద్రమోడి ప్రభుత్వం 2026 మార్చినాటికి మావోయిస్టులకు హంతం చేస్తామని ప్రకటించడం దేశ పౌరులనే హత్య చేయడమేనని పేర్కొన్నారు. కేంద్రప్రభుతం సేవాధర్మ పేరుతో ప్రజ మధ్య విద్వేశాలు పెరుగుతున్నాయిని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ పెటుబడిదారుకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి గౌని లక్ష్మి నర్సయ్య, జాజాల జంగయ్య, లక్ష్మారెడ్డి, దేశ బోయిన భద్రయ్య శ్రీను పాల్గొన్నారు.

**మండల కార్యదర్శిగా లక్ష్మీ నరసయ్య ఎన్నిక :** నకిరేకల్ మండల కార్యదర్శి గౌని లక్ష్మి నర్సయ్య, సహాయ కార్యదర్శిగా పి. విద్యాసాగర్ తో పాటు 7మందితో మండల సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# రూ.2లక్షల నకిలీ ఇంజన్ ఆయిల్ పట్టివేత

ఒకరి అరెస్టు

జిల్లా ఎస్‌పి కె నర్సింహ్మా వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా సిసిఎస్, కోదాడ రూరల్ పోలీసులు రూ. 2లక్షల విలువైన నకిలీ ఇంజన్ ఆయిల్‌ను పట్టుకొని ఒకరిని అరెస్టు చేశారు. అలాగే 14లక్షల విలువైన టోయోట కారును కూడా సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం జిల్లా ఎస్‌పి కె నర్సింహ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శుక్రవారం ఉదయం జిల్లా సిసిఎస్ సిఐ శివ కుమార్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌ల ఆధ్వర్యంలో రామాపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న నకిలీ ఇంజన్ ఆయిల్‌ను పట్టుకొని సీజ్ చేశారు. దీని విలువ రూ. 2లక్షలు ఉంటుందని తెలిపారు. అలాగే 14లక్షల టయోట కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నకిలీ ఆయిల్‌ను తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన కాకాని నాగ వెంకటేశ్వర్ రావును అదుపులో తీసుకున్నారు. విజయవాడలోని పాలిటెక్నిక్ అండ్ ఇన్ మేకానికల్ ఇంజనీరింగ్ చదువుకున్న అతను 1998 నుండి లూబ్రికేట్స్ ఇంజన్ ఆయిల్ కంపెనీలో ల్యాబ్ టెక్నిషియన్‌గా పని చేస్తున్నాడు. ఇంజన్ ఆయిల్ తయారిలో అనుభం ఉన్న ఆయన సులువుగా డబ్బులు సంపాదించాలని నకిలీ ఇంజన్ ఆయిల్‌ను తయారు చేసి పేరున్న కంపెనీల స్టిక్కర్లు వేసి గత కొంత కాలంగా అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిపారు. షాపుల వారికి అమ్మితే గుర్తు పడుతారని బైక్ మెకానిక్‌లకు తాను తయారు చేసిన ఇంజన్ ఆయిల్ తక్కువ ధరలకు అమ్మకాలు జరుపుతున్నాడు. కలకత్తా నుండి క్యాస్ట్రాల్, ప్రో హోండా, హీరో, సర్వో, బజాజ్, డిడిటిఎస్ మొదలకు ప్లాస్టిక్ స్టిక్కర్లు, లెబుల్‌లను తెప్పించి విజయవాడలో మడ్డి ఆయిల్ ఫిల్టర్ చేసే వారి నుండి ఆయిల్ కొనుగోలు చేసి తమ ఇంటి వద్ద డబ్బాల్లో నింపి అమ్మకాలు జరుపుతున్నాడు. లీటర్ రూ. 200ల చొప్పున అమ్ముతు మోసాలకు పాల్పడుతున్నాడు. 2007,9 లో ఇలా వ్యాపారం చేస్తూ పోలీసులకు పట్టుపడ్డాడు. విజయవాడ పో లీస్ స్టేషన్‌లో కేసులు నమోదు కావడంతో జైలు జీవితం గడిపాడు. ఆ తరువాత అగ్రిగోల్డ్ సంస్థలో మార్కెటింగ్ ఉద్యోగం చేస్తుండగా అతికూడా మూసివేయడంతో తిరిగి నకిలీ ఆయిల్ వ్యాపారా న్ని మొదలు పెట్టాడు. రూ. 80తో నకిలీ ఆయిల్ కొనుగోలు చేసి రూ. 200లకు అమ్ముతున్నాడు. సూర్యాపేట జిల్లాలోని నేరేడుచర్ల, మిర్యాలగూడ బైక్ మోకానిక్‌లకు పెద్ద ఎత్తున అమ్మకాలు తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేరస్తుడిని పట్టుకున్న సిసిఎస్ సిఐ శివ కుమార్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డిని ఆయన అభినందించాడు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న, కోదాడ టౌన్ సిఐ రజితారెడ్డి పాల్గొన్నారు.

# అడిషనల్ డిసిపిగా భాధ్యతలు చేపట్టిన రాయల ప్రభాకర్ రావు



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ విభాగం అదనపు డీసీపీ గా రాయల ప్రభాకర్ రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు.ఆసిఫాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీ పనిచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బదిలీ పై వచ్చిన ప్రభాకర్ రావు గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏసీపీ గా పనిచేయడం తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా లో వివిధ హోదాల్లో సమర్ధవంతంగా పనిచేశారు.

# సిఎంను కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** పాలకుర్తి నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి కృషిచేసే సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్‌ను మంజూరుచేయడంతో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సి రాజేందర్‌రెడ్డి హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సిఎంని పాలకుర్తి ప్రాంతానికి విద్యా ప్రగతిని వివరించి, త్వరలోనే నిర్మాణ కార్యక్రమాలు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.

## విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో రైతులు అప్రమత్తం:మూడ్ శోభన్



**ప్రజాపక్షం/దేవరుప్పు:** వానాకాలం సాగుకు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. శుక్రవారం దేవరుప్పుల మండల కేంద్రంలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌ను తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమయ్య, భూక్యా చందు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు సారయ్యతో కలిసి శోభన్ సందర్శించారు. అనంతరం శోభన్ మాట్లాడుతూ, పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన విత్తన కంపెనీలతో రైతులు మోస పోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం నకిలీ విత్తనాలను కల్తీ విత్తనాలను అరికట్టడంలో సమగ్రమైన విత్తన చట్టం తీసుకురావాలని అదే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాణ్యమైన విత్తనాలను సన్నా చిన్నకారు రైతులకు సబ్సిడీపై అందించాలని రాష్ట్రంలో నకిలీ కల్తీ విత్తనాలను అరికట్టడానికి క్యూఆర్ కోడ్ సాఫ్ట్ వెర్ తీసుకురావాలని అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఎరువులు కొనే ముందు:** లైసెన్స్ కలిగిన డీలర్ నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల బస్తాలనే కొనుగోలు చేయాలి. ఎరువుల బస్తాకు చేతికుట్టు ఉంటే సీలు ఉందో లేదో చూ సుకోవాలి. చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్య పదార్థాలు కలిస్తే ఎరువును కల్తీగా గుర్తించాలి. కొనుగోలు చేసే సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి. లైసెన్స్ కలిగిన వాటిల్లో కొనాలి. లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన సమయంలో బిల్లులను సరిచూసుకోవాలి. బిల్లుపై దుకాణం పేరు, కేంద్ర, రాష్ట్ర, అమ్మకపు పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు విక్రయదారుడి సంతకం, తేదీలు, విత్తన రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి. పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుండి విత్తనాలు కొనుగోలు చేయ్యేద్దు. విత్తన ప్యాకెట్, సీసా, బస్తా, డబ్బాలకు సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.

## ఫర్టిలైజర్ షాపులు ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేంద్రంలోని సోమేశ్వర ఫర్టిలైజర్ షాపును శుక్రవారం డిసిపి రాజమహేంద్ర నాయక్ ఆకస్మిక తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌ను, విత్తన ప్యాకెట్లను, పెస్టిసైడ్ మందులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ విత్తనాలను అధిక ధరలకు అమ్మకూడదని, నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎసిపినర్సయ్య, ఎఒశరత్‌చంద్రు, ఎస్ఐ లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో ధైర్యాన్ని కలిగించడానికే ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు

వరంగల్ పోలీస్‌కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** ప్రజలకు ధైర్యాన్ని కలిగించాటానికే ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహిస్తున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.శుక్రవారం హన్మకొండ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొన్ని జెండా ఊపి ఈ కవాతు ప్రారంభించారు. హన్మకొండ బస్టాండ్, బ్రాహ్మణ వాడ, అలంకార్ జంక్షన్, హన్మకొండ చౌరస్తా మీదుగా అశోక జంక్షన్ వరకు ఈ కవాతు కొనసాగినది. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం వరంగల్ పోలీస్ కమిషనరరేట్ పరిధిలో ఏడు రోజుల పాటు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కవాతు నిర్వహించడం జరుగుతుందని. ఈ క వాతు ముఖ్య ఉద్దేశం ఎలాంటి అల్లర్లు, మత ఘర్షణ లు తలెత్తిన తక్షణమే స్పందించి స్థానిక పోలీసులకు సహకారం అందిస్తూ ప్రజలకు ప్రజలకు శాంతి భద్రతలపై భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ కవాతు నిర్వహిస్తున్నట్లుగా పోలీస్ కమిషనర్ తెలిపారు. సెంట్రల్‌జోన్ డిసిపి షేక్ సలీ మా,ఆర్ఎఎఫ్ డిప్యూటీ కామాండెంట్ సరస్వతి, హన్మకొండ ఎసిపి నర్సింరావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్స్ స్పెక్టర్లు సతీష్,రవికుమార్, సత్యనారాయణ రెడ్డి తో పాటు ట్రాఫిక్, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సఖి కేంద్రాలకు వచ్చే బాధితులకు మనోధైర్యం ఇవ్వాలి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** సఖి కేంద్రాలకు వచ్చే బాధితులకు మనోధైర్యం ఇవ్వాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ ములుగు జిల్లా కేంద్రంలోని సఖి వన్ స్టాఫ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మేకల మహేందర్ పాల్గొని మాట్లాడుతూ వేధింపులకు గురై వ్యక్తి గత సమస్యలతో సఖి కేంద్రానికి వచ్చే మహిళలను, బాలికలను న్యాయపరమైన సూచనలు ఇస్తూ బాధితులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని, న్యాయ, వైద్యపరమైన సహకారం అందించాలని అన్నారు. అలాగే డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్ మాట్లాడుతూ పోక్సో చట్టాల గురించి క్లుప్తంగా వివరించి ఉచిత న్యాయం ఎలా పొందాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏజిపి బాలుగు చంద్రయ్య, డిసిపిఓ ఓంకార్, సైకాలజిస్ట్ పి కిరణ్ కుమార్, డాక్టర్ డి నమ్రత, పి కృష్ణవేణి, టి సంధ్య, నరేష్, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంతోనే ప్రతి ఒక్కరికీ న్యాయం

మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగు తుందని, బడుగు బలహీన వర్గాల జీవితాలలో వెలుగు నింపడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శుక్రవారం ఆమె హనుమకొండ రాంనగర్ లోని తమ నివాసంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు హనుమకొండలోని తమ నివాసానికి చేరుకొని సమస్యలు మంత్రి సురేఖకి విన్నవించారు. ప్రతి సమస్య వింటూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతూ మంత్రి సురేఖ ముందుకు సాగారు. మంత్రి ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యా యం జరుగుతుందని అన్నారు. ఆర్థిక పరిస్థితిని బాగు చేసుకుంటూ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల సంక్షేమం అభివృద్ధిలకు తెలిపారు. ప్రాధాన్యత ఇస్తూ పాలన పాలన సాగిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల ముందుకు సాగుతున్నాయని తెలిపారు.



### రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి సహకారం

**ఆత్మకూరు:** గౌడ కులస్థుల ఆరాధ్య దైవం ఆదిపరాశక్తి అంశతో జన్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయం నిర్మాణానికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని గౌడ సంఘం కార్యాలయం ఆవరణలో నిర్మాణం చేస్తున్న రేణుక ఎల్లమ్మ దేవాలయానికి కావల్సిన నిధులు కేటాయించాలని గౌడ సంఘం కులస్థులు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. స్పందించిన మంత్రి కొండా సురేఖ రేణుక ఎల్లమ్మ దేవాలయం నిర్మాణానికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. అమ్మవారి అనుగ్రహం ఉంటేనే ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉంటారని మంత్రి కొండా సురేఖ అన్నారు. మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ దేవాలయం నిర్మాణం చేయడం అభినందనీయమని గౌడ సంఘం పెద్ద మనుషులను అభినందించారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత పర్వతగిరి రాజు, గౌడ సంఘం పెద్ద మనుషులు పొగాకుల కొమురయ్యగౌడ్, గుర్రం ప్రభాకర్‌గౌడ్, పొగాకుల రమేశ్‌గౌడ్, భయ్యగాని రమేశ్‌గౌడ్, ఆత్మకూరు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బయ్య కుమారస్వామి, పలువురు ఉన్నారు.

# సిఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరం

వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి నాగరాజు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సిఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు ఒక్క వరంగా మారిందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం హన్మకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నివాస క్యాంప్ కార్యాలయంలో వర్ధన్నపేట టౌన్ 2వ వార్డుకి చెందిన వడ్లకొండ సాయి చరణ్ లివర్ సమస్యతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి 45 లక్షల ఖర్చు చేసిన కూడ మరణించగా ఆ సమాచారం తెలియగానే ఎమ్మెల్యే నాగరాజు సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో మొదటి సారిగా గొప్ప ఆలోచనతో ఏకంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 6 లక్షల రూపాయల మంజూరు చేయగా శుక్రవారం ఆ చెక్కును లబ్ధిదారునికి కుటుంబానికి ఎమ్మెల్యే నాగరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, కాంగ్రెస్ నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, కిషోర్, టౌన్ మాజీ కౌన్సిలర్లు సమ్మెట్ట సుధీర్, మంచాల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు అండగా ఉంటాం

బిఆర్ఎస్,ఎఐటియుసి ఆధ్వర్యంలో చిరువ్యాపారులకు పరామర్శ



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ చౌరస్తాలో కూరగాయలు, పండ్లు అమ్ముకునే చిరు వ్యాపారులను అక్రమంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ, వారికి జోన్లు ఏర్పాటు చేసి షరతులు లేని బ్యాంకు రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి ఆధ్వర్యంలో బాధిత చిరు వ్యాపారులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, ఎఐటియుసి అధ్యక్షులు వే ల్పుల సారంగపాణి మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం చిరు వ్యాపారుల రక్షణ కోసం పార్లమెంటులో చట్టం చేసినప్పటికీ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చిరు వ్యాపారులపై దౌర్జన్యం చేస్తూ వారి వ్యాపార కేంద్రాలను అక్రమంగా తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, జోన్లు ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా నిబంధనలు లేని రుణ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ఉపాధి లేక, అప్పులు చేసుకొని చిరు వ్యాపారాలు నడుపుతున్న వ్యాపారులపై మున్సిపల్ కార్పొరేషన్ లేదా ట్రాఫిక్ పోలీసులు ఒత్తిడి చేయడం మాని, వారి హక్కులను కాపాడేలా సహకరించాలని హెచ్చరించారు. లేనియెడల, రాజకీయాలకు అతీతంగా హనుమకొండ జిల్లా వ్యాప్తంగా చిరు వ్యాపారులను ఐక్యం చేసి, భవిష్యత్తులో ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టడానికి వెనుకాడేది లేదని వారు స్పష్టం చేశారు.

## విద్య విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/ జనగామ ప్రతినిధి:** విద్య విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హెచ్చరించారు. జూన్ కళాశాలలో డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో కలిసి జూన్ కళాశాలలో మౌలిక వసతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ 2025–26వ విద్యాసంవత్సరం డిగ్రీలో కళాశాల తరగతుల నిర్వాహన ప్రారంభం అవుతుందన్నారు. శివునిపల్లి ప్రభు త్వ జూనియర్ కళాశాలలో తాత్కాలికంగా డిగ్రీ కళాశాల తరగతుల నిర్వాహణకు ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చే ఏడాది విద్యార్థులకు శాశ్వత డిగ్రీ కళాశాల భవనం అందుబాటులోకి వస్తుందని అప్పటి వరకు జూన్ కళాశాలలోనే తరగతులు బోధన జరుగుతుందన్నారు. కళాశాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మార్చి నెలలో రూ.8కోట్లతో నూతన డిగ్రీ కళాశాల మంజూరు కావడం జరిగిందన్నారు. డిగ్రీ కళాశాలకు అవసరమైన అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. బిఎ, బికాం, బికాం కంప్యూటర్, బిఎస్‌సి కంప్యూటర్, ఎంపిసి, బిజడ్‌సి లైఫ్ సైన్స్, కంప్యూటర్ కోర్సులకు అందుబాటులో ఉంటాయన్నారు. 240 సీట్లు అందుబాటులో ఉండనున్నాయని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడ్మిషన్లు పొందే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని, మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు. టాయిలెట్స్, ఎలక్ట్రిసిటి, ఫ్యాన్స్, ఫర్నీచర్, డిజిటల్ బోర్డు, తాగునీటి సౌకర్యాలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వచ్చే ఏడాది నాటికి నూతన భవవాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కమిట్మెంట్‌తో పనిచేసే వారిని ప్రోత్సహించడం జరుగుతుందని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలన్నారు. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో ప్రాథమిక పాఠశాల నుండి డిగ్రీ కళాశాలవరకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సోషల్ వెల్ఫేర్ డిఇ, ఆర్‌డిఓ వెం కన్న, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లుకు సంబంధించి శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాల్ లో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, సమాచార, డిఆర్డీఏ, సంక్షేమ, అటవీ, ఉద్యాన, వ్యవసాయ తదితర శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అమరవీరుల స్తూపం, డా॥ బిఆర్ అంబేద్కర్, ప్రొఫసర్ జయశంకర్ విగ్రహాలను పూలతో అందంగా ముస్తాబు చేయాలని సూచించారు. వేడుకలకు సంబంధించి ప్రోటోకాల్ పాటిస్తూ అతిధులు కూర్చోడానికి షామియానాలు, కుర్చీలు, సురక్షిత మంచినీరు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉద్యాన, ఆర్‌అండ్‌బి శాఖల అధికారులు స్టేజ్ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా ప్రగతి సందేశాన్ని తయారు చేయాలని డిపిఆర్వోను ఆదేశించారు. అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో పాటు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డిపిఆర్వోను, డీఈఓను కలెక్టర్ ఆదేశించారు. వేడుకల సందర్భంగా అంబులెన్సులు, అత్యవసర వైద్య కేంద్రం, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలని అన్నారు. మైదానంలో పారిశుధ్య, కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. వేడుకలకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్డీఓ కార్యక్రమాలు ఆసాంతం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని, మున్సిపల్ పట్టణాల్లో, నగర పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించి పేదలకు, వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న వేతనాలు విడుదల చేయాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు గట్టు శంకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెలిశెట్టి రాజయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వంగల విజయలక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు బందు సుజాత, నాయకులు మల్లయ్య, స్వాతి, కవిత, గోమతి, కవిత, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి కోసం హోర్డింగ్ ఎక్కిన యువకుడు

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఓ యువకుడు చేసిన నిరసన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. హన్మకొండ కు చెందిన పాషా అబ్దుల్ అనే యువకుడు తనకు ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంపై తీవ్ర నిరాశతో శుక్రవారం హనుమకొండలోని పోలీస్ హెడ్ క్వార్టర్ ఎదుట హోర్డింగ్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజా పాలన లోపాలను ఈ సంఘటన మరోసారి వెలుగులోకి తెచ్చింది. రాంనగర్ చెందిన పాషా అబ్దుల్ తండ్రి నాలుగేళ్ల క్రితం హోంగార్డుగా విధుల్లో ఉండగానే మృతిచెందారు. అప్పటి నుంచి కుటుంబం అంతా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటున్నామని, అయినా ప్రభుత్వం కనీస నివాసం కూడా కల్పించలేక పోతున్నదని ఆవేదనతో యువకుడు అధికారులను ప్రశ్నిస్తున్నాడు.శుక్రవారం ఉదయం హనుమకొండ పోలీస్ హెడ్ క్వార్టర్ ఎదురుగా ఉన్న హోర్డింగ్ పైకి ఎక్కిన పాషా అబ్దుల్ తన నిరసనను గట్టిగా వ్యక్తం చేశాడు. స్థానికులు, పోలీసులు అతన్ని నచ్చజెప్పి కిందికి దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం లో పలుమార్లు తాను ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నానని,అయినా తనకు కేటాయించలేదని వాపోయాడు. కాగా ఈ సంఘటనకు ప్రభుత్వ అధికారులు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉందని, ఇది కేవలం పాషా సమస్య కాదని, మరెన్నో కుటుంబాల కథ అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. పథకాలు ఉన్నా.. అమలు లేకపోతే సామాన్యుడికి ప్రయోజనం ఏమిటన్నదే ఈ సంఘటన ద్వారా స్పష్టమవుతోందన్నారు.



## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

స్టేషన్‌ఘనపూర్ ఎసిపి భీమ్ శర్మ



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ఎరువుల దుకాణాల యజమానులు ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని స్టేషన్‌ఘనపూర్ ఎసిపి భీమ్ శర్మ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ఎరువుల దుకాణాలను స్టేషన్‌ఘనపూర్ ఎసిపి భీమ్ శర్మ, రూరల్ సిఐ శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ నరేష్ యాదవ్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌లు కలిసి గ్రోమోర్ ఎరువుల దుకాణంతోపాటు, లక్ష్మి ఫర్టిలైజర్, వెంకటేశ్వర ఫర్టిలైజర్‌లను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. తనిఖీలలో భాగంగా అధికారులు స్టాక్ రిజిష్టర్‌ను, ఇన్ వాయిస్, బిల్ బుక్స్, ఫార్మర్ రిజిష్టర్, షాప్ లైసెన్స్‌ను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విధిగా దుకాణపు యజమానిని అడిగి రసీదు తీసుకోవాలని, విత్తన సంచిని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. బిజీ3 పత్తి విత్తనాలకు భారత ప్రభుత్వం నుండి అనుమతి లేదని గ్రామాలలో ఎవరైనా విక్రయిస్తే వెంటనే వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు రైతులకు అమ్మినట్లు తెలిస్తే అలాంటి వారిపై పిడి యాక్ట్ కేసు నమోదుచేసి, షాప్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ తనిఖీలలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్‌చంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లు పరిశీలన

భూపాలపల్లి ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని భూపాలపల్లి ఏరియా జిఎం ఎ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మే నేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ఏర్పాట్లు స్థానిక సుభాష్ కాలనీ, ఎండి క్వార్టర్స్ స్టేడియంలో జరగబోవు వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భం గా జిఎం మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులుతో ఆయన జూన్ 2న జరగబోయే తెలంగాణ ఆవిర్భావ దినోత్స వం వేడుకల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. స్టేడియం లోపారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, చెత్తాచెదారం లేకుండా పిచ్చి మొక్కలను తొలగించాలని, స్టేజిని సుందరంగా పూలమొక్కలతో అలంకరించాలని, ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, కళాకారులను ,ఉన్నతాధికారులను, ఉద్యోగుల కుటుంబాలకు, పరిసర ప్రాంతాల ప్రజలకు, సిట్టింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని ఆయన దిశానిర్దేశం చేసారు. విద్యుత్ సరఫరా కు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా జరిగే విధంగా ఏరియా ఇంజనీర్ డిపార్ట్మెంట్ వారిని ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి రావు, ఎస్ఓటుజిఎం ఎస్.కవీంద్ర, డీజీఎం సివిల్ రవికుమార్, ఎన్విరల్ న్మెంట్ అధికారి పోషమల్లు, ఎస్ ఈ లు బాలరాజు, అరుణ్ ప్రసాద్, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, పాల్గొన్నారు.

## వాసన పీలిస్తే మత్తులో గమ్మత్తు..

**ప్రజాపక్షం మణుగూరు :** చాపల మార్కెట్ కాళీమాత ఏరియా భగత్ సింగ్ నగర్ ప్రాంత యువత గంజాయికి బానిసలై మత్తులో తమ జీవితాలను సర్వనాశనం చేసుకుంటూ కుటుంబానికి సమాజానికి చీడ పురుగుల్లా మిగులుతున్నారు. గతంలో నిద్ర కోసం వాడే టాబ్లెట్లు రెండు రకాలు కలిపి మత్తు కోసం ఉపయోగించేవారు. అదే విధంగా కొంతమంది మత్తు ఇంజక్షన్ వేసుకొని మత్తులో తూలుతూ ఉండేవారు. కానీ నేడు అతి చౌకగా అందరికీ దొరికే విధంగా ఒక గమ్ము పేస్టు వాసన పిలిస్తే గమ్మత్తుగా మత్తులో తేలాడుతున్నారు. ఆ పేస్టును ఒక కవర్లో పెట్టుకొని సైకిల్ తొక్కుతూ బండ్లు నడుపుకుంటూ దాని వాసన పీలుస్తూ మత్తులో లీనమైపోతున్నారు. సైకిల్ ట్యూబ్లకు పంచర్ల వేసే పేస్టు ను మత్తు కోసం ఉపయోగిస్తూ మత్తును పొందుతున్నారు. ఈ పేస్టు వాసన చూడటం వలన శరీరంలో జీర్ణ ప్రక్రియ శ్వాసకోశ కణాలు సర్వనాశమై యువత అతి తక్కువ వయసులోనే ముసలితనం లక్షణాలు వస్తాయని నిపుణులు చెబుతున్నా యువత మాత్రం చౌకగా దొరికే ఈ మత్తుతో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు పిల్లల పై శ్రద్ధ ఉంచి పిల్లల అలవాట్లు తెలుసుకొని ఎవరైనా మత్తుకు బానిసలు అయితే వారిని భయానకాకుండా నయాన మార్చుకోవాలి.

## ఏసిబి అధికారికి క్యాష్ రివార్డు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నా అవినీతి నిరోధక శాఖ డిఎస్పి రమేష్‌కు క్యాష్ రివార్డు దక్కింది. గత కొంత కాలంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు అవినీతి నిరోధక శాఖ వ్యవహరిస్తున్న తీరుకు భయపడి పోతున్నారు. ఎక్కడ ఎవరు ఫిర్యాదు చేసినా తక్షణమే స్పందిస్తూ అవినీతి అధికారులను అదుపులోకి తీసుకుంటున్న రమేష్‌కు ఆ శాఖ డిజి విజయ్‌కుమార్ క్యాష్ రివార్డు అందించి అభినందించారు.



## అస్తవ్యస్థంగా ఇంటర్‌నెట్ కేబుల్ వైర్లు





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యుత్ స్తంభాలపై ఇంటర్‌నెట్, కేబుల్ టివి వైర్లు అస్తవ్యస్థంగా ఉంటున్నాయని ఖమ్మం సర్కిల్ విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. శుక్రవారం కేబుల్ టివి ఆపరేటర్లు, ఇంటర్‌నెట్ వ్యాపారస్తులతో ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచారి మాట్లాడుతూ కేబుల్ టివి వైర్లు, వివిధ కంపెనీల ఇంటర్‌నెట్ వైర్లు విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్థంగా తగిలిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ వైర్ల వల్ల విద్యుత్ రిపేర్ సిబ్బందికి ఇబ్బందులు కలుగుతున్నాయని, కొన్ని సందర్భాల్లో స్తంభాలు ఎక్కేందుకు కూడా వీలు పడడం లేదన్నారు. కొన్ని చోట్ల వైర్లు కిందకు వ్రేలాడుతుండడం వల్ల సాధారణ పౌరులు కూడా ప్రమాదానికి గురవుతున్నారన్నారు. ఒక్కోసారి కేబుల్ వైర్లు కరెంటు వైర్లకు తగిలి విద్యుత్ ప్రసరించి ఇండ్లలోని వినియోగదారులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన తెలిపారు. విద్యుత్ స్తంభాలు కేవలం విద్యుత్ సరఫరాకు మాత్రమే నిర్దేశించినవని కేబుల్ టివి లేదా ఇంటర్ నెట్ ఆపరేటర్లు కొత్తగా ప్రత్యేకించి స్తంభాలు ఏర్పాటు చేసుకుని వైర్లు లాగించుకోవాలని తెలిపారు. రిలయన్స్ సంస్థ ఈవిధానాన్ని పాటిస్తుందన్నారు. వివిధ కారణాలతో అనేక కేబుల్ టివి, ఇంటర్‌నెట్ వ్యాపారులు విద్యుత్ స్తంభాలను ఎంచుకుని వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయని ఆయన తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యుత్ శాఖకు సంబంధించి ఆపరేటర్లకు నెలకు పోల్‌కు రూ. 20ల చొప్పున పెనాల్టీ విధిస్తుందన్నారు. ఆపరేటర్లు వైర్లను ఒక క్రమ పద్ధతిలో కట్టాలని, విద్యుత్ వైర్లకు దూరం పాటించి ప్రమాదరహితంగా ఉంచుకోవాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో కరెంటు లైన్‌మెన్, సంబంధిత కేబుల్ ఆపరేటర్లు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలని నిర్ణయించడం జరిగింది. విద్యుత్ శాఖతో కేబుల్, ఇంటర్‌నెట్ వ్యాపారులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఈ నంబూరి రామారావు, ఏడిఈలు సిహెచ్ నాగార్జున, యాదగిరి, ఏఈలు, కేబుల్ ఆపరేటర్స్ జిల్లా అధ్యక్షులు కె. సంజీవరావు, వివిధ సర్వీస్ ప్రోవైడర్లు వెంకన్న, సందీప్ రెడ్డి, వీరస్వామి, రామకృష్ణారెడ్డి, శ్రీధర్, శ్రీనాథ్, రాఘవ పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలి



ఎండ తీవ్రతను తట్టుకునేలా కూలర్లు ఏర్పాటు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జూన్ రెండున జరగనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేలా ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పోలీస్ పరేడ్ మైదానంలో జూన్ రెండున నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. వాతావరణ పరిస్థితిని బట్టి తగిన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు వేదికను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, ఆకర్షణీయంగా ఉండాలని తెలిపారు. వేడుకలకు సౌండ్ సిస్టం ఏర్పాటు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని, విఐపి, ప్రజలకు, విద్యార్థులకు గ్యాలరీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఆహ్వానం అందాలన్నారు. వేడుకలకు సంబంధించి మినిట్ టూ మినిట్ ప్రోగ్రాం షెడ్యూల్ తయారు చేసుకోవాలన్నారు. ముఖ్య అతిథి గౌరవ వందన స్వీకరణ, జాతీయ పతాకావిష్కరణ, తెలంగాణ గీతం ఆలాపన, ముఖ్య అతిథి సందేశం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలపై శకటాల ప్రదర్శన, పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, స్టాల్స్ సందర్శన పక్కగా ప్లాన్ చేసుకోవాలన్నారు. ఎండ తగలకుండా వేడుకలకు వచ్చే వారి కోసం పూర్తి స్థాయిలో టెంట్లు వేయాలని, ఉష్ణోగ్రతలను దృష్టిలోఉంచుకుని అన్ని గ్యాలరీలలో వేడిని తట్టుకునేలా కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితి ఉంటే అందుకు తగినట్లు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విఐపిలకు ప్రత్యేకంగా రీఫ్రెష్‌మెంట్, స్నాక్స్ ఏర్పాటు చేయాలని వేడుకలకు వచ్చే ప్రజలకు కూడా రీఫ్రెష్‌మెంట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం సిటింగ్ ఏర్పాటు, ప్రెస్ గ్యాలరీ, త్రాగునీరు, పండ్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ శాఖల ద్వారా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను వివరిస్తూ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతి శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌వో పద్మశ్రీ, పోలీస్ అడ్మిన్ ఆర్ఐ కామరాజు, అర్బన్ తహసీల్దార్ సైదులు, ఆర్ఐ వహీద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** విత్తన వ్యాపారులు నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలని అనుమతి లేని విత్తనాలను విక్రయించినచో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మంచుకొండ, రఘునాథపాలెం గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ బృందం విత్తన షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, రఘునాథపాలెం ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. వివిధ కంపెనీల విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ద్వారా లైసెన్స్ కలిగిన విత్తన షాపుల నందు మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రశీదు తప్పని సరిగా తీసుకుని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని వారు సూచించారు. రైతులు స్థానిక పరిస్థితులకు అనుకూలమైనటువంటి మంచి దిగుబడిని ఇచ్చే కంపెనీల విత్తనాలను ఎంచుకోవాలని వారు తెలిపారు. గ్రామాల్లో తిరుగుతూ అధిక దిగుబడి ఆశ చూపిస్తూ తక్కువ ధరకు బిల్లులు లేకుండా విత్తనాలు విక్రయించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. వారి వద్ద నుంచి విత్తనాలు కొనుగోలు చేయకూడదని అటువంటి వారు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. నిషేధిత గడ్డి మందు తట్టుకుని పెరిగేటటువంటి పత్తి వంగడాలకు ప్రభుత్వ అనుమతి లేదని అటువంటి విత్తనాలు అమ్మినా, కొనడం జరిగినా నేరమని తెలిపారు. విత్తన వ్యాపారులు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేయాలని, అనుమతి లేని విత్తనాలను విక్రయించినచో చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## జోరుగా నకిలీ పత్తివిత్తనాలు ... !

# ఆంధ్రాలో తయారీ..తెలంగాణలో అమ్మకాలు

తొమ్మిది మంది అరెస్ట్

రూ.14 లక్షల విలువ చేసే 560 కేజీల విత్తనాలు సీజ్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు జిల్లాల్లో నకిలీ పత్తివిత్తనాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రుగూడెం గ్రామం క్రేందంగా తయారవుతున్న ఈ నకిలీ పత్తి విత్తనాలను సరిహద్దు ప్రాంతమైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏజెంట్లను నియమించి విక్రయాలు సాగిస్తున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం సంయుక్తంగా తయారీ కేంద్రంతో పాటు ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలంలోని పలు దుకాణాలపై దాడులు చేసి 14 లక్షల విలువ చేసే 560 కేజీల విత్తనాలు సీజ్ చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి పోలీసు కమిషనర్ సునిల్‌దత్ విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంత మంది దళారులు ముఠాగా ఏర్పాడి తక్కువ ధరకు అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలు ఇస్తామని మోసపూరిత మాటలతో రైతులను నమ్మించి నకిలీ విత్తనాలను అంటగట్టి వారిని దోచుకుంటున్నారన్నారు. అటువంటి వారిని నమ్మవద్దని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో నికిలీ విత్తనాలను కట్టడి చేసేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచామన్నారు. ఈక్రమంలో నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టైందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రుగూడెంతో పాటు గుంటూరు జిల్లా తెనాలి, బపాట్ల నుంచి స్థానిక వ్యాపారులు కొందరు నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసి ఏన్కూరుతో పాటు పరిసర గ్రామాల్లో అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. ఏన్కూరు గ్రామానికి చెందిన గాజుల నరసింహారావు వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా రైతులకు పత్తివిత్తనాలు అమ్ముతున్నాడని తమకు సమాచారం రావడంలో దాడులు చేసి పట్టుకున్నామన్నారు. అతని నుంచి 450 గ్రాముల అడ్వాన్స్ 555 పేరుతో ఉన్న నకిలీ పత్తి విత్తనాలు పట్టుకుని సిజ్ చేశామన్నారు. ఆంధ్రా నుంచి 400 రూపాయలకు విత్తనాలను కొనుగోలు చేసి ఇక్కడి రైతులకు 1200 రూపాయలకు విక్రయిస్తున్నాడని తమ విచారణలో తెలిందన్నారు. కల్లూరు ఎస్సై హరిత నేతృత్వంలో కొందరు సిబ్బందిని బృందంగా ఏర్పాటు చేసి విచారించగా ఎన్‌టీఆర్ జిల్లా మైలవరం సమీపంలోని చంద్రుగూడెం గ్రామంలో శాలివాహనా అనే వ్యక్తి తన ఇంటి వద్ద నకిలీ పత్తి విత్తనాలు తయారుచేస్తున్నట్లు గుర్తించామన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అడ్వాన్స్ 555 పేరుతో ఉన్న పత్తి విత్తనాలను తీసుకువచ్చి వీటిని రైజోబెల్ మిశ్రమాన్ని కలిపి ఆరబెట్టి అనంతరం వాటిని ప్రత్యేక కవర్లలో సిల్ చేసి గాజుల నరసింహారావుతో పాటు మరికొందరు ఏజెంట్లతో రైతులకు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తెలిందన్నారు. అతని ఇంటి వద్ద నిల్వ ఉంచిన ఒక క్వింటా రైజోబెల్ మిశ్రమం కలిపిన పత్తి విత్తనాలతో పాటు అరుణోదయ లేబుల్‌తో ఉన్న 450 గ్రాముల బరువు ఉన్న 272 ప్యాకెట్లు, సిల్ చేసేందుకు వినియోగించే రెండు మిషన్లు, వెయింగ్ మిషన్, అరుణోదయ పేరుతో ఉన్న కవర్లు, రెండు లీటర్ల రైజోబెల్ మిశ్రమం స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

### రేపల్లె వాడలో ..

అదేవిధంగా రెపల్లె వాడ గ్రామ శివారులోని వెనిగండ్ల శ్రీహరిరావు అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో తనిఖీలు నిర్వహించగా కేజి బరువు వున్న 210 ప్యాకట్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రీధర్‌రావు అనే వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు అతని అనుచరుదు, ఏన్కూర్‌కు చెందిన ఇమ్మినేని కిషోర్ అనే వ్యక్తి ఇంటి వద్ద నిల్వ ఉంచిన సుమారు



120 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, తయారీకి ఉపమోగించే రైజోబెల్ కెమికల్, వెయింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నట్లు సిపి వివరించారు. గత కొంత కాలంగా వెనిగండ్ల శ్రీహరిరావు బాపట్ల జిల్లాలో ఉన్న తన బంధువు లక్ష్మి నారాయణ నుంచి 800 రూపాయలకు నకిలీ విత్తనాలు తెచ్చి ఏన్కూర్‌లో రైతులకు 2600 విక్రయిస్తూ లాభ్ధి పొదుతున్నట్లు తమ విచారణలో తెలిందన్నారు. అదేవిధంగా ఏన్కూరులో స్థానిక ఎస్సై నేతృత్వంలో జరిగిన సోదాలలో పోలేటి కోటేశ్వరరావు అనే వ్యక్తి ఇంటి వద్ద నిల్వ ఉంచిన 20 ప్యాకెట్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి గురించి ఆరా తీయగా ఆధ్రప్రదేశ్ రాష్ట్రం తెనాలి నుంచి తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్లు అంగీకరించాడని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో ఏన్కూర్, హిమాంనగర్లకు చెందిన వెనిగండ్ల శ్రీహరిరావు, ఉమ్మినేని నరేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా ఇంకోల్లూ మండలం భీమవరం గ్రామానికి చెందిన అన్నెం లక్ష్మి నారాయణ, హిమాంనగర్, రేపల్లెవాడలకు చెందిన గుగులోతు గోపి, వరద బోయిన రమేష్, తాంబళ్ల నవీన్‌లు ఉన్నారు. ఈ సమావేశంలో సిపి వెంట కల్లూరు ఏసిపి రఘు, సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం, ఎస్సైలు రఫీ, హరిత ఉన్నారు.

# నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఎమ్మెల్యే జారే

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** త్వరలో వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ సూచించారు. శుక్రవారం అశ్వారావుపేట ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మండల రైతులకు 50శాతం సబ్సిడీతో జనుము, జీలుగు విత్తనాలు పంపిణీని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు భూసారం పెంచి వారి పెట్టుబడి ఖర్చులు తగ్గి లాభదాయకమైన వ్యవసాయానికి చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం 50 సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని రంగాల్లో తోడ్పాటు అందిస్తోందని, నాయకులు, అధికారులు కూడా రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. త్వరలోనే విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నాణ్యామైన వరి విత్తనాలు పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. అవసరమున్న అర్హులైన రైతులు సమీప సహకార సంఘాన్ని సంప్రదించాలని కోరారు. నకిలీ విత్తనాలతో మోసపోకుండా జాగ్రత్త వహించాలన్నారు. అధికారులు కూడా నకిలీ విత్తనాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అశ్వారావుపేట మున్సిపాల్టీ పరిధిలోని పేరాయిగూడెం గ్రామాన్ని సందర్శించి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనాల పనులను పరిశీలించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీచేశారు. అదే గ్రామంలో ఇటీవల వివాహం జరిగిన నార్లపాటి బాబు కుమారుడు నవీన్, సౌజన్య నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం నార్లపాటి రాంబాబు కుమార్తెల ఓణీల అలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విపత్తు సమయంలో ప్రణాళిక ప్రకారం పని చేయాలి

300 మంది వాలంటీర్లకు ఆపదమిత్ర శిక్షణ

కలెక్టరేట్‌లో 1077 నెంబర్‌తో కంట్రోల్ రూము

విపత్తు నిర్వహణపై కలెక్టర్ సమావేశం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విపత్తు సమయంలో ప్రణాళిక ప్రకారం పనిచేస్తే ప్రజల ప్రాణ, విలువైన, ముఖ్యమైన పత్రాలు నష్టపోకుండా నివారించవచ్చునని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఆపదమిత్రలకు విపత్తు నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ మొదటి తారీఖు వరకు వచ్చిన వరదల కారణంగా ఖమ్మం నగరం ఆపదలో చిక్కుకుందని జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు అద్భుతంగా పనిచేయదంతో అతితక్కువ ప్రాణ నష్టంతో బయటపడి, 15 రోజుల వ్యవధిలోనే సాధారణ పరిస్థితులను పునరుద్ధరించగలిగామని తెలిపారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో కురిసే వర్షం వివరాలను కూడా ప్రస్తుతం ట్రాక్ చేస్తున్నామని వరదల సమయంలో గ్రామం నుంచి జిల్లా వరకు వివిధ స్థాయిల్లో వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం అందిస్తామన్నారు. రాబోయే బుధవారం మండల స్థాయిలో ఆపదమిత్రల పరిచయ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రమాదాల సమాచారం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూము నెం. 1077కు అందిన వెంటనే కంట్రోల్ రూము నుంచి విపత్కర పరిస్థితులపై సంబంధిత ప్రాంతాలకు సమాచారం అందుతుందని, అక్కడ రెస్క్యూ బృందాలతో పాటు ఆపదమిత్ర శిక్షణ పొందిన వాలంటీర్లు వెళ్లి విపత్తు నిర్వహణలో విధులు నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆపదమిత్ర శిక్షణ పొందిన వాలంటీర్లు ముందుగా వారి పరిధిలోని వల్నరబుల్ ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వివిధ బలహీన వర్గాలు ఉన్న లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. ప్రమాదాల పట్ల ప్రజల్లో ఉన్న నిర్లక్ష్య వైఖరిని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. గతంలో అధికారులు హెచ్చరించినప్పటికీ ఇండ్లు ఖాళీ చేయకుండా ఉండడం వల్ల కొంత మేర ఇబ్బందులు ఏర్పడ్డాయని రాబోయే రోజుల్లో ఇటువంటివి జరగకుండా చూడాలన్నారు. ఆపదమిత్రలు ప్రజలతో భాగస్వామ్యం కావాలన్నారు. విపత్తు వచ్చే ప్రాంతాల్లోని ఇండ్లకు జిప్‌లాక్ బ్యాగులు ముందస్తుగానే పంపిణీ చేయాలని ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు వాటిలో పెట్టి ప్రజలు రెడీగా ఉండాలని ప్రభుత్వం నుంచి అలర్ట్ రాగానే ఖాళీ చేసేలా సిద్ధం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఆపద సమయంలో ఏర్పాటు చేయాల్సిన రిలీఫ్ సెంటర్‌ను ముందస్తుగానే గుర్తిస్తున్నామని వాటిలో అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదం వచ్చినప్పుడు సైనికులు ధైర్యంగా ముందుకు వచ్చి ప్రజలను కాపాడతారని అదే విధంగా ధైర్యంగా ప్రజలను రక్షించేందుకు ముందుకు వచ్చిన ఆపద మిత్రలను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆపదమిత్రలకు అవసరమైన సేఫ్టీ జాకెట్, ఇతర సామాగ్రి అందుబాటులో పెడతామని తెలిపారు. విపత్తు సమయంలో ఇతరులను కాపాడే ప్రయత్నం ప్రణాళికాబద్ధంగా చేయాలని విపత్తు సమయంలో ప్రజల్లో గాబరా తగ్గించాలన్నారు. ఆపద మిత్రలు వారి మండల పరిధిలోని తహసీల్దార్, ఎంపిడివో, పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్, ఇతర మండల అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో పెట్టుకోవాలని తెలిపారు. మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హెడ్ క్వార్టర్స్‌లో ఉండేలా ఆదేశాలు జారీ చేశామని, నీటి వనరులు పెద్ద చెరువుల సమీపంలో ఉన్న గ్రామాల్లో ముందుగా బోట్‌లు, తెప్పలు అందుబాటులో పెట్టాలన్నారు. ట్రైనర్స్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో మూడు బ్యాచ్‌లలో 12 రోజుల పాటు 300 మంది వాలంటీర్లకు ఆపదమిత్ర శిక్షణ అందించామని, వీరికి ఇన్సూరెన్స్ కూడా ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. వాలంటీర్లకు అగ్నిమాపక శాఖ, సింగరేణి, నీటిపారుదల, వివిధ శాఖల క్రింద రిసోర్స్ పర్సన్స్‌తో శిక్షణ అందించామని తెలిపారు. వాలంటీర్లకు 10 రోజులు తరగతి గదుల్లో, రెండు రోజులు గ్రామాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి ఎక్కడి నుంచి వరద వస్తుంది, ఏ ప్రాంతాలు ఎక్కువగా ప్రభావం చెందుతాయి. వృద్ధులు, పిల్లలు ఎక్కడ ఉన్నారు వంటి పలు అంశాలతో శిక్షణ అందించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆపదమిత్రలకు కలెక్టర్ మెటీరియల్ పంపిణీ చేశారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, సిపివో ఎ. శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీనివాసాచారి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సభను జయప్రదం చేయాలని టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి జర్నలిస్టులకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాధించుకున్న జర్నలిస్టు సంఘంగా టిజెఎఫ్ ఈనెల 31న శనివారం రజతోత్సవం జరుపుకుంటుందని హైదరాబాద్‌లో శనివారం జరిగే టిజెఎఫ్ రజతోత్సవ వేడుకలకు ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఆదినారాయణ, చిర్రా రవి లు మాట్లాడుతూ మరణించిన ప్రతి జర్నలిస్టు కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం, పింఛన్, పిల్లల చదువులకు ఆర్థిక సాయం తదితర విషయాల కోసం టిజెఎఫ్ కృషి చేసి సఫలీకృతమైందన్నారు. శనివారం ఉదయం ఆరు గంటలకు ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌజ్ నుండి బస్సులు బయలుదేరుతాయని సకాలంలో హాజరు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిజెఎఫ్ నాయకులు వెన్నబోయిన సాంబశివరావు, ప్రశాంత రెడ్డి, విజేత, ఎం. వెంకటరమణ, ఉపేందర్, కోటేశ్వరరావు, నరేందర్, చక్రవర్తి, శ్రీధర్, శర్మ, తిరుపతిరావు, జగదీష్, రాంబాబు, గోపి, జీవన్‌రెడ్డి, పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టం పరిరక్షణకై ఉద్యమం



**ప్రజాపక్షం/ఖమ్మం :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించడానికి ఉద్యమం చేపట్టక తప్పదని సిపిఎం నాయకులు నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు లు తెలిపారు. రైతు కూలీలకు రూ. 12వేలు తక్షణం ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆందోళనకారులను ఉద్దేశించి పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేటాయింపులను క్రమేపి తగ్గిస్తుందని ఈ ఏడాది కేవలం రూ. 69వేల కోట్లు కేటాయించడం వల్ల పని దినాలు తగ్గిపోయి వ్యవసాయ కూలీలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూలీలకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించడంతో పాటు వ్యవసాయ కూలీలకు సమగ్రంగా గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి యేటా 200 పని దినాలను కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్పోరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలను మాఫీ చేస్తున్న ప్రభుత్వం వ్యవసాయ, గ్రామీణ కూలీల పట్ల మాత్రం వివక్ష ప్రదర్శిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏడాదికి రూ. 12వేలు పేదల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, నాయకులు యర్రా శ్రీనివాసరావు, కృష్ణ, వత్సవాయి జానకిరాములు, నాగేశ్వరరావు, సంగయ్య, నంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కర్రెగుట్టలపై మోహరించిన పోలీస్ బలగాలను వెనక్కు రప్పించాలి



అరుణోదయ చైర్మన్ విమలక్క


**ప్రజాపక్షం/గుండాల :** మావోయిస్టులు అడవుల్లో లేకుండా చేసేందుకు కేంద్రప్రభుత్వం కర్రెగుట్టలపై మోహరించిన బలగాలను వెనక్కు రప్పించాలని ఆరుణోదయ చైర్మన్ విమలక్క అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏఐకేఎంఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు.ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్రప్రభుత్వం సీజ్‌ఫైర్ ప్రకటించి మావోయిస్టులతో శాంతిచర్చల జరపాలని కోరారు. సిపిఐ మావోయిస్టు పార్టీ కేంద్రప్రధాన కార్యదర్శి నంబాళ్ల కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌ను ఆమె ఖండిచారు. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను తుదముట్టిస్తామని కేంద్రహోం మంత్రి అమీత్‌షా రాజ్యాంగ విరుద్ధమైన వ్యాఖ్యలు చేశారని, మావోయిస్టులు స్వచ్ఛందంగా కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ స్వాగతించకుండా వేలాది సైనిక బలగాలను అడవుల్లో మోహరించి మావోయిస్టులతో పాటు ఆదివాసీ అమాయకులను డజన్ల సంఖ్యలో కాల్చి చంపుతూ ఎన్‌కౌంటర్ కట్టుకధలు అల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ప్రసాద్, ఉక్లా నాయక్, పటోళ్ల నాగిరెడ్డి, వెలుతురు సదానందం, పొడెం వెంకటేశ్వర్లు, ఎట్టి ప్రశాంత్, కందగట్ల సురేందర్, సోమన్న, కృష్ణ, వాగబోయిన చంద్రయ్య, రాంబాబు, మోకాళ్ల సమ్మయ్య, యుగేందర్, యాదగిరి, ముక్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# సైన్స్

## అంతరిక్షంలో కొత్త సూక్ష్మ జీవి...

### జీవం విశ్వవ్యాప్తమా?





భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సహకారంతో, 'నాసా' నిర్వహిస్తున్న అంతరిక్ష పరిశోధనల్లో ఎన్నో కొత్త విషయాలు బయటపడుతున్నాయి. శాస్త్రవేత్తలు ఒక కొత్త సూక్ష్మ జీవిని అంతరిక్షంలో గుర్తించారు. నివేదికలను అనుసరించి, ఈ జీవి అంతరిక్షంలో తక్కువ గురుత్వాకర్షణ, ఎక్కువ రేడియేషన్ వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ జీవించగలగడం శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరచింది. అంతరిక్ష నౌక అంతార్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) సేకరించిన నమూనాల్లో ఈ సూక్ష్మ జీవి కనిపించింది. ఇది గాలి ఫిల్టర్లు, సర్క్యూట్ ప్యానెల్స్, అంతరిక్ష నౌక గోడల ఉన్న ఈ జీవికి శాస్త్రీయంగా 'బాసిలస్ ఒడెస్సెయి' అని పేరు ఖరారు చేశారు. ఇటీవల కనుగొన్న వేరియంట్‌కు 'బాసిల్లస్ సఫెన్సిస్ ఐఎస్ఎంఎఆర్ఎస్ 24' అనే పేరును ఖరారు చేసే అవకాశాలు ఉనాయి. ఈ సూక్ష్మ జీవికి ఉన్న ప్రత్యేక లక్షణాల్లో అత్యధిక రేడియేషన్ తట్టుకునే శక్తి ఒకటి. ఇది సూర్య కిరణాలు, గ్యామా రేడియేషన్‌లను తట్టుకోగలుగుతుంది. అంతరిక్ష శూన్యతలో జీవిస్తుంది. స్పేస్ వాక్యూమ్‌లో కూడా డిఎన్ఎ నాశనం కాకుండా జీవించగలదు. దృఢమైన జీవ సంబంధిత నిర్మాణం దీనికి ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి పక్కనపక్కన ఉండి రక్షణ పొరగా మారతాయి. ఈ జీవి భూమి నుండి వచ్చిందా? లేక అంతరిక్ష జీవమా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇది భూమి నుంచే అంతరిక్ష నౌక ద్వారా వెళ్లి, అక్కడ అభివృద్ధి చెందిందని కొందరు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మరికొందరు శాస్త్రవేత్తలు 'పాన్‌స్పర్మియా' సిద్ధాంతాన్ని సూచిస్తున్నారు. జీవం అంతరిక్షంలో సహజంగా ప్రయాణించి గ్రహాలపై పడగలదని, అంటే ఇది భూమికి బయట నుంచి చేరే అవకాశం ఉందని అనుకోవచ్చు. అంతరిక్షంలో సూక్ష్మ జీవిని గుర్తించడానికి శాస్త్రీయ ప్రాముఖ్యత ఏర్పడింది. ఇలాంటి సూక్ష్మ జీవులు అంతరిక్ష ప్రయాణాల్లో మానవుల ఆరోగ్యంపై ప్రభావం చూసే అవకాశం లేకపోలేదు. ఈ పరిస్థితి, వాతావరణ నియంత్రణ వ్యవస్థల్లో వ్యాధులు ప్రబలడానికి కారణమవుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాగా, జీవం అంతరిక్షంలో పుట్టే అవకాశంపై కొత్త పరిశోధనలు మరింత పెరగడం ఖాయం. భూమికి వెలుపల జీవం ఉన్నదీ అని పరిశోధించేందుకు ఇది కీలక ఆధారంగా మారుతుంది. ఈ జీవుల లక్షణాలను ఆధారంగా తీసుకుని ఇతర గ్రహాలపై కూడా జీవ లక్షణాలను పరిశీలించవచ్చు. కాగా, ఇస్రో తన బయోబర్డెన్ (bioburden) నియంత్రణలో కొత్త మార్గాలు అన్వేషిస్తోంది. ఈ సూక్ష్మ జీవుల ప్రవర్తన ఆధారంగా రాకెట్, ఉపగ్రహాల శుద్ధి విధానాలను పునర్నిర్మిస్తోంది.

## రోబోకు మనిషి చర్మం!





వినడానికి ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ, మర మనుషులను అసలుసిసలైన మనుషులుగా తయారు చేసే ప్రయత్నాలు చాలాకాలంగా జరుగుతునే ఉన్నాయి. రోబోలకు కూడా మనిషి చర్మాన్ని అతికించడం కష్టసాధ్యమైన ప్రక్రియ. టోక్యో విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ ప్రయోగాల్లో ముందంజ వేశారు. సజీవ మానవ కణాల నుండి వేరుచేసిన తర్వాత, ప్రయోగశాలపెరిగిన చర్మాన్ని అభివృద్ధి చేసి, దానిని రోబోటిక్ ముఖాలకు పెడుతున్నారు. ఈ సింథటిక్ చర్మం కల్చర్డ్ హ్యూమన్ ఫైబ్రోబ్లాస్ట్‌లు, కొల్లాజెన్‌తో కూడి ఉంటుంది, ఇది నిజమైన మానవ చర్మ యాంత్రిక మరియు జీవ లక్షణాలను అనుకరిస్తుంది. చర్మం ఏదైనా కారణం చేత దెబ్బ తింటే, దానంతట అదే పెరుగుతుంది. రోబోలకు అమర్చే చర్మానికి కూడా ఇదే గుణం ఉండడం విశేషం. ఇది రోబోటిక్ ఉపరితలాలతో బాగా కలిసిపోతుంది. కొల్లాజెన్ జెల్‌తో చిన్న కోతలను నయం చేయగలుగుతుంది. ప్రపంచంలో మరే జంతువుకు లేని ప్రత్యేకత లక్షణమైన 'నవ్వు' కేవలం మనుషులకు మాత్రమే ఉంది. రోబోలకు కూడా ఈ లక్షణాన్ని కల్పించేందుకు జరుపుతున్న ప్రయత్నాల్లో భాగంగానే చర్మాన్ని అమర్చే ప్రక్రియ. సాధారణం చర్మం మాదిరి సాగే లక్షణం ఉంటుంది కాబట్టి, రోబోలు కూడా నవ్వగలుతాయన్నది రోబోటిక్ శాస్త్రవేత్తల అభిప్రాయం. భావోద్వేగపరంగా ప్రతిస్పందించే రీతిలో, జీవశాస్త్రపరంగా ఇంటిగ్రేటెడ్ రోబోట్‌లను నిర్మించడంలో ఈ పురోగతి ఒక ప్రధాన దశను సూచిస్తుంది.

## టైమ్ ట్రావెల్‌పై చర్చ?

'టైమ్ ట్రావెల్' సాధ్యాసాధ్యాలపైన విపరీతమైన చర్చ కొనసాగుతున్నది. భవిష్యత్తు కాలపు తలుపు తెరవగలుగుతామా? అనేది ప్రశ్న. కాల ప్రయాణం అనేది శాస్త్రవేత్తలకూ, రచయితలకూ, ప్రేక్షకులకూ ఒక కల. సాపేక్ష సిద్ధాంతం ప్రకారం, వేగంగా ప్రయాణిస్తే మనం భవిష్యత్తులోకి వెళ్లొచ్చు. కానీ గతంలోకి తిరిగివెళ్ళగలమా? దీనికి వర్మ్ హోల్స్, బ్లాక్ హోల్స్ వంటి సిద్ధాంతాలు ఆధారమవుతున్నాయి. ఒకప్పుడు "వార్ప్ డ్రైవ్" వంటి కాన్సెప్ట్‌లు కల్పితంగా ఉన్నా, ఇవి ఇప్పుడు సాంకేతికంగా పరిశీలనకు వస్తున్నాయి. ఇది కల లేనా? లేక రేపటి విజ్ఞాన పంథానా? కాలమే సమాధానం. ఇలావుంటే, మల్టీవర్స్ సిద్ధాంతం అనేక విశ్వాల ఉనికిమనం నివసిస్తున్న విశ్వం ఒక్కటే కాకుండా, ఇంకా ఎన్నో విశ్వాలు ఉండవచ్చని భావన మల్టీవర్స్ సిద్ధాంతంగా అభివృద్ధి చెందింది. ప్రతి విశ్వంలో భిన్నమైన శక్తులు, భౌతిక నియమాలు ఉండవచ్చు. మన విశ్వంలో గ్రావిటీ ఎలా పనిచేస్తుందో, మరొక విశ్వంలో అది అర్థంగాకుండా ఉండవచ్చు. ఈ సిద్ధాంతం ప్రకారం, మనం తీసుకున్న ప్రతి నిర్ణయం ఆధారంగా ఒక కొత్త విశ్వం ఆవిర్భవించి ఉండవచ్చు. ఇది సైన్స్‌తో పాటు తాత్విక కతకూ మార్గం చూపుతుంది.







బాక్టీరియాలు ఎక్కువగా మన ఆంత్రవ్యవస్థ (gut), అంటే పొట్టలో ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. వాటిని ఏకమొత్తంగా 'గట్ మైక్రోబయోమ్' అంటారు. బాక్టీరియా అనగానే, చాలా హానికరం అనే అపోహ చాలా మందిలో ఉంటుంది. కానీ, అది నిజం కాదు. కొన్ని రకాల బాక్టీరియా శరీరానికి ఎంతో ఉపయోగపడతాయి. ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయ పడతాయి

## బాక్టీరియా మయం!

మన శరీరంలో ఉన్న కణాల కన్నా ఎక్కువ బాక్టీరియా ఉంటాయి. ఇది నిజం. ఒక సగటు మనిషిలో సుమారు 30 ట్రిలియన్ మానవ కణాలు ఉంటాయని అంచనా. తాజా అధ్యయనాల ప్రకారం, మన శరీరంలో సుమారు 39 ట్రిలియన్ మైక్రోబియల్ కణాలు (బాక్టీరియా, ఆర్చియా, మొదలైనవి) ఉండవచ్చని శాస్త్రవేత్తలు అంచనా. బాక్టీరియాలు ఎక్కువగా మన ఆంత్రవ్యవస్థ (gut), అంటే పొట్టలో ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. వాటిని ఏకమొత్తంగా 'గట్ మైక్రోబయోమ్' అంటారు. కాగా, బాక్టీరియా అనగానే, చాలా హానికరం అనే అపోహ చాలా మందిలో ఉంటుంది. కానీ, అది నిజం కాదు. కొన్ని రకాల బాక్టీరియా శరీరానికి ఎంతో ఉపయోగపడతాయి. ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడతాయి. విటమిన్లు (ఉదా: విటమిన్ 'కె') ఉత్పత్తి చేస్తాయి. హానికరమైన సూక్ష్మ జీవులను ఎదుర్కొనడంలో సహకరిస్తాయి. మన ఇమ్యూన్ సిస్టమ్‌ను బలోపేతం చేస్తాయి. 'గట్ మైక్రోబయోమ్' విషయానికి వస్తే, ఇది మన ఆహార నాళంలో (గట్‌లో), ముఖ్యంగా చిన్నపేగు, పెద్దపేగుల భాగంలో నివసించే సూక్ష్మ జీవుల సముదాయం. వీటిలో బాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్‌లు, ఆర్చియా వంటి జీవులున్నాయి. ఈ మైక్రోబయోమ్ ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ఉంటుంది. ఇది ప్రతి మనిషికి ప్రత్యేకమైనది, గమనించదగ్గది. మన శరీరం పూర్తిగా జీర్ణించలేని కొంత ఆహారాన్ని గట్‌లోని బాక్టీరియా జీర్ణించి, శరీరానికి అవసరమైన పోషకాలు తయారు చేస్తాయి. ఉదాహరణకు ఫైబర్‌ను జీర్ణింపచేసి, 'షార్ట్ చైన్ ఫ్యాటి యాసిడ్స్' తయారు చేస్తాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. గట్ మైక్రోబయోమ్ నుంచి విడుదలయ్యే రసాయనాలు మెదడుతో కమ్యూనికేట్ చేస్తాయి. దీన్ని గట్‌బ్రెయిన్ యాక్సిస్ (Gut Brain Axis) అంటారు. అంటే మన మనోవైకల్యాలు, ఆందోళన, మూడ్ స్వింగ్స్‌కు కూడా ఇవి ప్రభావితం చేస్తాయన్నమాట. మైక్రోబయోమ్‌ను ఆరోగ్యంగా ఉంచే మార్గాల్లో ప్రొబయోటిక్స్ (Probiotics) ప్రధానమైనవి. ఇవి ఆరోగ్యకరమైన బాక్టీరియా. పెరుగు (yogurt), బట్టర్ మిల్క్ (మజ్జిగ), కాంజీ వంటి పదార్థాల్లో ఉంటుంది. కాగా, పచ్చి కంద, జొన్నలు, చిలుకల దుంప, పచ్చి వేప, వెల్లుల్లి, ఉల్లిపాయ మొదలైనవి బాక్టీరియాకు ఆహారంగా పని చేసే పదార్థాలు. ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల మంచి బాక్టీరియా వృద్ధి చెందుతుంది. అనవసరమైన యాంటీబయోటిక్స్ తీసుకోవడం నివారించడం, ఎందుకంటే అవి మంచిచెడ్డా తేడా లేకుండా అన్ని బాక్టీరియాను నాశనం చేస్తాయి ఏదిఏమైనా మన శరీరంలో కణాల కంటే బాక్టీరియా సంఖ్య ఎక్కువ అనేది ఆశ్చర్యం కలిగించే నిజం. కాబట్టి, మనం అంటే కేవలం మనం మాత్రమేకాదు... మనతోనే, మనలోనే ఉండే బాక్టీరియా కూడా.

## 'ఆర్మిడిల్లో' నటన..




బల్లి జాతికి చెందిన 'ఆర్మిడిల్లో'కు గొప్ప నటనా చాతుర్యం ఉంది. ఏదైనా ప్రమాదం ముందుకొచ్చిందన్న అనుమానం కలిగినా, ఏదైనా జంతువు దాడి చేస్తుందని గ్రహించినా, వెంటనే స్పందిస్తుంది. తల ఎక్కడ ఉందో కూడా కనిపెట్టలేని రీతిలో గుండ్రంగా ముడుచుకుపోతుంది. అప్పటికీ దాడి జరిగినా లేక దాడి అనుమానం పెరిగినా, వెంటనే తోకను తనంతట తానే కత్తిరించిన విధంగా వదిలివేస్తుంది. ఈ తోక కూడా ప్రాణంతో కొట్టుకుంటుంది కాబట్టి, దాడి చేసిన జంతువు దానిని ఎత్తుకుపోతుంది. ఆర్మిడిల్లో తోక మళ్లీ పెరగడం విశేషం. ప్రకృతిపరంగానే జంతువులకు కొన్ని లక్షణాలు అలవడతాయనడానికి ఆర్మిడిల్లో లిజార్డ్ ఒక ఉదాహరణ.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో బూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత కార్మికుల హక్కులను కాలరాస్తూ నియంతృత్వ పాలన కొనసాగిస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులను పెంచిపోషిస్తూ నిత్యవసర వస్తువుల ధరలను పెంచి సామాన్యులపై భారం మోపుతుందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తుందన్నారు. కేంద్రం వెంటనే మావోయిస్టులతో చర్చలు జరిపి ఆపరేషన్ నిలిపివేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. జూన్ 8న జరిగే పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు ఎల్లావుల రాములు, ఉస్తెల నారాయణరెడ్డి, ధూళిపాళ ధనుంజయ నాయుడు, మేకల శ్రీనివాసరావు, క్రిష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, యాదగిరి, పొకల వెంకటేశ్వర్లు, హనుమంతరావు, దేవరం మల్లేశ్వరి, ఎస్‌కె లత్తు పాల్గొన్నారు.

## గుర్తింపు లేని కాలేజీలు, పాఠశాలలు మూసేయాలి

### ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్



**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** వరంగల్ జిల్లాలో విద్యాశాఖ గుర్తింపు లేకుండా నడుస్తున్న కాలేజీలు, పాఠశాలలను మూసేయాలని ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదేళ్ల శరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం శివనగర్ తమ్మెర భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో శరత్ మాట్లాడారు. టెక్నో, డిజి పేర్ల మీద నడిపిస్తున్న పాఠశాలలను, అకాడమీల పేరుతో నడుస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని కోరారు. నగరంలోని ప్రైవేట్ స్కూళ్లలో విచ్చలవిడిగా బుక్స్ యూనిఫామ్స్ అమ్ముతున్నారని ఆరోపించారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇంటర్ బోర్డు అధికారులు ప్రైవేట్ జూనియర్ కళాశాలల ఆగడాలు అరికట్టాలని లేని పక్షంలో జూనియర్ కళాశాలల ముందు ఆందోళనలు చేపడతామన్నారు. కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు ఇంకా ప్రారంభం కాకముందుకే రెండో సంవత్సరం తరగతులు నిర్వహిస్తూ, ఒక్కో విద్యార్థినుండి 50 శాతం ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సాగర్, రాకేష్ ప్రశాంత్, శరత్, రమేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమష్టికృషితో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### రూ.3.58 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం, సమష్టి కృషితో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామని ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి మండలం విద్యానగర్, వెంకటేశ్వరాకాలనీ, రామాంజనేయకాలనీ, ఎన్‌కే నగర్, నందతండా గ్రామపంచాయితీలో పరిధిలో శుక్రవారం రూ.3.58కోట్ల ఈజిఎశ్, సబ్ ప్లాన్ నిధులతో చేపట్టనున్నరోడ్లు, డ్రైనేజీల పనులకు శంకుస్థాపనలు, పనులు పూర్తయిన వాటికి ప్రారంభోత్సవాలు చేశారు. కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజా అవసరాలను గుర్తించి నిధుల మంజూరికి కృషి జరుగుతోందని, ప్రాధాన్యతా క్రమం లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజలు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకదృష్టిసారించామని, కనీసఅవసరాలైన తాగు నీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు వంటివాటికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజాసంక్షేమ పథకాలను అర్హులైన పేదల దరిచేరుస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న పనులపై ప్రజలతో పాటు అధికారులు కూడా దృష్టి సారించాలన్నారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి తేడాలు లేకుండా పనులు చేయాలని, చేపట్టిన పను లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపిడిఓ శుభాషిణి, తహశిల్దార్ కృష్ణ, వివిధ శాఖల అధికారులు, సత్యనారాయణ, నాగేంధర్, రాయల వెంకటేశ్వర్లు, రవి, నర్సింహారావు, గుప్తా, వసంత, శ్రీనివాసరెడ్డి, రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళీ, నాయకులు శ్రీను, జకరయ్య, మహేశ్వరరావు, మాధవరావు, రాంజీ, పాల్, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు, నాని, అజయ్, బషీర్, యాకూబ్,రతన్, వేదాద్రి, మహేష్, నగేష్, జమలయ్య, కృష్ణయ్య, రాజేష్, వీరు, ప్రసాద్, నూరమ్మ, కిట్టు, పిడుగు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** రాష్ట్రంలో అధికారంలోఉన్నకాంగ్రెస్ ప్రభుత్వం సిపిఐతో స్నేహపూర్వకంగా ఉన్నప్పటికీ ప్రజాసమస్యలపై ప్రజలపక్షాన సమరశీల పోరాటాలకు సిద్ధమయ్యామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో సిపిఐ నూతన జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో 16 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాస ం సన్నగిల్లిందన్నారు. ప్రభుత్వ యంత్రాంగంపై పరిపాలకుల అజమాయిషీ లేకుండా పోయిందన్నారు. కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలపై ప్రజల్లో అవిశ్వాసం నెలకొనడం దురదృష్టకరమన్నారు. స్నేహపూర్వకంగాఉన్నకమ్యూనిస్టు పార్టీ అనేక మార్లు పలు సూచనలు సైతం చేయడం జరిగిందన్నారు. కరీంనగర్ జిల్లాలో అనేక సమస్యలతో సతమతమవుతున్నామని, సమగ్రమైన అభివృద్ధి కోసం సిపిఐ ఉద్యమ కార్యచరణ రూపొందించిందన్నారు.డంప్ యార్డు సమస్యను పరిష్కరించాలన్నారు. ఇండ్లు, ఇళ్లస్థలాలపై రాజకీయ జోక్యం లేకుండా నిజమైన పేదలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వంలో వందల కోట్లు ఖర్చు పెట్టి నిర్మాణం పూర్తి చేసిన డబుల్ బెడ్ రూంలు నిరుపయోగంగా ఉన్నవాటిని పేదలకు పంపిణీ చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ నెల 27, 28 తేదీలలో సిపిఐ 23వ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించామన్నారు. జాతీయ,రాష్ట్ర,జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తూ వచ్చే మూడేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ కార్యచరణ రూపొందించామన్నారు. నూతనంగా 39 మందితో జిల్లా కౌన్సిల్, 14 మందితో జిల్లా కార్యవర్గం, నూతన జిల్లా కార్యదర్శిని ఎన్నుకున్నామన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్య లు పొనగంటి కేదారి,అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, గూడెం లక్ష్మి , నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, కిన్నెర మల్లవ్వ, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, కంది రవీందర్‌రెడ్డి, అందె చిన్న స్వామి, బావండ్లపల్లి యుగంధర్, మచ్చ రమేష్, బోనగిరి మహేందర్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, నాయకులు చెంచల మురళి, మామిడిపల్లి హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్

సిపిఐ కరీంనగర్ జిల్లా నూతన కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్ శుక్రవారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.తన ఎన్నికకు సహకరించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అనభేరి ప్రభాకర్‌రావు, చెన్నమనేని రాజేశ్వర్‌రావు, దేశిని చినమల్లయ్య, చాడ వెంకటరెడ్డి, మర్రి వెంకటస్వామిల వారసత్వాన్ని కొనసాగించే అవకాశం కల్పించినందుకు అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

## నకిలీ విత్తనాలు అరికట్టండి




**ప్రజాపక్షం/వైరా:** నకిలీ విత్తనాలను అరికట్టి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు అన్నారు. వైరాలో శుక్రవారం మండల ముఖ్య నాయకుల సమావేశం రేమల్లి నారాయణ అధ్యక్షతన జరిగింది. యర్ర బాబు మాట్లాడుతూ వ్యవసాయ పనులు ఈ సంవత్సరం తొలకరి వర్షాలు రుతుపవనాలు ముందుగా వస్తున్న నేపధ్యంలో రైతులు వ్యవసాయ సీజన్‌ను ముందుగా ప్రారంభించి ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేయుటకు సిద్ధమవుతున్నారన్నారు. నకిలీ విత్తనాల విక్రయదారులు అక్రమార్కులు అదునుగా తీసుకొని వివిధ రకాల కొత్త కంపెనీల పేర్లతో రైతులను మోసం చేస్తున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాల పేర్లతోటి మార్కెట్‌లోఅమ్ముతున్న విక్రయదారులనుఅరికట్టడంలో సంబంధిత శాఖ అదికారులు విఫలమయ్యారన్నారు. నకిలీ విత్తనాలఅమ్మకందారులపై గతంలో అరకొర కేసులు పెట్టి చేతులు దులిపేసుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, రైతు సంఘం నాయకులు లక్ష్మీ నారాయణ, గారపాటి అశోక్, ఆదూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 3న నర్మెటలో సిపిఐ బహిరంగ సభ

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** సిపిఐ జిల్లా మహాసభల సందర్భంగా జూన్ 3న నర్మెట మండలంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో మోటే శ్రీశైలం అధ్యక్షతన ఎఐటియుసి జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రమజీవుల కష్టాలు పోవాలంటే ఎర్ర జెండాను ముందుకు తీసుకెళ్లాలన్నారు. దేశంలోని బిజెపి కార్మికులు సాధించుకున్న హక్కులను హరిస్తుందని, 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించిందన్నారు. సిపిఐ శ్రమజీవులకు అండగా ఉంటు కార్మికులు కష్టాల్లో భాగమవుతుందన్నారు. గూడు, గూడు, విద్య, ఉపాధి వంటి అనేక సమస్యలపై సిపిఐ పోరాటాలు చేస్తుందని, దోపిడికి వ్యతిరేకంగా ప్రజల పక్షాణ నిలబడి పనిచేస్తుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా కార్మికుల పక్షాణ నిలబడి అనేక పోరాటాలు చేసిందన్నారు. కష్ట జీవులకు అండగా ఉంటున్న సిపిఐ జనగామ జిల్లా మహాసభలు ఈ నెల 3,4 తేదీల్లో జనగామ జిల్లాలోని నర్మెట మండలంలో జరగనున్నాయన్నారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారన్నారు. ఈ బహిరంగ సభకు భవ నిర్మాణ కార్మికులు, హమాలీలు, బీడి, ఆటో, షాప్స్ అండ్ హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్మికులు, కర్షకులు, పేదలు అధిక సంఖ్యలో తరలి వచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చామకూర యాకూబ్, నాయకులు అంజనేయులు, తోట సుశీల, సుద్దాల యాదగిరి, చల్లోజు మల్లేష్, లింగాల రాములు, ముల్కల లక్ష్మయ్య, ఉడుత సుదర్శణం, బల్ల యాకయ్య, వంగాల ప్రభాకర్, గుగులోతు రాఘవులు, మచ్చ మల్లయ్య, బెజగం చంద్రయ్య, జోగు కృష్ణ, తిరుమలేష్, బెజగం చంద్రయ్య, జోగు కృష్ణ దాయ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్


## వికసించిన 'మే' పుష్పం..

**ప్రజాపక్షం/గోదావరిఖని :** మే పుష్పం అంటే మే నెలలో పూసే ఒక రకమైన పుష్పం. దీనిని ఫుట్‌బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ అని అంటారు. ఈ అరుదైన పుష్పం సింగరేణి ఆర్జీ1 జీఎం కార్యాలయం పర్సనల్ డిపార్టుమెంట్‌లో సేవా సమితి కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న మేడి తిరుపతి నివాస గృహం ఎన్‌టిపిసి అన్నపూర్ణకాలనీలో శుక్రవారం పూసింది. ఈ పుష్పం సాధారణంగా వేసవి కాలంలో వికసించే ఒక అరుదైన పుష్పం. ఇది చూడ్డానికి ఎర్రని బంతిలా, ఆకట్టుకునేలా ఉంటుంది. ఎంత వేడిగా ఉంటే అంతగా ఇది పూలతో వికసిస్తుంది. 20 రోజుల వరకు వాడిపోకుండా ఉంటుంది. మిగతా కాలమంతా పచ్చని వెడల్పాటి ఆకులతో మొక్క అలరిస్తుంది. తిరుపతి ఇంటిలో పూసిన 'మే' పుష్పాన్ని స్థానిక ప్రజలు చేసేందుకు రాగా వారిని ఈ పుష్పం ఆకట్టుకుంటున్నది.



## యాజమాన్య నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

సింగరేణి విశ్రాంత ఉద్యోగులు



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:** గుర్తింపు,ప్రాతినిధ్య,వివిధ కార్మిక సంఘాలు రాష్ట్ర ప్రభుత్వం మరియు సింగరేణి యాజమాన్యంతో నిరంతర విజ్ఞప్తులు సంప్రదింపుల ఫలితంగా హైదరాబాదులో సింగరేణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటుకు నిర్ణయం జరిగిందని,సింగరేణి లో పనిచేస్తున్న,రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం దృష్టిలో ఉంచుకొని తొందరగా ఈ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్రాసిన వినతి పత్రం కాపీని సింగరేణి చైర్మన్ కార్యాలయంలో అందజేయడం జరిగిందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్ రావు ,ప్రధాన కార్యదర్శి బుపెల్లి బానయ్య, ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ లు పేర్కొన్నారు. యాజమాన్యం వీలైనంత తొందరగా హైదరాబాద్ లో సింగరేణి చే కార్పొరేట్ హాస్పిటల్ ను ప్రారంభించి కార్మికులకు వైద్య సేవలు అందించాలని వారు పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.విజయబాబు, నర్సింగరావు, బంగారి రాజయ్య టి.ఉమాకర్, కనకయ్య బీరయ్య లక్ష్మీ నారాయణ తదితరులు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కష్టజీవుల కలం యోధుడు...

మునీర్‌కు పలువురు నివాళులు




**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖనిలో ఐఎఫ్‌టియు, గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు, సీనియర్ పాత్రికేయుడు, కాలమిస్టు, మానవ హక్కుల కార్యకర్త, ప్రత్యేక తెలంగాణ పోరాట యోధుడు కామ్రేడ్ ఎండి.మునీర్ సంతాప సభ కార్యక్రమాన్ని సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మునీర్ చిత్రపటానికి పూల మాలలు వేసి మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ మాట్లాడుతూ, తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు నిలిచిన వ్యక్తి మునీర్ అని ఆయన మరణం కష్ట జీవులకు, పాత్రికేయ రంగానికి తీరని లోటు అన్నారు. కామ్రేడ్ మునీర్‌కు జోహార్లు అర్పిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.అశోక్, ఈదునూరి నరేష్, ఐ.రాజేశం, డి.బుచ్చమ్మ, ఎడ్ల రవికుమార్, బండ పద్మ, రాజనర్సు, ధర్మేందర్, శ్రీనివాస్, దుర్గం పోచయ్య, సమ్మక్క, సారయ్య, నారాయణ, బానయ్య, నవీన్ పాల్గొన్నారు.

## రాజన్నను దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ



**ప్రజాపక్షం/ వేములవాడ:** రాజేశ్వర స్వామి వారి దర్శనార్థం శుక్రవారం వేములవాడకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు జస్టిస్ అలిశెట్టి లక్ష్మీ నారాయణకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తదుపరి న్యాయమూర్తి లక్ష్మీ గణపతి స్వామివారి దర్శనం, రాజేశ్వర స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు అద్దాల మండపంలో ఆశీర్వచన ఏర్పాట్లు చేయగా, ఆలయ అర్చకులు, వేద పండితులు వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వినోద్ కుమార్ జస్టిస్‌కు శేషవస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.

## మహిళ దారుణ హత్య

సంఘటన స్థలాన్ని సందర్శించిన ఏసిపి రవీందర్‌రెడ్డి

డాగ్ స్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరణ

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం కమ్మర్లపల్లిలో మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన గాలి బాల్‌లక్ష్మి (50) కిరాణాషాపు నడుపుకుంటు జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆమెపై దాడి చేసి గొంతు కోసి బంగారాన్ని అపహరించికెళ్లారు. గ్రామస్తులు, బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. సిద్దిపేట ఏసిపి రవీంద్‌రెడ్డి,సిఐ శ్రీను సంఘటన స్థలాన్ని సందర్శించారు, డాగ్ స్కాడ్,క్లూస్ టీంతో హత్య జరిగిన ప్రాంతాన్ని పర్యావేక్షిస్తున్నారు. బాల్‌లక్ష్మి సుధాకర్ వృత్తిరీత్యా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో హత్యకు గల కారణాలపై విశ్లేషిస్తున్నారు. మహిళ హత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయనున్నట్లు ఏసిపి రవీందర్‌రెడ్డి తెలిపారు. చిన్నకోడూరు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## యువకుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/మల్యాల:** జీవితం పై విరక్తి చెంది యువకుడు ఆత్మ హత్య చేసుకున్న సంఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కల్లపెల్లి గ్రామం లో చోటు చేసుకుంది.ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికీ చెందిన బెతి కృష్ణ వయసు 38 గత 3 సంవత్సరాల నుండి మానసిక అనారోగ్య సమస్యతో బాధపడుతూ పలు ఆస్పత్రులలో చికిత్స పొంధి చాలా డబ్బులు ఖర్చు పెట్టినప్పటికీ జబ్బు నయం కాలేదని, తనలో తాను కుమిలి పోయి,జీవితం పై విరక్తి చెంది గురువారం అర్ధ రాత్రి తన గది లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతుడికి బార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి తల్లి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బావిలో ట్రాక్టర్ పడి వ్యక్తి దుర్మరణం

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మల్లాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో చదును చేయడానికి వెళ్లిన ట్రాక్టర్ రివర్స్ చేసే క్రమంలో పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి ప్రమాదవశాత్తు దూసుకెళ్లి పడిపోవడంతో వాహనం నడుపుతున్న మాట్ల చిన్న పెద్దులు(61 )అనే వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు చిన్న పెద్దులు ట్రాక్టర్ నడుపుకొని జీవనం కొనసాగిస్తున్నాడని, రోజు వారి లాగే పని నిమిత్తం వెళ్లి గ్రామ శివారులో శనిగరపు రమేష్ తోటలోకి చదును చేయడానికి వెళ్లి వెనకకు వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి వ్యవసాయ బావిలో ట్రాక్టర్ తో సహా పడిపోయి నీటమునిగి చనిపోయాడని, మృతుడి భార్య మాట్ల సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరాలను వెల్లడించారు.

# రూ.4.44 కోట్లతో తారు రోడ్డు పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ నుంచి చిట్యాలపల్లి వరకు రూ.4.44 కోట్ల నిధులతో నిర్మించే తారు రోడ్డు పనులకు అధికారులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజాప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సైతం వేగవంతంగా చేపడుతున్నామని, రాబోవు రోజుల్లో చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల జిల్లా కేంద్రానికి దూరం తగ్గడంతో పాటు విద్యార్థులకు రోజువారీ కూలీలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు, గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, మునిగాల సుధాకర్ గౌడ్, నిజానపురం చందు, ముద్దం తిరుపతి గౌడ్, గుర్రం రమేష్, రాములు, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కోలపురి శ్రీకాంత్, గుంటి స్వరూప, పలువురు అధికారులు, గుమ్లాపూర్ చిట్యాలపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**రానున్న నాలుగేళ్లలో ప్రతి ఒక్క అర్హుడికీ ఇల్లు**

పారదర్శకంగా, పార్టీలకతీతంగా లబ్దిదారులను ఎంపిక చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండల కేంద్రంలోని జివిఆర్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం గంగాధర మండలానికి చెందిన 468 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు ఉత్తర్వులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అందజేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో మంజూరు చేసిన ఇండ్లు మినహా గత 10 సంవత్సరాలలో బిఆర్ఎస్ సర్కార్ ఒక్క ఇల్లు సైతం మంజూరు చేయలేదని అన్నారు. గంగాధర మండలంలోని 33 గ్రామాల్లో ఒక్కరికీ ఇల్లు రాలేదన్నారు. పేదవాడి కల సాకారం చేయాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ సర్కార్ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. గంగాధర మండలంలో కురిక్యాల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇప్పటికే 200 మందికి పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా నిర్మాణం జరుగుతోందని తెలిపారు. మొత్తంగా గంగాధర మండలంలో 721 మందికి మొదటి దఫాలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని అన్నారు. రానున్న నాలుగేళ్లలో ప్రతి ఒక్క పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, హౌసింగ్ పిడి గంగాధర్, చైర్మన్ తిరుమల్‌రావు, ఏఎంసి చైర్మన్ రజిత, తహసీల్దార్ అనుపమ, ఎంపిడివో రాములు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** మిషన్ భగీరథ కార్మికులకు గత నాలుగు నెలల నుండి వేతనాలు చెల్లించడం లేదని వారి వేతనాలు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎవరెస్టు, మాక్స్ కంపెనీలు మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా వారిని నరకయాతనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాలు నేరుగా వేతనాలు చెల్లించినట్లైతే పూర్తి వేతనం వచ్చేదనీ కాంట్రాక్టర్ల ద్వారా చెల్లింపులు చేయడం ద్వారా సగం వేతనం మాత్రమే కార్మికులకు అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సగం వేతనం కార్మికులు దోపిడీకి గురవుతున్నారన్నారు. తక్షణమే మిషన్ భగీరథ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించి, ప్రభుత్వం ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రాత్రిపూట విధులు నిర్వర్తిస్తున్నందున సేఫ్టీ జెర్కిన్లు, లైట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు కోరుకున్నదే కాంగ్రెస్ ప్రభుత్వం



ఎమ్మెల్యే చింతకుంట విజయన్నారావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** ప్రజలు కోరుకున్నదే కాంగ్రెస్ ప్రభుత్వమని,అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం అని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారం రోజున పెద్దపల్లి నియోజకవర్గం ఎలిగేడు మండలంలోని లాలపల్లి, ఎలిగేడు,ర్యాకల్ దేవుపల్లి, రాములపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు & డ్రైనేజీల నిర్మాణల మరియు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ముగ్గుల పోసి ఇండ్ల పట్టాలు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల సహకారం చేస్తామని,గత బి ఆర్ ఎస్ పార్టీ హయాంలో పేదలను మోసం చేసి ప్రజాధనాన్ని దోచుకున్నారని, బి ఆర్ ఎస్ పార్టీ లాగా మాయ మాటలు చెప్పే పార్టీ కాంగ్రెస్ పార్టీ కాదని,ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలను అమలు చేసి తీరుతామని అన్నారు.ఎలిగేడు నుండి లాలపల్లి వరకు 3 కోట్ల తో రోడ్డు నిర్మాణం, లాలపల్లి నుండి చీమల పేట వరకు బీటీ రోడ్డు, ఎలిగేడు మండల కేంద్రం లో cc రోడ్లు,డ్రైనేజీ ల కోసం కోటి రూపాయల నిధులు, ఎలిగేడు బైపాస్ నుండి సుల్తాన్ పూర్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు.త్వరలోనే పోలీస్ స్టేషన్ ను ప్రారంభం, నియోజకవర్గం లో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల అందించే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. కార్యక్రమాలను సంపూర్ణంగా పూర్తి చేస్తున్నామంటే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అండ తో త్వరలోనే పెద్ద పెల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ, ఎంపీడీఓ, ఇఇ హౌసింగ్ అధికారులు మరియు ఎలిగేడు మండల అధ్యక్షులు సమా రాజేశ్వర్ రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు, రాజేశ్వర్ రెడ్డి, వెంకటశ్వర్ రావు, సత్తన్న, మనోహర్ రావు, రమేష్, రాంచంద్రం రెడ్డి, అంజయ్య, వెంకట్ రెడ్డి, కారణతి,మరియు మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేనిదే మట్టిని తరలించొద్దు..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** అనుమతి లేనిదే మట్టిని తరలించవద్దని ఎల్లారెడ్డిపేట రెవిన్యూ అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ భూమిలో మట్టిని తీయడం నేరమన్నారు. శుక్రవారం అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని రెవిన్యూ కార్యాలయానికి తరలించారు.అంతేకాకుండా ఓ జేసిబి యంత్రాన్ని పట్టుకుని కాలేజి ఆవరణ ముందుంచారు. మరో చోట మండలంలోని దేవుని గుట్ట తండా వద్ద అక్రమంగా మట్టిని తరలిస్తుండగా రెండు టిప్పర్లను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించే క్రమంలో సురెందర్ అనే వ్యక్తి రెవిన్యూ అధికారులతో దురుసుగా ప్రవర్తించారని, అధికారుల కల్లుగప్పి టిప్పర్లను తప్పించినారని మీడియాతో తెలిపారు. సదరు విషయాన్ని పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశామని రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రవణ్‌కుమార్ అన్నారు.

## సిపిఐని మరింత బలోపేతం చేయాలి


సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** భారత దేశంలో వంద సంవత్సరాల చరిత్ర గల పార్టీ సిపిఐ అని సిపిఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ నగర కార్యదర్శి కె. కనకరాజ్ అన్నారు. సిపిఐ 7వ డివిజన్ పవర్ హౌస్ కాలనీ శాఖ 4వ మహాసభ శుక్రవారం ఉదయ్‌నగర్‌లో జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కనకరాజ్ మాట్లాడుతూ సిపిఐకి బలమైన కేంద్రాలలో పవర్ హౌస్ కాలనీశాఖ ఒకటని అన్నారు. పల్లి కొండ లింగన్న విగ్రహం వద్ద సిపిఐ జెండా ఆవరణలో ఆఫీసు నిర్మాణాన్ని చేపట్టి ఇక్కడి ఏరియాలో పోరాట కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. అదేవిధంగా 7వ డివిజన్ పరిధిలోని రఘుపతి రావు నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం నీటి సరఫరా సరిగా లేని కారణంగా కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రఘుపతి రావు నగర్ లో డ్రైనేజీ, నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కనకరాజ్ డిమాండ్ చేశారు. మాటేటి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి తాళ్ళపెల్లి మల్లయ్య, డివిజన్ నాయకులు బోడకుంట కనకయ్య, కల్వల జగన్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారునిగా బోడకుంట కనకయ్య, కార్యదర్శి గా మాటేటి శంకర్, సహాయ కార్యదర్శిగా కల్వల జగన్,కోశాధికారిగా. టి ఆర్. సుందర్ రాజ్, కార్యవర్గ సభ్యులుగా తాని రాజబాబు, జైపాల్ రెడ్డి, గుంపుల కుమార స్వామి, మాటేటి మురళి, గండ్ర వెంకటేశ్వర్ రావులను ఎన్నుకున్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలో జూన్ 2న నిర్వహించు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే, సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు పరేడ్ గ్రౌండ్ లో జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు , సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించి జెండా ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల డయాస్, సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, అన్నారు. వేడుకల వద్ద వైద్య బృందాలచే వైద్య శిభిరాలు ఏర్పాటు చేయాలని, అవసరమైన మేర త్రాగు నీటి సరఫరా పనులు మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. వేడుకలకు ఆహ్వాన పత్రాలు ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ అందాలని అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు హజరయ్యేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు కలెక్టరేట్ ఏఓ రామ్ రెడ్డి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## పెండింగ్ పనులు త్వరగా పూర్తి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, జిల్లా ఆసుపత్రిలో 2డి ఎకో పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో పెట్టామని, వీటిని మరింత విస్తృతంగా వినియోగించాలని అన్నారు. దయాగ్నొస్టిక్ హబ్ లో అన్ని రకాల పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, శాంపిల్స్ సేకరణ, రిపోర్ట్ వేగంగా అందించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన వైద్యుల, టెక్నిషియన్స్ తాత్కాలిక ప్రాతిపదికన ఎక్కువ వేతనం అందించి నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఇతర ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న స్టాఫ్ అవసరం మేరకు డిప్యూటేషన్ చేయాలని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి కలెక్టర్ సమీక్షించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్ నిబంధనల ప్రకారం రెగ్యులర్ గా జరగాలని అన్నారు.సదెరం క్యాంపు పెండింగ్ ఉంచకుండా ఎప్పటి కప్పుడు క్యాంపులు నిర్వహించి దివ్యాంగులకు యూ.డి.ఐ.డి కార్డు జారీ చేయాలని అన్నారు. వేములవాడ ఆసుపత్రిలో మోకాల ఆపరేషన్ విజయవంతంగా జరుగుతున్నాయని, అదే విధంగా సిరిసిల్ల ఆసుపత్రిలో కూడా ఇటువంటి ఆపరేషన్ జరగాలని అన్నారు.టి.బి వ్యాధి గ్రస్తులకు అవసరమైన చికిత్స పక్కాగా అందాలని అన్నారు. ఈ సమావేశంలో డా. లక్ష్మీ నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రజిత, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. లక్ష్మీ నారాయణ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీధర్‌బాబు పుట్టినరోజు వేడుకలు

44 మంది అభిమానులు రక్తదానం





**ప్రజాపక్షం/గోదావరిఖని :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ టోల్‌ప్లాజా వద్ద డీసీసీ ప్రధాన కార్యదర్శి, అల్ట్రాటెక్ సిమెంటు కర్మాగారం కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షులు సూర సమ్మయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, తలసేమియా, రోడ్డు ప్రమాద బాధితుల కోసం రక్తదానం శిబిరాన్ని చేపట్టారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో చేపట్టిన ఈ శిబిరంలో సూర సమ్మయ్యతోపాటు టోల్ ప్లాజా, కెఎఫ్‌టి కార్మికులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు 44 మంది రక్తదానం చేశారు. ముందుగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అత్యవసర సమయంలో అవసరమైన రక్తం అభించక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని మంత్రి శ్రీధర్ బాబు పుట్టినరోజున ఒక మంచి కార్యక్రమం చేపట్టాలనే ఆలోచనతో రక్తదానం శిబిరాన్ని నిర్వహించినట్లు సమ్మయ్య తెలిపారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ తలారి శంకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గణపతి లక్ష్మీ నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి అరకల సతీష్, యూత్ మండల వైస్ ప్రసిడెంట్ దండుగుల శ్రీకాంత్, మాజీ సర్పంచి లాల్‌సింగ్, మాజీ ఉప సర్పంచి బదావత్ శంకర్ నాయక్,కుమార్‌గౌడ్, సిమెంటు కర్మాగారం కార్మిక సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి కాలువ అంజయ్య యాదవ్, యువజన ప్రధాన కార్యదర్శి ఎరుకల సాగర్ గౌడ్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ షబ్బీర్, మాజీ వార్డు సభ్యులు సంపంగి కుమార్, కొమిరె సురేష్, భూతగడ్డల రమేష్, మార్కెట్ కమిటీ డైరక్టర్ మాదాసు రమేష్, బదావత్ అంజినాయక్, కనకయ్య, బూర్ల నారాయణ, షఫీ, బాపు, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

## కొండగట్టుకు రూ.1 కోటికి పైగా హుండీ ఆదాయం

**ప్రజాపక్షం/మల్యాల:**జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం లో శుక్రవారం లలితా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 24 రోజులకు గాను 12 హుండీలను విప్పి లెక్కించగా హుండీ ఆదాయం 1కోటి 95 వేల 392 రూపాయలు, విదేశీ కరెన్సీ నోట్లు 44, హుండీ లలో వచ్చిన మిశ్రమ బంగారం, వెండి లను తిరిగి సీల్ వేసి హుండీ లో భద్ర పరిచారు. అలాగే హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా దీక్షా పరులు కట్టిన ముడుపులను విప్పి నగదును లెక్కించగా రూ. 1లక్ష 65వేల 641 సమా కూరి నట్లు ఈవో శ్రీకాంత రావు తెలిపారు. పర్యవేక్షణాధికారిగా రాజ మొగిలి, ఆలయ ఈవో శ్రీకాంత రావు, సూపరిడెంట్లు చంద్రశేఖర్,హరి హరనాథ్, సునీల్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, స్థానాచార్యులు కపిందర్, ఏ ఎస్సై శ్రీనివాస్, హోం గార్డ్స్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ వాసి మృతి



**ప్రజాపక్షం/పాపన్నపేట :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఉత్తర ప్రదేశ్ చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం కేంద్రం పాపన్నపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన విష్ణుప్రసాద్ (28) ఉపాధి నిమిత్తం స్థానికంగా ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి సమయంలో సరుకులు తెచ్చుకోవడానికి వెళ్లి తిరిగి వస్తు రోడ్డు దాటే క్రమంలో మెదక్ వైపు నుండి వస్తున్న ఓ కారు వేరే వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి అతన్ని ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలు కాగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# అధికారుల నిర్లక్ష్యానికి రైతులు బలి

తురాటి గ్రామ రైతుల రాస్తారోకో..
స్తంభించిన జాతీయ రహదారి

**ప్రజాపక్షం/నర్సాపూర్ జి :** అధికారుల అలసత్వం, ట్రక్‌షీట్ లోపాలు నర్సాపూర్ జి మండలం తురాటి గ్రామానికి చెందిన రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. గత నాలుగు రోజుల క్రితం కుంటాల రైస్ మిల్లుకు పంపిన 400లకు పైగా ధాన్యం బస్తాలను, ''మ్యాచింగ్ కాలేదు'' అనే సాకుతో తిరిగి పంపిన ఘటనతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉదయం నిర్మల్‌బైంసా జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసన కారణంగా జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

**సమస్యకు మూలం..**

అధికారులు నమోదు చేసిన ట్రాక్ షీట్‌లో సరైన వివరాలు నమోదు చేయకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు తెలిసింది. దీనిపై రైతులు అధికారులను చరవాణిలో సంప్రదించగా, రేపటిలోగా ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఆ హామీ కేవలం మాటలకే పరిమితం కావడంతో, ఇప్పటివరకు అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు.



**రైతుల ఆందోళన :**

జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు,తమ ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే తాము నష్టపోతున్నామని, తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలని వారు గట్టిగా నినాదాలు చేశారు. ''మా ధాన్యం ఎందుకు తిరిగి పంపించారు.? అధికారుల తప్పుకు మేము ఎందుకు మూల్యం చెల్లించాలి? అని ఒక రైతు ప్రశ్నించారు.తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని,లేకపోతే తమ నిరసనను విరమించేది లేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు.

**పోలీసులు, అధికారుల జోక్యం :**

సమస్య తీవ్రతను గుర్తించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారి డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినా, రైతులు మాత్రం తమ నిరసనను కొనసాగించేందుకు నిశ్చయించుకున్నారు. ధాన్యం కొనుగోలుపై స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని రైతులు స్పష్టం చేశారు.

**నిరసన విరమణ :**

అనంతరం స్థానిక తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్సై సాయి కిరణ్‌లు రైతుల వద్దకు వెళ్లి నచ్చచెప్పారు. తడిచిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టమైన హామీ ఇవ్వడంతో, రైతులు తమ నిరసనను ముగించారు.



## మైనర్లకు కల్లు విక్రయం.. దుకాణం సీజ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని మంచిర్యాల ఎక్స్ రోడ్ వద్ద గల ఒక కల్లు దుకాణంపై శుక్రవారం ఎక్సైజ్, పట్టణ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మైనర్లకు కల్లు విక్రయిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఈ దాడులు జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, దుకాణంలో మైనర్లకు కల్లు అమ్ముతున్నారనే ఆరోపణలు నిజమేనని తనిఖీల్లో వెల్లడైంది. అక్కడున్న వ్యక్తి కూడా ఈ విషయాన్ని అంగీకరించాడు. దీంతో, ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం ఆ దుకాణాన్ని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని ఏ కల్లు దుకాణంలో నైనా లేదా వైన్ షాపుల్లోనైనా మైనర్లకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ ఉన్నతాధికారులు హెచ్చరించారు. ఎక్కడైనా మైనర్లకు మత్తు పదార్థాలు, కల్లు లేదా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 8712659599 నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలకు పోలీసులు కోరారు.

## చెన్నూర్‌లో బస్తీ దవాఖాన ప్రారంభం



**ప్రజాపక్షం/చెన్నూర్ :** చెన్నూర్ పట్టణంలో నిర్మించిన నూతన బస్తీ దవాఖానా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని చెన్నూర్ ఎంఎల్ఏ వివేక్ వెంకటస్వామి తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. శుక్రవారం చెన్నూర్ మున్సిపాలిటీలో 13 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన బస్తీ దవాఖానాను ఎంఎల్ఏ వివేక్ వెంకటస్వామి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంఎల్ఏగా గెలిచిన నాటి నుండి నియోజకవర్గంలో వైద్యం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టానని, ప్రజల ఆరోగ్యమే తన ప్రథమ కర్తవ్యమని చెప్పారు. దవాఖానాకు వచ్చే ప్రతి రోగితో వైద్య సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దవాఖానా సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ



**ప్రజాపక్షం/బాన్సువాడ :** బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇండ్ల నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు బోయిని శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయిని శంకర్, సొసైటీ వైస్ ఛైర్మన్ దొంతురం గంగారం, నాయకులు కొత్త కాపు కాంత్‌రెడ్డి, కాశిరాం, దొంతురం కాశీరాం, మేదరి లక్ష్మి నారాయణ, తోట ప్రభాకర్, నారాయణ, సాయిలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ తగాదాలో ఒకరు రిమాండ్



**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని అమ్రాద్ తండా భూతగాదలో హత్య చేయడానికి ప్రయత్నించిన మెగావత్ నరేష్‌ను రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం మెగావత్ పీర్‌సింగ్, మెగావత్ సకారం వీరిద్దరు అన్నదమ్ములకు తమ తండ్రి తల రెండు ఎకరాలకు శివారులో ఆస్తిని పంచి ఇచ్చాడు. మెగావత్ పీర్‌సింగ్ తన పొలంలో నుండి రైల్వే ట్రాక్ వెళ్లటంతో రైల్వే వారు కొంత భూమిని వారు తీసుకున్నారు. తన భూమిని తన చిన్నాన్న సకాం తీసుకొమ్మని కోరారు. తన చిన్నాన్న కొడుకు సచిన్ మేమెందుకు ఇస్తామని తమ భూమి తమకే అని మా భూమి మాకే చెందుతుందని చెప్పారు. దీంతో నానమ్మ పిప్లిబాయి పేరు మీదున్న అర ఎకర భూమిలో నుంచి సగభాగం ఇవ్వమని నరేష్ కోరారు. ఎక్కడ ఇచ్చేది లేదని వారు చెప్పారు. ఇట్టి భూ సమస్యలను మనసులో పెట్టుకున్న మెగావత్ నరేష్ కిటికీ అద్దం ముక్కతో మెగావత్ లక్ష్మి కుడివైపు పక్కటి ఎముకలపై పొడిచి చంపడానికి ప్రయత్నించాడని మెగావత్ సచిన్ పోలీసులకు తెలిపాడు. దీంతో స్థానిక పోలీస్ ఎఎస్సై నర్సయ్య, నరేష్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. భూ తగాదాల విషయంలో గొడవలు చేసుకుంటే పోలీసుల రిమాండ్ చేసి జైలుకు పంపుతారని ఏమైనా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని రూరల్ సిఐ శ్రీనివాస్ తెలిపారు.

## వక్ఫ్ నిరసిస్తూ ముస్లింల మానవహారం




**ప్రజాపక్షం/బాన్సువాడ :** బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు చట్టానికి వ్యతిరేకంగా బాన్సువాడ తంజిముల్ మజీద్ ఆధ్వర్యంలో ముస్లింలు మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు చట్టం వల్ల ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వెంటనే వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా మసీదుల ప్రతినిధులు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల లబ్ధిదారులకు అన్ని విధాలుగా తోడ్పాటు

ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి
కలెక్టర్‌తో కలిసి సామూహిక ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే బృహత్తర సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తోందని ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి ముందుకొచ్చే లబ్ధిదారులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తామని భరోసా కల్పించారు. బాన్సువాడ శాసనసభ నియోజకవర్గంలోని పోతంగల్ మండలం హంగర్గ ఫారంలో 40 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం ఆయన సామూహిక భూమిపూజ చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, రాష్ట్ర ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజు, బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో కలిసి పోచారం భాగస్వాములయ్యారు. కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన 510 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ పత్రాలు ప్రోసీడింగ్స్ అందజేశారు. అంతకుముందు కోటగిరి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మించిన మోడల్ ఇంటిని సందర్శించి లాంఛనంగా ప్రారంభించారు. 400 చ॥అడుగుల విస్తీర్ణంలో రూ.5లక్షలలోపు వ్యయంతో ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసిన ఇంటి నిర్మాణ ఖర్చు పనుల వివరాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. హంగర్గఫారంలో ఏర్పాటు చేసిన సభలో ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ధనికులు, పేదలు ఎవరైనా సరే సుఖంగా జీవించాలంటే ఇళ్లు, ఇల్లాలు ఎంతో అవసరమవుతాయన్నారు. ఈ నిధులను లబ్ధిదారులు ఒక్క నయా పైసా కూడా తిరిగి కట్టాల్సిన అవసరం లేదని సూచించారు. బాన్సువాడ నియోజకవర్గంలో 11 వేల రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి పేదలకు అందించామని గుర్తు చేశారు. అదే తరహాలో ప్రస్తుతం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వాటి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా కృషి చేస్తున్నామన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ తొలివిడతలో ప్రభుత్వం స్థలాలు కలిగి ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఒక్కో అసెంబ్లీ నియోకవర్గంలో 3500 చొప్పున మంజూరు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు త్వరగా ముగించాలి :కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/పాపన్నపేట :** వర్షాకాలం తరిమికొస్తుందని మండల పరిధిలోని వివిధ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు త్వరగా ముగించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ఆయన శుక్రవారం పాపన్నపేట మండల పరిధిలోని మిన్పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలం ముంచుకొస్తుందని త్వరగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే మిన్పూర్లో ధాన్యం కొనుగోలులో ఆలస్యమైందని ధాన్యాన్ని వెంట వెంటనే లారీలలో పంపించాలని ఆయన ఆదేశించారు. మిన్పూర్‌లో ధాన్యం బస్తాలను వెంటవెంటనే పంపకపోవడం పట్ల నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు దగ్గర పడ్డాయని కేవలం మిన్పూర్, కొడపాక ముద్దాపూర్ గ్రామాలలో వెనుకబడినట్లు ఆయన వెల్లడించారు. ఒక వేళ అనుకున్న విధంగా లారీలు అందుబాటులో లేకపోతే మరిన్ని లారీలు తెప్పించుకొని రైతులకు ఏమాత్రం ఇబ్బందులు ఎదురవకుండా ధాన్యాన్ని తరలించాల్సిందిగా కలెక్టర్ సూచించారు. రైతులకు ఇబ్బందులు ఎదురవకుండా ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేయాల్సిందిగా ఆయన సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సతీష్ కుమార్ తదితరులున్నారు.

# నిస్తేజంగా మారిన బిఎస్ఎన్ఎల్ కార్యాలయం



**ప్రజాపక్షం/సిర్పూర్ (టి) :** సిర్పూర్ (టి)లో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం పునరుద్ధరించాలని వినియోగదారులు కోరుతున్నారు. టెలికాం రంగంలో ఓ విశ్వసనీయ బ్రాండ్‌గా వెలుగొందిన ఈ సంస్థ, ఇప్పుడు సేవల విరామంతో ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ఒకప్పుడు టెలిఫోన్, బ్రాడ్‌బ్యాండ్ సేవల ద్వారా ప్రజల నిత్యజీవితంలో భాగమైన భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) కార్యాలయం ప్రస్తుతం మూతపడి శిథిలంగా కనిపిస్తోంది. సిర్పూర్ (టి) మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లోని వినియోగదారులు, కొలువులు లేక ఖాళీగా ఉన్న కార్యాలయాన్ని చూస్తూ అసహనంగా మిగిలిపోతున్నారు. సామాన్యులు చిన్న సమస్యలకే మంజీరాబాద్, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది వారి సమయం, డబ్బును వృథా చేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిఎస్ఎన్ఎల్ ప్లాన్‌లు చౌకగా ఉండటం, నెట్‌వర్క్ కవరేజ్ బాగుండడం ఉన్నా, సేవలలో ఉండే ఆలస్యం, సాంకేతిక సమస్యల పరిష్కారానికి అందుబాటులో అధికారులు లేకపోవడం వల్ల ప్రజలు ప్రైవేట్ టెలికాం సంస్థల వైపు మొగ్గు చూపుతున్నారు.

**కార్యాలయాన్ని అద్దెకు ఇస్తాం.. డిఇ శ్రీధర్**

ప్రస్తుతం కార్యాలయంలో సిబ్బంది నియామకం లేదు, దీనిని బ్యాంకులకు లేదా ఇతర సంస్థలకు అద్దెకు ఇవ్వాలనే ప్రణాళిక ఉన్నదని. త్వరలో కార్యాలయం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయిస్తామని డిఇ శ్రీధర్ తెలిపారు. ఇక స్థానికులు మాత్రం ఇది తాత్కాలిక పరిష్కారం కాదని, బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు స్వయంగా స్పందించి కార్యాలయాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు. కనీసం సిర్పూర్ (టి) లాంటి మండల కేంద్రాల్లో వినియోగదారులకు ప్రత్యక్షంగా సేవలు అందించే సాంకేతిక సిబ్బంది నియామకం జరిగితే, సంస్థ పట్ల ప్రజల్లో మళ్లీ విశ్వాసం నెలకొంటుందని అభిప్రాయపడుతున్నారు.

## దివ్యాంగులు మనోధైర్యంతో ఉండాలి



దివ్యాంగుల ఆర్కెస్ట్రా బృందానికి రూ.1,16,610
సహాయం : జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** దివ్యాంగులు మనోధైర్యంతో ఉండాలని, దివ్యాంగుల ఆర్కెస్ట్రా బృందానికి రూ. 1,16,610లు సహాయం చేస్తుందని, దివ్యాంగులకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు. అన్నారు. సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో దివ్యాంగుల ఆర్కెస్ట్రా బృందానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు రూ. 1,16,610 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ దివ్యాంగులమని కలత చెందకుండా మనోధైర్యంతో ఉండాలని తెలియజేశారు. దివ్యాంగుల కొరకు ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అదికారి లలిత కుమారి ,వయోవృద్ధుల దివ్యాంగుల శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్, దివ్యాంగులు లక్ష్మి , నగేష్ బాగ్య, సరోజ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** మండలంలోని వరి కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం తక్కువగా ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు పంపాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే అధికారులను ఆదేశించారు. రైతులకు నష్టాలు లేకుండా చూడటం ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దౌత్రే సిర్పూర్ టి మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం, లోనవల్లి (దుబ్బగూడ) గ్రామంలో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కేంద్రంలో తగినన్ని టార్పాలిన్‌లు, గోనె సంచులు సిద్ధంగా ఉంచాలని, ధాన్యం తూకం పూర్తి అయిన వెంటనే మిల్లులకు తరలించాలని, రైతుల ఖాతాల్లో త్వరగా రుసుములు జమయ్యేలా చూడాలని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ, అకాల వర్షాలు పడుతున్న దృష్ట్యా పంటను ముందుగా కోయడం ద్వారా నష్టాలను నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారం, డిఎస్ఓ వినోద్, డిఎం మార్కెటింగ్ నరసింహ రావు, తహసీల్దార్ నిజాముద్దీన్, ఎపిఎం దుర్గయ్య, వ్యవసాయ అధికారి రవి, ఐకెపి సిసిలు, రైతులు పాల్గొన్నారు.



## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు: కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు, మందుల విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న అరుణ్ ఏజెన్సీ ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని విత్తనాలు,పురుగు మందుల ప్యాకింగ్, లేబుళ్లు, అమ్మకాల రిజిస్టర్లు, నిల్వల వివరాలు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాల కారణంగా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిషేధించిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని, నిబంధనల్ని అతిక్రమించిన వారి మీద చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అధికారులు రెగ్యులర్‌గా దుకాణాలపై తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నకిలీ విత్తనాల సరఫరా, అమ్మకాలపై కఠినంగా చర్యలు తీసుకుని రైతుల ప్రయోజనాలను కాపాడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీలో వ్యవసాయ అధికారి రాజశేఖర్, తహసిల్దార్ రాజు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి
ముడారపు పరమేశ్వర్



**ప్రజాపక్షం/సోన్ :** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని జిల్లా ఇన్చార్జి విద్యాశాఖ అధికారి ముడారపు పరమేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సోన్ మండలంలోని వెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో జరిగిన పోషకుల ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఆయన వివరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇంగ్లీష్ మీడియంలో కూడా బోధన జరుగుతోందని, అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో మౌలిక వసతులు సమకూర్చుబడ్డాయని పేర్కొన్నారు. విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ విద్య కూడా విద్యార్థులకు అందుబాటులో ఉందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన ద్వారా ప్రాథమిక తరగతి నుండి విద్యార్థులకు కంప్యూటర్ జ్ఞానాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధతో పాటు నిపుణులైన ఉపాధ్యాయులచే ఒత్తిడి లేని చదువు అందించబడుతుందని పరమేశ్వర్ అన్నారు. పిల్లల మానసిక ఆరోగ్యానికి, వ్యక్తిత్వ వికాసానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని, వీటిని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత గ్రామస్తులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువతీ, యువకులపై ఉందని ఆయన నొక్కి చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల మోజులో పడి ఆర్థికంగా నష్టపోకుండా, అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పించి ప్రభుత్వ బడులను కాపాడాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఉదయం పౌష్టికాహారమైన జావా, మధ్యాహ్నం రుచికరమైన భోజనం అందిస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాలం విద్యాసాగర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గోదావరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఐపిఎల్ స్టార్‌ను కలిసిన ప్రధాని మోదీ



**పాట్నా:** వైభవ్ సూర్యవంశీ .. ఐపిఎల్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. ఆ 14 ఏళ్ల కుర్రాడు.. ఈ యేటి ఐపిఎల్‌లో సెంచరీ చేశాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన ఆ టీనేజర్‌ను శుక్రవారం ప్రధాని మోదీ కలుసుకున్నారు. బీహార్ పర్యటనలో ఉన్న మోదీ.. పాట్నా విమానాశ్రయంలో వైభవ్‌ను మీట్ అయ్యారు. వైభవ్ పేరెంట్స్ కూడా మోదీని కలిశారు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సూర్యవంశి వీర ప్రతాపం చూపించి కేవలం 35 బంతుల్లో సెంచరీ కొట్టిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీని కలిసిన సమయంలో.. ఆయన పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్నాడు వైభవ్. యంగ్ క్రికెటర్‌ను కలిసిన విషయాన్ని ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. యువ సంచలన క్రికెటర్, అతని కుటుంబాన్ని పాట్నా ఎయిర్‌పోర్టులో కలుసుకున్నట్లు ఆ పోస్టులో రాశారు. వైభవ్ క్రికెట్ నైపుణ్యాన్ని యావత్ దేశం కీర్తిస్తున్నదని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నట్లు మోదీ తెలిపారు. ఐపిఎల్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశి మొత్తం 252 రన్స్ స్కోర్ చేశాడు. అయితే జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై అతను చెలరేగిన తీరు అద్వితీయం. తన స్ట్రోక్ ప్లేతో యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడతను.

## సడన్‌గా ఇంగ్లాండ్‌కు కేఎల్ రాహుల్..!



**ముంబై:** టీమిండియా క్రికెటర్ కేఎల్ రాహుల్.. హుటాహుటిన ఇంగ్లాండ్ వెళ్లనున్నాడు. సోమవారం అతను ఇంగ్లాండ్ వెళ్లేందుకు సిద్ధం అవుతున్నాడు. జూన్‌లో ఇంగ్లాండ్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు రెడీ అవుతున్న సీనియర్ టీమిండియా క్రికెటర్.. ప్రిపరేషన్ కోసం ముందే వెళ్తున్నట్లు సమాచారం. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపు ఆడిన కేఎల్ రాహుల్.. ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో టూరు చేస్తున్న ఇండియా ఏ జట్టు తరపున ఆడాలనుకుంటున్నాడు. సీనియర్ల టెస్టు సిరీస్‌కు ఎంపికైన అతను.. ప్రాక్టీసు కోసం ముందే ఇంగ్లాండ్‌కు వెళ్లాలనుకుంటున్నాడు. దీని కోసం అతను బీసీసీఐ నుంచి పర్మిషన్ కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంగ్లాండ్ లయన్స్‌తో ఇండియా ఏ జట్టు టెస్టు మ్యాచ్ ఆడనున్నది. మే 30వ తేదీ నుంచి క్యాంటర్ బరీలో తొలి టెస్టు జరగనున్నది అయితే ఆ మ్యాచ్‌ను రాహుల్ అందుకోలేడు. కానీ రెండవ మ్యాచ్‌లో ఆడేందుకు అనుమతి పొందిన కేఎల్ రాహుల్.. తొందరగా ఇంగ్లాండ్ వెళ్లేందుకు రెడీ అయ్యాడు. సోమవారం ఇంగ్లాండ్‌కు రాహుల్ వెళ్తున్నాడని, ఇండియా ఏ తరపున రెండో అనధికార టెస్టులో ఆడనున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

జూన్ 6వ తేదీన ఇండియా ఏ, ఇంగ్లాండ్ లయన్స్ జట్ల మధ్య రెండో అన్‌అఫీషియల్ టెస్టు ప్రారంభంకానున్నది. ఇక సీనియర్ మెన్స్ క్రికెట్ జట్టు జూన్ 13వ తేదీన ప్రాక్టీసు మ్యాచ్ ఆడనున్నది. 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జూన్ 20వ తేదీ నుంచి లీడ్స్‌లో ప్రారంభంకానున్నది.

## చెలరేగిన రోహిత్..

### గుజరాత్ టార్గెట్ 229



**ఛండీగఢ్:** ఐపిఎల్ 2025 ప్లే ఆఫ్స్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ భారీ స్కోరు చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (81; 50 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) దంచికొట్టాడు. జానీ బెయిర్‌స్టో (47; 22 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) త్రుటిలో అర్ధ శతకం మిస్ చేసుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ (33; 20 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), తిలక్ వర్మ (25; 11 బంతుల్లో 3 సిక్స్‌లు), హార్దిక్ పాండ్య (22*; 9 బంతుల్లో 3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించారు. గుజరాత్ బౌలర్లలో సాయి కిశోర్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, సిరాజ్ ఒక వికెట్ పడగొట్టారు.

**రోహిత్ 300 సిక్స్‌లు**

ఈ మ్యాచ్‌లో రోహిత్ నాలుగు సిక్స్‌లు కొట్టిన రోహిత్ ఐపిఎల్‌లో 300 సిక్స్‌లు పూర్తి చేసుకున్నాడు. ఐపిఎల్‌లో 300 సిక్స్‌లు సాధించిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అంతేకాదు ఐపిఎల్‌లో 7 వేల పరుగుల మైలురాయి అందుకున్నాడు. ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 301 సిక్స్‌లున్నాయి. ఆరంభంలో రెండు లైఫ్‌లు అందుకున్న రోహిత్.. తర్వాత బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అతను 28 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు.

# రీల్

## ‘బెంజ్’లోకి ‘భీమ్లా’ నటి?



పలు రంగాల్లో మంచి టాలెంట్ కలిగిన స్టార్స్‌లో రాఘవ లారెన్స్ కూడా ఒకరు. మరి లారెన్స్ హీరోగా, దర్శకునిగా అలాగే సంగీత దర్శకునిగా ఇంకా డాన్స్ మాస్టర్‌గా ఎన్నో సినిమాలు చేసిన తాను లేటెస్ట్‌గా చేస్తున్న సాలిడ్ చిత్రమే బెంజ్. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తన సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా వస్తున్న నాలుగో సినిమాగా తన కథతో దర్శకుడు బక్కియరాజ్ కణ్ణన్ తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ చిత్రంలో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ సంయుక్త మీనన్ లాక్ అయ్యినట్టుగా ఇప్పుడు టాక్ వినిపిస్తుంది. తెలుగులో భీమ్లా నాయక్‌తో ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ అక్కడ నుంచి మంచి సినిమాలు చేస్తూనే బిజీగా ఉంది. ఇక ఈ సాలిడ్ ప్రాజెక్ట్ కోసం లాక్ చేసినట్టుగా కోలీవుడ్‌లో రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది.

## జార్జియాలో ‘అఖండ 2’..

### షూటింగ్ వీడియో వైరల్



నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న సంచలన చిత్రం ‘అఖండ 2’ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమా కీలక షెడ్యూల్ కోసం చిత్ర బృందం జార్జియా చేరుకుంది. అక్కడ బాలయ్యపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ‘అఖండ’ సృష్టించిన ప్రభంజనం తర్వాత, దాని సీక్వెల్ ‘అఖండ–2’ (అఖండ–2 తాండవం)పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించిన చిత్ర యూనిట్, ఇప్పుడు జార్జియాలోని సుందరమైన ప్రదేశాలను ఎంచుకుంది. బోయపాటి శ్రీను ఈ యాక్షన్ బ్లాక్‌లను అత్యంత భారీ ఎత్తున ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో విదేశీ ఫైటర్స్ కూడా పాల్గొననున్నారని తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో కూడా ప్రస్తుతం వైరల్‌గా మారింది. మరోవైపు ఈ జార్జియా షెడ్యూల్‌లోనే బాలయ్య రెండో పాత్రకు సంబంధించిన ఒక భారీ ట్విస్ట్ కూడా రివీల్ అవుతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## తప్పు చేస్తేనే క్షమాపణలు చెబుతా

### కన్నడ భాష వివాదంపై కమల్ హాసన్



తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. కన్నడ భాషపై చేసిన వ్యాఖ్యలకు గానూ ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలనే డిమాండ్లు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా వివాదంపై కమల్ హాసన్ స్పందించారు. ఈ విషయంలో క్షమాపణలు చెప్పేందుకు ఆయన నిరాకరించారు. తప్పు చేసి ఉంటేనే క్షమాపణలు చెప్తానని స్పష్టం చేశారు. ‘నేను తప్పు చేస్తే క్షమాపణలు చెప్తాను. లేదంటే చెప్పను. ఇది నా శైలి. ఈ విషయంలో ప్రజలు జోక్యం చేసుకోవద్దు’ అంటూ చెప్పుకొచ్చారు. భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశం అని తాను చట్టం, న్యాయాన్ని నమ్ముతానని వ్యాఖ్యానించారు.

## పూరి సేతుపతి ప్రాజెక్ట్‌లో రాధికా ఆప్టే?



టాలీవుడ్ అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పూరిసేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. ‘పూరి కనెక్ట్స్’ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించబోతున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం వెల్లడించింది. అయితే ఇటీవల ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.
తాజాగా ఈ వార్తలపై స్పందించింది రాధికా ఆప్టే. మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. తాను ఈ సినిమాలో భాగమైనట్లు తనకే తెలియదని రాధికా ఆప్టే సరదాగా చెప్పారు. ఇలాంటి ఊహాగానాలు తనకు ఆశ్చర్యం కలిగిస్తాయని, ఈ వార్తల గురించి తనకేమీ తెలియదని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాలు చాలా ఫన్నీగా అనిపిస్తాయని వెల్లడించారు.
దర్శకుడు పూరి జగన్నాథ్, నటి చార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో విజయ్ సేతుపతిని ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలో చూపించనున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమవుతుందని సమాచారం.

## హిందూత్వం అమలుకే..

### ఢిల్లీలో నిరుపేదల బస్తీ ఖాళీపై నారాయణ విమర్శ

### కూల్చిన ఇళ్ల స్థానంలో మేడలు కట్టివ్వాలని డిమాండ్



**న్యూఢిల్లీ:** నిరుపేదల బస్తీని ఖాళీ చేయించి దానిని కార్పొరేట్ ఆశ్రిత పెట్టుబడిదారులకు దారాదత్తం చేయడమే బీజేపీ ప్రభుత్వ నిజమైన ఉద్దేశమని సీపీఐ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. పేదలందరినీ తొలగించడం ద్వారా హిందూత్వ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని, ఢిల్లీ నగర పరిధిలో ఎస్‌సీలు, ఎస్‌టీలు లేకుండా చేయాలని చూస్తున్నదన్నారు. పూర్వం రాజుల తరహా పద్ధతులను ఆధునిక పాలకులు అనుసరిస్తున్నారని నారాయణ దుయ్యబట్టారు. ఏ స్థలంలో అయితే కూల్చివేతలు చేపట్టారో అక్కడ బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి, పేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆధునికీకరణ, సుందరికీకరణ, అభివృద్ధి నెపంతో పేదలను తొలగించాలంటే సీపీఐ ఊరుకోదని వక్కాణించారు. నిరుపేద ఢిల్లీవాసుల పోరాటానికి సీపీఐ పూర్తిస్థాయిలో అండగానిలుస్తుందని నారాయణ నొక్కి చెప్పారు. ఢిల్లీలోని మురికివాడల తొలగింపును ఆక్షేపించారు. పేదలకు వారి ఇళ్లు ఉండే స్థలంలో కొత్త భవనాలు కట్టివ్వాలని నొక్కిచెప్పారు. అలా చేస్తే జీవన స్థితిగతులు మెరుగవుతాయని, పేదలకు ఉపాధి లభిస్తుందని, పిల్లలు చదువుకోగలరన్నారు. సిపిఐ ఢిల్లీ సమితి అధ్వర్యంలో నారాయణ, ప్రొఫెసర్ దినేశ్ వార్ష్నే (సీపీఐ ఢిల్లీ కార్యదర్శి), ఢిల్లీ కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్‌లాల్, కేహర్ సింగ్, అబ్బర్ అహ్మద్, సమితి సభ్యుడు బబ్బన్ కుమార్ సింగ్‌తో కూడిన ప్రతినిధుల బృందం శుక్రవారం కూల్చివేతలు జరిగిన మదరాసీ క్యాంపు, జంగ్‌పురా బి బస్తీలో పర్యటించారు. తమిళనాడు నుంచి 5060 ఏళ్ల కిందట వలస వచ్చి ఇక్కడే స్థిరపడిన బాధితులను పరామర్శించారు. ఈ ప్రాంతంలో ఉండేవారు ఢిల్లీలోని నిరుపేదలని, వీరు ఇంటి పనివారిగా, సఫాయి కర్మచారీలుగా, రోజువారీ కూలీలుగా, చిరు విక్రేతలుగా ఉన్నారని ప్రతినిధులు గుర్తించారు. బస్తీ ప్రజల దీనస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ఇక్కడే మేడలు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. సుందరీకరణ పేరిట పేదల ఇళ్లు కూల్చేయడం, నరేలా ప్రాంతానికి 50కిమీల దూరానికి పంపేయాలని అనుకోవడం దుర్మార్గమని నారాయణ అన్నారు. 2024లో నీళ్లు నిలిచిపోవడానికి కారణంగా చెబుతూ పేదల బస్తీని ఖాళీ చేయించడం ఆమోదయోగ్యం కాదన్నారు. మెట్రో రైల్వే నిర్మాణాల వల్ల నీరు నిలిచిందని గుర్తుచేశారు. నీరు నిలిచిపోయే సమస్యను ప్రత్యామ్నాయ మార్గాల్లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కారణాన్ని చూపు తూ పేదల బస్తీని ఖాళీ చేయించి దానిని కార్పొరేట్‌లకు ఊడిగం చేయడమే బీజేపీ ప్రభుత్వ నిజమైన ఉద్దేశమని నారాయణ వ్యాఖ్యానించారు. ఈ చర్యలను సీపీఐ అడ్డుకుంటుందన్నారు.

## నల్లగొండ మార్గదర్శకమవ్వాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా పంటలు, ధాన్యం సేకరణ, నీటి పారుదల విషయాల్లో రాష్ట్రంలోనే నెంబర్ 1 స్థానంలో నిలిచిందన్నారు. ఒకప్పుడు కరువు జిల్లాగా ఉన్నా ఉమ్మడి నల్లగొండ జిల్లా నేడు పాడిపంటలకు నిలయంగా మారిందన్నారు. దేశంలోనే ధాన్యభాండాగారంగా నిలిచిందని చెప్పారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఉమ్మడి నల్లగొండ జిల్లా మార్గదర్శం కావాలన్నారు. అధికారులు ఇప్పటి వరకు ఉన్న నిర్లిప్తతను వదిలి పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి పని చేయాలన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం నుండి ప్రజల సేవలకు తమతో పాటు అధికారులు పునరాంకితం కావాలని కోరారు. జిల్లా కలెక్టర్‌ల ఆధ్వర్యంలో అధికారులందరు ప్రతిభావంతంగా పని చేయాలన్నారు. నీటి పారుదల విషయంలో కృష్ణ జలాలను పూర్తి స్థాయిలో వాడుకునేందుకు తమ ప్రభుత్వ హాయాంలోనే ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌ను పూర్తి చేస్తామన్నారు. వివిధ సంక్షేమ పథకాల అమలులో ప్రజా ప్రతినిధుల సూచనలను పరిగణలో తీసుకోవాలని అధికారులను సూచించారు. శాసన సభ్యుల మాటే చివరి మాటగా పాటించాలన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం లోపు సివిల్ పనులన్నింటిని టెండర్లు, ఇతర పనులు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ సామర్థ్యం కలిగిన గోడాంలను మంజూరు చేస్తామని, ఇందుకు గాను స్థల సేకరణ చేయాలని కలెక్టర్‌లను కోరారు. ఎఈఓల కొరత తీవ్రంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశం దృష్టికి తీసుకరాగా కలెక్టర్‌లకే వారి నియమించుకునే అధికారం ప్రభుత్వం ఇచ్చిందన్నారు. సత్వరమే నియమకాలు చేపట్టుకోవాలన్నారు.

**చివరి గింజ వరకూ కొనుగోలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే : మంత్రి ఉత్తమ్**

దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసిన ఘతన తమ కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాంలో 29మే 2023 నాటికి రాష్ట్రంలో యాసంగి వరి ధాన్యాన్ని కేవలం 47లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే తమ ప్రభుత్వం 29 మే నాటికి ఈ సీజన్‌లో 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు. రానున్న ఐదు సంవత్సరాల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరం ద్వారా సాగునీటిని అందించనప్పడికి ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 2లక్షల 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని చెప్పారు. దేశంలో తెలంగాణ నెంబర్ 1గా నిలిచిందని తెలిపారు. ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి ప్రాజెక్టులకు ఆయకట్టు ప్లాన్ ముందే సిద్ధం చేసి ప్రకటిస్తామన్నారు. ఎస్‌ఆర్‌ఎస్‌పితో పాటు ఇతర ప్రాజెక్టుల్లోని పూడికతీత పనులను ప్రభుత్వం చేపడుతుందన్నారు.
గతంలో మొదలు పెట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులను ఎంపిక చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో నిబంధనలనను ఉల్లంగించవద్దని, ఉల్లంగించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవన్నారు.

**సన్నబియ్యం పంపిణీతో ప్రభుత్వానికి మంచిపేరు : మంత్రి కోమటిరెడ్డి**

సన్నబియ్యం పంపిణీతో ప్రభుత్వానికి మంచిపేరు వచ్చిందని రాష్ట్ర రోడ్ల, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో లేకున్నా సన్నబియ్యం పంపిణీతో పాటు లక్షలాది మంది నిరుద్యోగ యువతకు రాజీవ్ యువవికాసం ద్వారా రాయితీపై బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తాము ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాలో 12లక్షల ఎకరాల భూములు సాగులో ఉన్నాయని గతంతో పోలిస్తే ఈ సంవత్సరం 2లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఎక్కువగా రైతులు పండించారని చెప్పారు. ఈ ధాన్యం సేకరణలో నల్లగొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠిని అభినందించారు. తమ శాఖ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అత్యధికంగా రూ. 1700ల కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించినట్లు వెల్లడించారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ పూర్తి చేయడంలో అధికారులను వారు అభినందించారు. ఈ సమావేశంలో తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి కలెక్టర్లు త్రిపాఠి, హన్మంతరావు, జిల్లా ఎస్‌పి కె నర్సింహ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గోరక్షకులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు : డిజిపి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** బక్రీద్ పండగ నేపథ్యంలో తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. జూన్ 7న ముస్లిం సోదరులు జరుపుకోనున్న బక్రీద్ పండగ నేపథ్యంలో శుక్రవారం డిజిపి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, అదనపు డిజిపి కమిషనర్ మహేష్ ఎం. భగవత్, ఐజిపి మల్టీజోన్1 ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, రాచకొండ కమిషనర్ జి. సుధీర్ బాబు, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి పలు కీలక సూచనలు జారీ చేశారు. రాష్ట్రంలో గోరక్షకులు ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించారు. ఆవులను అక్రమంగా తరలిస్తున్నట్టు అనిపిస్తే పోలీసుల దృష్టికి తీసుకు రావాలని కోరారు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. హైదరాబాద్‌తో సహా రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, ఎవరైనా ఆవుల అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలంతా ప్రశాంతంగా కలిసి మెలసి బక్రీద్ జరుపుకోవాలని జితేందర్ పిలుపునిచ్చారు.

## మేరకే ఇళ్ల నిర్మాణం

**(మొదటి పేజీ తరువాయి)**

చేశామని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, 200 యునిట్లు కరంటు, 500లకే గ్యాస్ రేషన్‌షాపులో సన్నబియ్యాం పంపిని చేపట్టామన్నారు. హుస్నాబాద్‌కు 150 ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని, డిగ్రీ కాలేజిలో కంప్యూటర్ ఏర్పటు చేశామని, శాతవాహన యునివర్సిటి ఇంజనీరింగ్ కాలేజి ఏర్పాటు చేశామన్నారు. కొహెడ మండలంలో నియోజకవర్గ స్థాయిలో యంగ్ ఇండియా సమీకృతా ఇంటి గ్రేటెడ్ స్కూల్‌ను 200కోట్లతో నిర్మిస్తున్నామని తెలపారు. నియోజకవర్గంలో ఎక్కడ రోడ్లు సమస్య, త్రాగు నీటి సమస్యలే లేకుండ చేశామని తెలిపారు. ప్రతి లబ్దిదారుడు ఇల్లు కట్టుకుని సంతోషంగా ఉండాలని కోరారు. ఈ కా ర్యక్రమంలో అర్‌డివో రామూర్తి, తహశీల్‌దా రు, గృహనిర్మాణ శాఖ అధికారి, సహకార సంఘం చైర్మెన్ బొల్లిశెట్టి శివయ్య, చిత్తారి పద్మ రవిందర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జాతీయ అవార్డు



**(మొదటి పేజీ తరువాయి)**

అవార్డులను ఈ కమిటీ గురువారమే ప్రకటించగా.. మిగతా పదేళ్లకు సంబంధించిన అవార్డులను శుక్రవారం మధ్యాహ్నం ప్రకటించింది. అనంతరం జాబితాను సిఎం ఎ.రేవంత్‌రెడ్డికి జ్యూరీ సభ్యులు స్వయంగా కలిసి అందజేశారు.

**ఉత్తమ చిత్రాలు ఇవే..**

2014 ఉత్తమ చిత్రంగా రన్ రాజా రన్, రెండో ఉత్తమ చిత్రంగా పాఠశాల,
మూడో ఉత్తమ చిత్రంగా అల్లుడు శీను
2015ఉత్తమ చిత్రం: రుద్రమదేవి, రెండో ఉత్తమ చిత్రంగా కంచె, మూడో ఉత్తమ చిత్రంగా శ్రీమంతుడు
2016 ఉత్తమ చిత్రంగా శతమానం భవతి, రెండో ఉత్తమ చిత్రంగా పెళ్లిచూపులు,
మూడో ఉత్తమ చిత్రంగా జనతా గ్యారేజ్
2017 ఉత్తమ చిత్రంగా బాహుబలి కంక్లూజన్, రెండో ఉత్తమ చిత్రంగా ఫిదా, మూడో ఉత్తమ చిత్రంగా ఘాజీ
2018ఉత్తమ చిత్రంగా మహానటి, రెండో ఉత్తమ చిత్రంగా రంగస్థలం, మూడో ఉత్తమ చిత్రంగా కేరాఫ్ కంచర్లపాలెం
2019ఉత్తమ చిత్రంగా మహర్షి, రెండో ఉత్తమ చిత్రంగా జెర్సీ, మూడో ఉత్తమ చిత్రంగా మల్లేశం
2020 ఉత్తమ చిత్రంగా అల వైకుంఠపురంలో, రెండో ఉత్తమ చిత్రంగా కలర్ ఫోటో,
మూడో ఉత్తమ చిత్రంగా మిడిల్ క్లాస్ మెలొడీస్
2021ఉత్తమ చిత్రంగా ఆర్‌ఆర్‌ఆర్, రెండో ఉత్తమ చిత్రంగా అఖండ,
మూడో ఉత్తమ చిత్రంగా ఉప్పెన
2022 ఉత్తమ చిత్రంగా సీతారామం, రెండో ఉత్తమ చిత్రంగా కార్తికేయ 2,
మూడో ఉత్తమ చిత్రంగా మేజర్
2023ఉత్తమ చిత్రంగా బలగం, రెండో ఉత్తమ చిత్రంగా హనుమాన్,
మూడో ఉత్తమ చిత్రంగా భగవంత్ కేసరి
విజయ్ దేవరకొండకు ప్రత్యేక అవార్డు..

## అసలు స్టంట్ రేటెంత?

**(మొదటి పేజీ తరువాయి)**

రోడ్డులోని పాత రిజిస్టర్ ఆఫీస్ సందులో గల ఒక ఆసుపత్రికి బోనకల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి ఛాతీ నొప్పితో వచ్చాడు. పైన పేర్కొన్నట్లు హడావుడి సృష్టించి రూ.1.80లక్షలు గుంజిపారేశారు. ఇదేమని ఆయన బంధువులు, కొందరు పెద్ద మనుషులు అడిగితే ఆ ఆసుపత్రి నిర్వహకుడు అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. అసలు స్టంట్ రేటెంత అంటే నీళ్లు నమిలాడు. రూ.70వేల స్టంట్‌కు రూ.1.80 లక్షలు గుంజారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించవచ్చు. చివరగా ఆయన చెప్పొచ్చేదేమిటంటే నేను బిల్లు తగ్గిస్తే మరి ఆర్‌ఎంపికి ఎవరు ఇవ్వాలి అని ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. ఎవరికో కమిషన్ ఇవ్వడం కోసం రోగులను పీల్చి పిప్పి చేయడం ఏమిటంటే ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ అడ్డంగా వాదించాడు. ఇది ఒక ఆసుపత్రికో ఒక రోగికో పరిమితం కాలేదు. చాలా ఆసుపత్రుల్లో ఇదే తంతు. అసలు వైద్యానికి అయ్యే ఖర్చు ఎంత అన్నది కాదు. రోగి కట్టే స్థాయి ఎంత, అతని వద్ద నుంచి ఎంత గుంజుకోవచ్చునన్నదే ఇప్పుడు ఆసుపత్రుల నిర్వహకుల ఆలోచనగా మారింది. వైద్య రంగంలో తలమానికంగా ఉన్న ఖమ్మం నగరంలో కొందరి శృతి మించిన దోపిడీ రోగుల పాలిట శాపంగా మారింది. ఏ వైద్యమైనా కాసులకు కక్కుర్తి పడుతున్నారు. ఒక్కొక్కరు మూడు నాలుగు పేర్లతో ఆసుపత్రులు నిర్వహిస్తూ అడ్డంగా దోపిడీ చేస్తున్నారు. ఇదే సమయంలో ఆర్థిక పరిస్థితులను గమనించి అతి తక్కువ ఖర్చుతో వైద్య సాయం అందించి బీద బిక్కి పట్ల సానుభూతితో వ్యవహరించే ప్రైవేటు ఆసుపత్రుల యజమాన్యాలు కూడా ఉండడం గమనార్హం. సెతస్కోప్ పట్టుకుందే డబ్బు సంపాదించడానికి అన్న ధోరణితో వ్యవహరించే వారిని ఎవరు నియంత్రించాలన్నదే ఇప్పుడు ప్రజలను వేధిస్తున్న ప్రశ్న.

**వైద్యాధికారుల పర్యవేక్షణ ఏదీ?**

ప్రైవేటు ఆసుపత్రుల్లో పరీక్షల మొదలు ఐసియు వరకు దేనికి ఎంత వసూలు చేయాలనే బోర్డులు ఉంటాయి. వాటిని అతిక్రమిస్తే చర్యలుంటాయన్న హెచ్చరికలు పక్కనే ఉంటాయి. కానీ అవి ఎప్పుడు గోడకు అలా వ్రేలాడుతూనే ఉంటాయి. ఆ బోర్డులో ఉన్న ప్రకారం వసూలు చేయడం జరగదు. అదే సమయంలో చర్యలు తీసుకున్న దాఖలాలు ఉండవు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత కంప్యూటర్ బిల్లులు ఇచ్చే ఆసుపత్రుల సంఖ్య వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. అంత తెల్ల కాగితంపై పెన్నుతో రాయడం ఇది ఫలానా ఆసుపత్రి బిల్లు అంటే అసలు ఆ రోగే మా ఆసుపత్రిలో చేరలేదని బుకాయించడం అలవాటుగా మారింది. ఇంత జరుగుతున్న వైద్య ఆరోగ్య శాఖ ఏమి చేస్తుందంటే ఏమి చేయడం లేదన్న సమాధానమే వస్తుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com